

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..



HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ సంపుటి: 2 • సంచిక: 41 • పేజీలు:12+16 • వెల: రూ.5 గురువారం • 11-1-2018 www.manamnews.com /manamnews



అమెరికాలో వరద.. బురద

కాలిఫోర్నియాలో 12.5 సెం.మీ. వర్షం.. కొండచరియలు విరిగిపడి ఇళ్లు ధ్వంసం

ఇళ్లలోకి ముంచుకొచ్చిన బురద ప్రవాహం

13 మంది మృతి.. 20 మంది గల్లంతు

లాస్ ఏంజిలిస్, జనవరి 10: కాలిఫోర్నియాను వణికిస్తున్న తుఫాను మంగళవారం తీవ్ర రూపం దాల్చడంతో కుండపోత వర్షం కురిసింది. వెంచురా కౌంటిలో ఏకంగా 12.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షంతో వరద మిగతా 6లో..





'ఎంపీలాడ్స్'... మరో మూడేళ్లు

2020 మార్చిదాకా పొడిగింపు

టీవీఎస్‌పీఎల్ మూసివేతకు ఓకే

కేంద్ర కేబినెట్ భేటీ నిర్ణయాలు



కేంద్రీయ విద్యాలయాల్లో

హిందూ ప్రార్థనలా?

వివరణ ఇవ్వండి..

కేంద్రానికి సుప్రీం ఆదేశం

బ్రిటన్ కేబినెట్‌లో

నారాయణమూర్తి అల్లుడు

మరో భారతీయుడికీ చోటు..

మిగతా 7లో..



సహకరించండి

తెలంగాణలో ప్రతిష్ఠాత్మక పథకాలు

ఐపాస్.. ఈవోడీబీలలో దేశంలోనే ఫస్ట్

ఫార్మాసిటీకి 'నిమ్జ్' స్టేటస్.. నిధులివ్వండి

స్పైసెస్ పార్కు నిధులూ విడుదల చేయాలి

కేంద్ర మంత్రి సురేశ్ ప్రభుకు కేటీఆర్ వినతి

హైదరాబాద్, జనవరి 10 (మనం ప్రతినిధి):

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పథకాల అమలుకు అన్ని విధాలుగా సహకరించాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి సురేశ్ ప్రభును రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కె. తారక రామారావు కోరారు. బుధవారం ఢిల్లీలోని ఉద్యోగ్ భవన్ లో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి సురేశ్‌ప్రభును మిగతా 6లో..

ప్రైవేటు పండుగ

సంక్రాంతి పేరుతో ధరల మోత



బస్సు టికెట్ల ధరలు భారీగా పెంపు

రైళ్లు.. ఆర్టీసీ బస్సులు ఇప్పటికే ఫుల్

రెండు.. మూడురెట్లు పెరిగిన చార్జీలు

బ్లాబ్లా కార్లకూ ఒక్కసారిగా డిమాండ్

విమానాల టికెట్ ధరలు ఆకాశంలోనే

హైదరాబాద్, జనవరి 10:


సంక్రాంతి సీజన్ అనగానే అందరికీ పండగే. కొత్త సినిమాలను విడుదల చేయడానికి ఈ సీజన్‌నే ఎంచుకుంటారు. అలాగే ప్రతి ఒక్కరూ సొంత ఊళ్లు వెళ్లడానికి సిద్ధం అవుతుండటంతో ఒక్కసారిగా మిగతా 6లో..

ఇదీలోకం!



ఈ వార్త తెలిసిన సంతోషంలో గాల్లోనే ఎగురుతున్నాడు... మావాడు..!

'సింగిల్ బ్రాండ్'.. 100 పర్సెంట్



విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ఎర్ర తివాచీ



'స్థిరాస్తి మధ్యవర్తిత్వ సేవ'ల్లోనూ అనుమతి

'ఎయిరిండియా'లో 49% వాటా విక్రయం

పవర్ ఎక్స్ఛేంజీలలో ఎఫ్ఐఐలకు పచ్చజెండా

వాణిజ్య సౌలభ్యం దిశగా ఎఫ్‌డీఐ సంస్కరణ

కేంద్ర మంత్రిమండలి సమావేశంలో ఆమోదం

న్యూఢిల్లీ, జనవరి 10:

ఈ నెలలో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు జరగనున్న నేపథ్యంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) విధానాన్ని కేంద్ర ప్రభుత్వం మరింత సరళీకరించింది. దేశంలోని కీలక రంగాల్లో ఎఫ్‌డీఐ కోసం ఆటోమేటిక్ మిగతా 6లో..

చెక్కులే కావాలి

'పంట పెట్టుబడి'కి అదే మేలు

మెజార్టీ అన్నదాతల అభిప్రాయం

62 వేల మంది రైతుల మొగ్గు

రాష్ట్రంలో 71.75 లక్షల రైతులు

1.42 కోట్ల ఎకరాల సాగుభూమి

రైతులందరికీ పెట్టుబడి వర్తింపు

త్వరలోనే సీఎంకు నివేదిక: పోచారం



హైదరాబాద్, జనవరి 10 (మనం ప్రతినిధి):

పంట పెట్టుబడి పథకం కింద ఆర్థిక సాయాన్ని చెక్కుల రూపంలోనే ఇవ్వాలని ఎక్కువ మంది రైతులు కోరినట్లు తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో సాగుకు పెట్టుబడి మద్దతుపై మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సచివాలయంలో బుధవారం సమావేశమై చర్చించింది. సమావేశం ముగిసిన తర్వాత మంత్రి మీడియాతో మాట్లాడారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి రైతులకు ఎకరాకు రూ. 4 వేలు ఆర్థిక సాయం చేయనున్నట్లు తెలిపారు. రైతులకు పెట్టుబడి మద్దతు చెల్లింపు విధివిధానాలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు దాదాపు 626 గ్రామాల్లో 62,371 మంది రైతుల అభిప్రాయాలు సేకరించామని చెప్పారు. పెట్టుబడి సాయం నేరుగా చెక్కుల రూపంలో ఇవ్వాలని మిగతా 6లో..

వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో గురువారం వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రత స్వల్పంగా పెరుగుతుంది. చలి గాలులు వణికిస్తాయి. గంటకు 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 31 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 17 డిగ్రీలు

గాలిలో తేమ: 55 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథి: దశమి సా.7.11 తదుపరి ఏకాదశి; నక్షత్రం: విశాఖ పూర్తి; వర్జ్యం: ఉ.11.09-12.55; దుర్ముహూర్తం: మ.2.59-4.27; రాహుకాలం: మ.1.47-3.10; అమృతఘడియలు: రా.9.46-11.32; శుభసమయం: మ.1.00-1.30.

సూర్యోదయం: 6.53

సూర్యాస్తమయం : 5.55



ఏపీకి 60.. తెలంగాణకు 50 టీఎంసీలు

కృష్ణానదిలో నీటి వాటాపై కృష్ణాబోర్డు

అందుబాటులో ఉన్న జలాల పంపకం

హైదరాబాద్, జనవరి 10 (మనం ప్రతినిధి): కృష్ణా నదిలో అందుబాటులో ఉన్న జలాలను ఆంధ్రప్రదేశ్ 60, తెలంగాణ 50 టీఎంసీల చొప్పున వినియోగించుకోవాలని కృష్ణా నీటియాజమాన్య బోర్డు మిగతా 6లో..

ఆధార్.. '16'

సమాచార భద్రత దిశగా కల్పిత గుర్తింపు



మార్చి 1 నుంచి శ్రీకారం... యూఐడీఏఐ

31కల్లా ధ్రువీకరణ సంస్థలన్నిటా అమలు

జూన్ 1 నుంచి కొత్త విధానం తప్పనిసరి

న్యూఢిల్లీ, జనవరి 10:

'ఆధార్'లో 12 అంకెలే ఉంటాయి కదా! ఈ 16 అంకెల వ్యవహారమేమిటన్న సందేహం వచ్చిందా? ఇది విశిష్ట గుర్తింపు సంఖ్య ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) శ్రీకారం చుడుతున్న కొత్త వ్యవస్థ. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల మిగతా 6లో..

12 లోపు నెల వేతనం ఇవ్వండి

- బిల్ట్ యాజమాన్యానికి కడియం సూచన
- 'మనం' కథనంతో కదలిక

హైదరాబాద్, భూపాలపల్లి, జనవరి 10(మనం ప్రతినిధి): ఈ నెల 12 లోపు కార్మికులకు ఒక నెల వేతనం చెల్లించాలని బిల్ట్ యాజమాన్యానికి డిప్యూటీ సీఎం కడియం ఆదేశించారు. నెలల తరబడి మూతబడిన బిల్ట్ కార్మికుల ఆకలి కేకలను, యాజమాన్య నిర్లక్ష్యాన్ని ఈ నెల 9న 'అంపశయ్యపై బిల్ట్' అనే శీర్షికన మనం వెలుగులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే! దీంతో ప్రభుత్వంతో పాటు బిల్ట్ యాజమాన్యంలో కదలిక వచ్చింది. ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి నేతృత్వంలోని మంత్రుల బృందం.. హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, గిరిజన శాఖ మంత్రి చందూలాల్, ఎంపీ సీతారాం నాయక్‌లు బిల్ట్ యాజమాన్య ప్రతినిధులు, కార్మిక సంఘాల ప్రతినిధులతో బుధవారం నాడు సచివాలయంలో చర్చలు జరిపారు. ఈ క్రమంలో 12 లోపు కార్మికులకు ఒక నెల వేతనం చెల్లించాలని ఫ్యాక్టరీ సీఈవో అగర్వాల్‌ను ఆదేశించారు. అదేవిధంగా ఫిబ్రవరి 14లోపు ఫ్యాక్టరీ భవితవ్యాన్ని తేల్చాలని చెప్పారు. పేపర్ పల్ప్‌కు ధర పెరగడంతో ఫ్యాక్టరీని పేపర్ పల్ప్ ఫ్యాక్టరీగా మార్చి నడిపించే ప్రతిపాదనలను పరిశీలించాలని మంత్రులు సూచించారు. లేని పక్షంలో ఫ్యాక్టరీని మూసివేయాలనుకుంటే కార్మికులకు రావాల్సిన అన్ని బకాయిలు చెల్లించాలన్నారు. దీనికి సంబంధించి ఫిబ్రవరి 14వ తేదీన కంపెనీ బోర్డ్ మీటింగ్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఫ్యాక్టరీ సీఈవో చెప్పారు. దీనికి సమ్మతించిన మంత్రుల బృందం.. ఈసారి తుది నిర్ణయం తీసుకోవాలని, వాయిదా వేయడం కుదరదని స్పష్టం చేసింది. ఒకవేళ ఫ్యాక్టరీ యాజమాన్య తమ నిర్ణయాన్ని తీసుకోలేకపోతే ఫ్యాక్టరీ మేనేజ్ మెంట్ పై ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రభుత్వం చూసుకుంటుందని కడియం హెచ్చరించారు. కంపెనీ నిర్ణయంపై



చర్చించేందుకు ఫిబ్రవరి మూడో వారంలో మరోసారి భేటీ కావాలని మంత్రులు నిర్ణయించారు. కాగా, వీలైనంత వరకు ఫ్యాక్టరీ నడపడానికి యాజమాన్యాన్ని ఒప్పించాలని అగర్వాల్‌కు డిప్యూటీ సీఎం కడియం చెప్పారు. ఈ సమావేశంలో కార్మిక శాఖ కమిషనర్ అహ్మద్ నదీమ్, జాయింట్ కమిషనర్ భాగ్య నాయక్, బిల్ట్ డీజీఎం వై.కేశవరెడ్డి, బిల్ట్ కార్మికుల జేఏసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మసాలా దొరుకుతోంది..

- జనాలు మాట్లాడుకుంటున్నారు: టీవీ యాంకర్ రవి
- 'చలపతిరావు' వ్యాఖ్యల కేసులో కోర్టుకు హాజరు

హైదరాబాద్, జనవరి 10 (మనం ప్రతినిధి): ''ఇప్పుడు నేను మాట్లాడదలచుకోలేదు. దీని వల్ల జనాలకు మసాల దొరుకుతుంది.. జనాలు మాట్లాడుకుంటున్నారు. అది నాకు నచ్చడం లేదు. నేను చాలా ఇరుక్కున్నాను. ఇప్పుడు చాలా మారాను. లేనిపోనిది సృష్టించి ఇష్టానుసారంగా రాసుకుంటున్నారు. అందుకే ఇప్పుడేమీ నేను మాట్లాడదలుచుకోలేదు. దయచేసి అర్థం చేసుకోండి'' అని టీవీ యాంకర్ రవి వ్యాఖ్యానించారు. బుధవారం నాంపల్లి కోర్టుకు బుల్లితెర యాంకర్ రవి హాజరయ్యారు. గతంలో నటుడు చలపతిరావు మహిళలపై చేసిన అసభ్య వ్యాఖ్యలను రవి సమర్థించడానే అభియోగంపై కోర్టుకు హాజరుకావాల్సి వచ్చింది. వాయిదా అనంతరం రవి మాట్లాడుతూ.. కోర్టు విచారణ ఇంకా కొనసాగుతుంది. ప్రస్తుతం ఈ కేసు ఫిబ్రవరి 7వ తేదీకి వాయిదా పడిందన్నారు.



74.71 లక్షల పాత కరెన్సీ స్వాధీనం

- పాత కరెన్సీ మార్పిడి ముఠా గుట్టు రట్టు

హైదరాబాద్, జనవరి 10, మనం ప్రతినిధి : పాత కరెన్సీ మార్పిడి చేసే ముఠాను మల్కాజిగిరి జోన్ ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఉప్పల్ పోలీస్ స్టేషన్లో మల్కాజిగిరి ఏసీపీ సందీప్‌రావు బుధవారం విలేకర్లకు వివరించారు. రాజస్థాన్‌కు చెందిన మహమ్మద్ హఫీజ్ హైదరాబాద్‌లోని ముర్గీచౌక్‌లో గాజులు తయారు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తలాబ్‌కట్టకు చెందిన అదిల్, ఘాజీ బజార్‌కు చెందిన బాబుభాయ్, మరోక మైనర్‌తో కలిసి రద్దు చేసిన పాత కరెన్సీని మారుస్తామంటూ ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలోనే రూ. లక్షకు ఇరవైశాతం కమీషన్‌తో పాత కరెన్సీ మార్పిడి చేస్తామని సన్నిహితులు, బంధువుల నుంచి సుమారు రూ. 74.71లక్షల పాత కరెన్సీని సేకరించారు. ఉప్పల్‌లోని ప్రశాంత్‌నగర్‌లో తన దగ్గర ఉన్న 74.71 లక్షలను ప్లాస్టిక్ కవర్లో చుట్టి రెండు మోటార్ సైకిళ్లపై దాచి మధ్య వర్తుల కోసం అదిల్‌తో కలిసి హఫీజ్ ఎదురు చూస్తున్నారు. పక్కా సమాచారంతో ఓస్‌వోటీ పోలీసులు నిఘా ఏర్పాటుచేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద గల పాత కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు.

సాగుచేసిన రైతుకే 'పెట్టుబడి': జీవన్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 10 (మనం ప్రతినిధి): సాగు చేస్తున్న రైతుకే పెట్టుబడి ప్రోత్సాహకం ఇవ్వాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే టీ. జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కౌలు రైతులు, పట్టే దారు రైతులకు తేడా లేకుండా పెట్టు బడి ఇవ్వాలని అన్నారు. బుధవారం సీఎల్పీలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం చెప్తున్నది ఒకటి... చెసేది మరోలా ఉందని జీవన్‌రెడ్డి మండిపడ్డారు. పంట నష్టం అయితే కూడా ప్రభుత్వం బోనస్ ప్రకటించలేదని ఆరోపించారు. ఈ రబీలోనైనా బోనస్ కల్పించాలని డిమాండ్ చేశారు. పెట్టుబడి ఇస్తున్నామని ప్రచారం చెసుకుంటున్నారని జీవన్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. కానీ తెలంగాణ రైతులపై ఈ ప్రభుత్వానికి ఎక్కడా చిత్తశుద్ధిలేదన్నారు.మంత్రి హరీశ్‌రావు టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని మార్కెట్ చేయడానికి బాగానే పనిచేస్తున్నారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

ఇంటర్ కాలేజీలకు 13 నుంచి సంక్రాంతి సెలవులు

హైదరాబాద్, జనవరి 10(మనం ప్రతినిధి): రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీలకు ఈనెల 13 నుంచి 15 వరకు సంక్రాంతి సెలవులను ఇంటర్ బోర్డు ప్రకటించింది. సెలవుల్లో తరగతులు నిర్వహించొద్దని జూనియర్ కాలేజీలకు ఇంటర్ బోర్డు ఆదేశాలు జారీ చేసింది. ఇంటర్ బోర్డు ఆదేశాలకు విరుద్ధంగా ఎవరైనా తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించింది.

తెలంగాణ ప్రతిభను చాటాలి

- పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం

హైదరాబాద్, జనవరి 10 (మనం ప్రతినిధి): జాతీయ స్థాయిలో తెలంగాణ ప్రతిభను చాటాలని పర్యాటకశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం క్రీడాకారులకు సూచించారు. బుధవారం సచివాలయంలో టగ్ ఆఫ్ వార్ క్రీడాకారులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ నెల 13 నుంచి 18 వరకు పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి టగ్ ఆఫ్ వార్ క్రీడల్లో పాల్గొనడానికి తెలంగాణ నుంచి 27 మంది క్రీడాకారులు ఎంపికైనట్టు వెల్లడించారు. వారిలో 13 మంది బాలికలు, 14 మంది బాలురులున్నారని తెలిపారు.

ఒక దరఖాస్తుకే 'ఎడిట్'!

- టీఆర్టీ అభ్యర్థుల్లో గందరగోళం

హైదరాబాద్, జనవరి 10(మనం ప్రతినిధి): ఉపాధ్యాయ నియామక పరీక్ష(టీఆర్టీ) కోసం దరఖాస్తు చేసుకున్న వారు వాటిలో తమ వ్యక్తిగత వివరాలను సరిగా నమోదు చేయకపోతే వాటిని సరిచేసుకునేందుకు టీఎస్‌పీఎస్సీ ఈనెల 8 నుంచి 11 వరకు అన్‌లైన్‌లో అవకాశం ఇచ్చింది. కానీ టీఆర్టీ దరఖాస్తుల ఎడిట్ ఆప్షన్ ప్రక్రియలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఒక దరఖాస్తును మాత్రమే సవరించుకొనేలా వెబ్‌సైట్‌లో అవకాశం కల్పించారు. దీంతో ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఎడిట్ చేసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

భర్తలను చంపిన భార్యలు

- వేధింపులు తట్టుకోలేకే..
- మధ్యాహ్నం గొడవ.. రాత్రికి హత్య
- కన్నతండ్రితో కలిసి దారుణం
- జాకెట్‌తో మెడకు ఉరి బిగించి..
- ఆత్మహత్య చేసుకున్నాడని ప్రచారం
- బాధితురాలికి గ్రామస్థుల దేహశుద్ధి
- ఖమ్మం జిల్లాలో దారుణం
- మద్యం మత్తులో భార్యను చంపిన భర్త



అశ్వాపురం, కారేపల్లి, వాజేడు, జనవరి 10(మనం న్యూస్): పచ్చని కాపురంలో మద్యం చిచ్చు పెట్టిందో.. నిత్యం జరుగుతున్న వేధింపులను తట్టుకోలేక భర్తలనే కడతేర్చారు. బుధవారం నాడు ఖమ్మం జిల్లాలో ఇద్దరు మహిళలు తమ తమ భర్తలనే చంపేశారు. ఆలుమగల మధ్య చిలికి చిలికి గాలివానగా మారిన గొడవతో కట్టుకున్న భార్య, పిల్లనిచ్చిన మామ కలిసి ఆ యువకుడిని యమపురికి పంపించారు. మరో ఘటనలో తాగొచ్చి తంతున్న భర్తను భరించలేక జాకెట్‌తో ఉరితీసిందో భార్య.. ఆపై పురుగు మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడని నమ్మించే ప్రయత్నం చేసింది. అయితే, మృతదేహంపై గాయాల గుర్తులు చూసి గ్రామస్థులు అనుమానించారు. నిందితురాలికి దేహశుద్ధి చేసి ప్రశ్నించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. వివరాలు..

అశ్వాపురం మండల పరిధిలోని మారుమూల రాంనగర్ గొత్తి కోయల గుంపుకు చెందిన ఆదివాసి యువకుడు మంగళవారం రాత్రి భార్య, మామ చేతిలో హతమయ్యాడు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాకు చెందిన కొర్స రేవయ్య(22) రెండేళ్ల క్రితం రాంనగర్ వలసవచ్చి స్థానికంగా జీవించే సోడె నందయ్య కుమార్తె లక్ష్మిని వివాహం చేసుకున్నాడు. అయితే కొద్ది రోజులుగా భార్య, భర్తల మధ్య వివాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి కూడా గొడవ జరుగగా లక్ష్మి, ఆమె తండ్రి నందయ్య కలిసి కర్రతో దేవయ్యపై దాడి చేయటంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్థుల సమాచారంతో అశ్వాపురం సీఐ అల్లం నరేందర్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపిరాడకుండా చేసి..

కారేపల్లి మండలం సామ్యాతండాలో మంగళవారం రాత్రి ఈ దారుణం చోటుచేసుకుంది. తండాకు చెందిన బానోతు శ్రీను(35) కూలీ పనులు, రైల్వే కాంట్రాక్టర్ వద్ద పనులు చేసుకుంటున్నాడు. భార్య లక్ష్మి ఇల్లందు వెళ్ళి కూరగాయల వ్యాపారం చేస్తుంది. ప్రతి రోజు మద్యం సేవించి ఇంటికివచ్చే శ్రీను భార్యతో నిత్యం గొడవకు దిగేవాడు. మంగళవారం రాత్రి కూడా ఇద్దరి మధ్య వివాదం జరిగి అనంతరం నిద్రకు ఉపక్రమించారు. తెల్లవారుజామున భర్త శ్రీను పురుగు మందు త్రాగి మృతి చెందాడంటూ చుట్టుపక్కల వారికి బంధువులకు ఫోన్‌లో కబురు చేసింది. మృతుని ఇంటివద్దకు చేరుకున్న బంధువులకు, గ్రామస్తులకు పురుగుమందు త్రాగిన ఆనవాళ్లు ఏమిలేక పోవటంతో హత్యచేసి ఆత్మహత్యగా నమ్మించేయత్నం చేస్తోందని ఆగ్రహించారు. లక్ష్మికి దేహశుద్ధి చేయటంతో అమె అక్కడి నుండి పరారై కారేపల్లి పోలీసు స్టేషన్‌లో లొంగి పోయింది. మద్యం సేవించటం, నిత్యం అనుమానిస్తూ వేధిస్తుండటంతో తానే జాకెట్‌తో మెడకు ఉరివేసినట్లు లక్ష్మి ఒప్పుకున్నట్లు సమాచారం. కారేపల్లి ఎస్సై ఏ.కిరణ్‌కుమార్ ఘటనాస్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. శ్రీను తండ్రి దస్రు ఇచ్చిన పిర్యాదు మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మత్తులో ఆలిని కడతేర్చి..

మద్యం మత్తులో భార్యను హతమార్చిన సంఘటన వాజేడు మండల పరిదిలోని కృష్ణాపురం గ్రామంలో బుదవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... కృష్ణాపురం గ్రామానికి చెందిన దుమారి లక్ష్మయ్య, బార్య బానక్క(35)లు గత 15 సంవత్సరాలుగా వ్యవసాయ కూలీలుగ పని చేసుకుంటున్నారు. కాగా వీరికి 11 సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. లక్ష్మయ్య, బార్య బానక్కలు ఇరువురు మద్యానికి బానిసలై తరచూ గొడవలు జరిగేవని, ఈ మేరకు బుదవారం ఇరువురు మద్యం సేవించు గొడవ పడుతుండడంతో భార్య భర్తల మధ్య మాటా మాటా పెరుగడంతో కోపాద్రుకుడైన లక్షమయ్య కత్తితో బార్యపై దాడి చేయడంతో భార్య బానక్క అక్కడికక్కడే మరణించింది. తన భార్య మరణించిందని నిర్ధారణ చేసుకున్న తర్వాత తానే స్వయంగా పేరూరు పోలీసు స్టేషనలో లొంగిపోయాడు. దీంతో ఎస్ఐ కె.శివప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు.





ఓబీసీల అభివృద్ధే ఎజెండా

కేసీఆర్ బీసీల వ్యతిరేకి

- బీసీల హక్కులను సర్కారు కాలరాస్తోంది
- బీసీ సబ్ ప్లాన్ చట్టం తేవాలి: బీజేపీ

హైదరాబాద్, జనవరి 10 (మనం న్యూస్): సీఎం కేసీఆర్ బీసీ వ్యతిరేకి అని, అసెంబ్లీలో బీసీలు 19 మంది మాత్రమే ఉన్నారని, ఓబీసీలకు రాజ్యాధికారం వస్తేనే వారికి న్యాయం జరుగుతుందని కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ బండారు దత్తాత్రేయ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఓబీసీ నాయకుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మొన్నటివరకు తెలంగాణ సెంటిమెంట్‌ను వాడుకున్నా కేసీఆర్, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇప్పుడు ఓబీసీల జపం చేస్తున్నారని దత్తాత్రేయ అన్నారు. ఓబీసీలనే కాదు, కేసీఆర్ ఎస్సీ, బడుగు బలహీన వర్గాలకు కూడా తీవ్ర అన్యాయం చేస్తున్నారని, వారి మీద ఆయనకు చిత్తశుద్ధి లేదని వ్యాఖ్యనించారు. బీసీలను విస్మరిస్తూ, వారికి అన్యాయం చేస్తున్న టీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలను ఓబీసీలంతా సంఘటితమై నిలదీయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఏర్పడి మూడున్నర సంవత్సరాలు గడుస్తున్నా బీసీ సబ్ ప్లాన్ ఊసే లేదని, ముస్లింలను బీసీ జాబితాలో చేర్చి అన్యాయం చేశారని రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు లక్ష్మణ్ అన్నారు. గత ప్రభుత్వ విధానాలే అమలు చేస్తూ, బీసీల హక్కులు కాలరాస్తున్నారని, బీసీ సబ్ ప్లాన్ చట్టం వెంటనే తీసుకురాకపోతే తెలంగాణ వ్యాప్తంగా ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్ విషయంలో బీసీ విద్యార్థులపై ఆంక్షలు విధించడం సమంజసం కాదన్నారు. ప్రతిభ ఉండి, ర్యాంకు తెచ్చుకున్నా కూడా ఓబీసీ విద్యార్థులు ఫీజు చెల్లించాల్సిందేనని, అయితే బీసీ-ఈ లో ఉన్న ముస్లింలకు, బీసీ- సీ గ్రూపులో ఉన్న కన్వర్ట్ క్రిస్టియన్లకు మాత్రం పూర్తి ఫీజు మినహాయింపు ఇచ్చి ఓబీసీలకు అన్యాయం చేస్తున్నారన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 50 డివిజన్‌లు ఉంటే, ముస్లిమ్‌లకు రిజర్వేషన్ కల్పించి, ఆ సంఖ్యను 32కు పరిమితం చేసి బీసీలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. సమగ్ర కుటుంబ సర్వే వివరాలు ఇంతవరకు బయటపెట్టలేదని, బీసీల గణాంక వివరాలు చేపడితే సంపన్న వర్గాలు ఏవో తెలిసిపోతాయన్నారు. కర్ణాటక తరహాలో 100 కోట్లు ప్రత్యేకంగా కేటాయించి బీసీ వర్గీకరణ (గణాంక వివరాలు) చేపట్టాలని ప్రభుత్వానికి ఆయన సూచించారు. బర్రెలు మాకు, డైరీ ఫార్మ్‌లు మీకు, కోళ్లు మాకు, కోళ్ల ఫార్మ్‌లు మీకు ఇదేమీ వ్యవస్థ అని ఆయన ప్రశ్నించారు. ఇంట్లో రెండు బర్రెలు ఉంటే, అవి రోడ్డు మీదకు వస్తే ట్యాక్స్ వేస్తారా ఇదెక్కడి న్యాయమని అన్నారు. సామాజిక తెలంగాణకు బీజేపీ కట్టుబడి ఉందని, బీసీలకు సముచిత న్యాయం కోసం పోరుబాట పడతామని ఆయన అన్నారు. బీసీల హక్కుల కోసం తెలంగాణ వ్యాప్తంగా ఉద్యమిద్దామని, ఇది టీఆర్ఎస్ ప్రభుత్వానికి కనువిప్పు కావాలన్నారు. లక్షమంది బీసీ నాయకులతో ఫిబ్రవరిలో జరిగే 'మహా సంగ్రామ సదస్సు' బీసీలకు అన్యాయం చేస్తున్న ఈ ప్రభుత్వానికి హెచ్చరిక కావాలని తెలంగాణ ఓబీసీ మోర్చ రాష్ట్ర అధ్యక్షులు కాటం నర్సింహ్మా యాదవ్ అన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం నీళ్లు, నిధులు, ఉద్యోగాలు అంటూ వాగ్ధానాలు చేసి, ఏవీ కూడా నెరవేర్చలేదని ఆయన అన్నారు. బీసీలను వాడుకోవాలని చూసిన ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని ఆయన అన్నారు. ప్రభుత్వ బడ్జెట్‌లో బీసీల వాటా ఎంతో ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆచారి, కాసం వెంకటేశ్వర్లు, పేరాల శేఖర్, ఎండల లక్ష్మీనారాయణ, మంత్రి శ్రీనివాస్, ఆకుల విజయ, వివిధ జిల్లాల ప్రతినిధులు, అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'సీపీబాట' నర్సింహ అరెస్టు

- మీడియాతో ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి

గూడూరు, జనవరి 10(మనంన్యూస్): సీపీ బాట రాష్ట్ర కమిటీ సభ్యుడు బొమ్మని నర్సింహ, కొరియర్ గుండాల సంధానిలను అరెస్టు చేసి వారి వద్ద నుండి 12 బోరుతుపాకీ, 25 రౌండ్లు స్వాధీనం చేసుకుని వారిని కోర్టుకు హజరుపర్చినట్లు జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి తెలిపారు. భద్రాద్రి యాదగిరి జిల్లా చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెంకు చెందిన బొమ్మని నర్సింహ 1982లో బీఎస్సీ చదువు ఆపేసి పీడీఎస్‌యూలో చేరాడు. అటుపై వీరన్న ఏర్పాటు చేసిన సీపీయూఎస్‌ఐలో పనిచేశాడు.. కాలక్రమంలో పార్టీకి రాజీనామా చేసి తిరిగి జనశక్తి పార్టీలో చేరాడని అనంతరం రాష్ట్ర కమిటీ సభ్యునిగా



ఎదిగి అన్ని దళాలను కలుస్తూ రాజకీయ అంశాలపై తరగతులు బోధించేవాడని తెలిపారు. ఇటీవల కేంద్ర కమిటీ కార్యదర్శి కుర్ర రాజన్న రాష్ట్ర కమిటీ సభ్యులు బొమ్మని నర్సింహ, భీం భరత్‌లు సీపీబాట అనే కొత్త సాయుధ దళాలను ఏర్పాటు చేసి కార్యక్రమాలను కొనసాగిస్తున్నారని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో సీపీ బాట దళాలలో పనిచేస్తున్న కొంతమంది టేకులపల్లి ఏరియా ఎన్‌కౌంటర్‌లో చనిపోవటం, కొంతమంది అరెస్టు కావటంతో కేవలం మోకాళ్ళ సమ్మయ్య అలియాస్ నూతన్ మాత్రమే మిగిలారు. ఈ క్రమంలో నర్సింహ కొరియర్ అయిన గుండాల సంధానిలు హైద్రాబాద్‌కు వెళ్ళి తిరిగి వస్తున్న సమాచారం తెలుసుకొని అప్పరాజుపల్లి క్రాస్‌రోడ్డు వద్ద మాటేసి పట్టుకున్నామని ఎస్పీ వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నరేష్‌కుమార్‌నాయక్, గూడూరుసీఐ రమేష్‌నాయక్, ఎస్సై రామారావు, యాసీన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆ రిట్‌ను పిల్‌గా మార్చండి

- హైకోర్టు న్యాయమూర్తి ఎస్వీ భట్

హైదరాబాద్, జనవరి 10: లేని విద్యార్థులను ఉన్నట్లుగా చూపిన డీఈడీ కాలేజీలపై దాఖలైన రిట్‌ను ప్రజాహిత వ్యాజ్యాలుగా పరిగణించాలని హైకోర్టు రిజిస్ట్రీని న్యాయమూర్తి ఆదేశించారు. పశ్చిమగోదావరి, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని పలు డీఈడీ కాలేజీల్లో 163 మంది విద్యార్థులు ఉంటే ఏకంగా వెయ్యి మంది ఉన్నట్లుగా కాలేజీ యాజమాన్యాలు రికార్డుల్లో చూపించాయి. మహాత్మాగాంధీ, సలామ్ అమరావతి, ఎస్ఆర్, జీఎస్ఆర్, ఎస్ఆర్‌డీ, షారోన్ తదితర కాలేజీల్లోని విద్యార్థులు లేకపోయినా ఉన్నట్లుగా రికార్డుల్లో చూపించి ప్రభుత్వ ఆమోదం పొందే ప్రయత్నాలు చేస్తున్నారంటూ నవురూరి మాధవరావు అనే వ్యక్తి రిట్ పిటిషన్ దాఖలు చేశారు. వీటిని తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి ఎస్వీ భట్ విచారించారు. ఆయా కాలేజీలు ఆమోదానికి ప్రభుత్వానికి నివేదికలు రాలేదని ప్రభుత్వ లాయర్ చెప్పారు. ఈ కేసులో ప్రజాహిత అంశాలున్నాయని పిటిషనర్ లాయర్ హైకోర్టు దృష్టికి తేవడంతో న్యాయమూర్తి కూడా అంగీకరించారు. రిట్‌ను పిల్‌గా చేయాలని హైకోర్టు రిజిస్ట్రీని న్యాయమూర్తి ఆదేశించారు.

'మనం'కు విశేష ప్రజాదరణ



- ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్ టౌన్, జనవరి 10(మనం న్యూస్): ప్రారంభించిన అనతికాలంలోనే మనం పత్రికకు విశేష ప్రజాదరణ లభిస్తోందని కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పేర్కొన్నారు. బుధవారం కాగజ్‌నగర్‌లో ఎమ్మెల్యే మనం దినపత్రిక క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ నిజాలను నిర్భయంగా నిగ్గుతేలుస్తూ 'మనం' దినపత్రిక ప్రజల ముందుకు దూసుకుపోతోందన్నారు. మున్ముందు మనం పత్రిక మరింత ప్రజాధరణ పొందాలని ఆకాంక్షించారు. మనం పత్రిక దినదినాభి వృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో కొమ్రంభీం జిల్లా ప్రతినిధి ఎండీ పాషా, కాగజ్‌నగర్ ఆర్‌సీ ఇంచార్జ్ నాగేష్, పట్టణ రిపోర్టర్ ఫారూఖ్, మైనారిటి నాయకులు జాకీర్ షరీఫ్, అబ్జల్ పాషా, జమీర్, రమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంపత్ మాకు అక్కర్లేదు

- ఆయన్ను చేర్చుకోవాల్సిన అవసరం కూడా లేదు: గువ్వల

హైదరాబాద్, జనవరి 10 (మనం ప్రతినిధి): కాంగ్రెస్ ఎమ్మెల్యే సంపత్ తన చేతకాని తనాన్ని కప్పిపుచ్చుకునేందుకే టీఆర్ఎస్ ప్రభుత్వం, మంత్రి హరీశ్‌రావుపైనా అర్థం పర్థం లేని విమర్శలు చేస్తున్నరని ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్ మండిపడ్డారు. సంపత్‌ను టీఆర్ఎస్‌లో చేర్చుకోవాల్సిన అవసరం లేదని, ఆ మేరకు లీకులు ఇవ్వాల్సిన అవసరం మంత్రి హరీశ్‌రావుకు లేదని అన్నారు. బుధవారం టీఆర్ఎస్ఎల్పీలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ హాయంలో పాలమూరు ప్రాజెక్టులు, ముఖ్యంగా ఆర్డీఎస్‌ది విషాద గాధ అని అభివర్ణించారు. నడిగడ్డ ప్రజలు ఎంతో కాలంగా తుమ్మిళ్ల లిఫ్ట్ పథకం కోసం ఎదురు చూశారని, ప్రాజెక్టు శంకుస్థాపనతో ప్రజల్లో హర్షద్వానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ఇది జీర్ణించుకోలేకే సంపత్ అనసర విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆర్డీఎస్ నీటి కేటాయింపుల ఒప్పందాలన్నీ కాంగ్రెస్ హయాంలోనే తుంగలో కలిశాయన్నారు. గద్వాలకు మహారాణిలా భావించే డీకే అరుణ కూడా ఆర్డీఎస్ ఆయకట్టుకు న్యాయం చేయలేక పోయారని అన్నారు.



కాళేశ్వరం ఒక అద్భుతం

- ఈ తరహా ప్రాజెక్టును ఎక్కడా చూడలేదు.
- ఇది సమీకృత, బహుళార్ధసాధక ప్రాజెక్టు
- కేంద్ర జలసంఘం ప్రతినిధుల ప్రశంస
- కాళేశ్వరం ప్రాజెక్టు పనుల పరిశీలన

హైదరాబాద్, జనవరి 10 (మనం ప్రతినిధి): ఉత్తర తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర జలసంఘం అధికారులు ప్రశంసల వర్షం కురిపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయితే తెలంగాణ రూపురేఖలు మారిపోతాయన్నారు. దేశంలోనే ఓ చారిత్రక ప్రాజెక్టుగా కాళేశ్వరం ప్రాజెక్టు నిలుస్తుందని కితాబిచ్చారు. తెలంగాణకు ఇది గొప్ప ప్రాజెక్టు అని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనులను కేంద్ర జలసంఘం హైడ్రాలజి డైరెక్టర్ ఎన్ఎన్ రాయ్, సీఈ సీకేఎల్ దాస్‌తో పాటు పలువురు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్ఎన్ రాయ్ మాట్లాడుతూ.. కాళేశ్వరం పనులు అత్యంత వేగవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని చెప్పారు. మేడిగడ్డ వద్ద నీటి లభ్యతకు సంబంధించి ఏ సమస్యా లేదని రాయ్ స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఆయన వెల్లడించారు. దేశంలోనే కాళేశ్వరం గొప్ప ప్రాజెక్టు అని కితాబిచ్చారు. అనంతరం సీకేఎల్ దాస్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయని, ఇది విభిన్నమైన ప్రాజెక్టు అని తెలిపారు. మే లేదా జూన్ నెలలో ప్రాజెక్టు తొలి ఫలాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని స్పష్టం చేశారు. కాళేశ్వరం ద్వారా ఇతర ప్రాజెక్టుల ఆయకట్టు కూడా స్థిరీకరణ జరుగుతుందని పేర్కొన్నారు. ప్రాజెక్టు ప్రణాళిక, నిర్మాణాలు, పనులు సాగుతున్న తీరు చాలా బాగుందని ప్రశంసించారు. దేశంలో ఏ ఇతర ప్రాజెక్టులోనూ ఇటువంటి పనులు చూడలేదని తెలిపారు. నిర్దిష్ట గడువులోపు ప్రాజెక్టులు పూర్తి చేయడం ప్రస్తుతం సవాలుగా మారిందని సీకేఎల్ దాస్ అన్నారు. అంచనా వ్యయం మించకుండా పనులు పూర్తి చేయడమే ప్రధాన సవాల్ అని ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరం పనులు చూస్తుంటే సమస్యను సులువుగా అధిగమిస్తారని అనిపిస్తోందని అన్నారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన మిగతా అనుమతులు పరిశీలనలో ఉన్నాయని దాస్ చెప్పారు. '' ఇది సమీకృత, బహుళార్థక సాధక ప్రాజెక్టు. ఇలా ఒక భారీ ప్రాజెక్టు మరికొన్ని సాగునీటి ప్రాజెక్టులతోఅనుసంధానం చేస్తున్న ప్రక్రియ తెలంగాణలోనే కనిపిస్తోంది. ప్రాజెక్టు నిర్మాణాలు, ప్రణాళిక, పనులవేగం, పనులు జరుగుతున్నతీరు మమ్మల్ని ఆకట్టుకున్నాయి'' అని ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని, 18 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడంతో పాటు మరో 18 లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీటిని అందించే బృహత్తర ప్రాజెక్టు అని ఆయన ప్రశంసించారు. కేంద్ర జలసంఘం డైరెక్టర్లు ముఖర్జీ, రాజీవ్ కుమార్, కాళేశ్వరం సీఈలు ఎన్.వెకటేశ్వర్లు, హరిరామ్ తదితరులు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

ప్రత్యర్థుల అంతానికి కుట్ర

- సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్ కంకణం
- టీటీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ ధ్వజం
- ఒంటేరు ప్రతాప్‌రెడ్డి విడుదలకు డిమాండ్

హైదరాబాద్, జనవరి 10 (మనం ప్రతినిధి) : రాజకీయ ప్రత్యర్థులను తుద ముట్టించేందుకు సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు కుట్ర పన్నుతున్నారని టీడీపీ టీఎస్ అధ్యక్షులు ఎల్. రమణ తీవ్రస్థాయిలో స్పందించారు. బుధవారం ఎన్‌టీఆర్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ రైతు విభాగం అధ్యక్షుడు, సిద్దిపేట జిల్లా పార్టీ అధ్యక్షుడు ఒంటేరు ప్రతాప్‌రెడ్డిపై అక్రమ కేసులు పెట్టి రెండోసారి మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని రమణ పేర్కొన్నారు. ఇటీవల ఉస్మానియాలో ఆత్మహత్య చేసుకున్న మురళీ కుటుంబానికి న్యాయం జరిగేలా సహకరిస్తుంటే కుట్ర పూరితంగా ప్రతాప్‌రెడ్డిని అరెస్టు చేయించారని పేర్కొన్నారు. ప్రతాప్‌రెడ్డిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తాము సిద్దిపేట బంద్‌కు పిలుపునిచ్చామని, దాంతో ఆయనపై నామమాత్రపు కే సు పెట్టారని అన్నారు. కేసు చిన్నది కావడంతో బెయిల్ వచ్చిందని తెలిపారు. కానీ.. మంగళవారం మళ్లీ ప్రతాప్‌రెడ్డిని బెయిల్ రాకుండా అదనపు కేసులు పెట్టి జైల్లో పెట్టడం దుర్మార్గమన్నారు. నేడు రాష్ట్రంలో దుర్మార్గపు పోలీసు రాజ్యం నడుస్తుందని విమర్శించారు. జైల్లో ప్రతాప్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నారని, ఆయన బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలని అన్నారు. గురువారంలోపు ప్రతాప్‌రెడ్డిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ.. టీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం బతికే అవకాశం లేదన్నారు. ప్రతాప్‌రెడ్డిని విడుదల చేసి, ఉస్మానియా విద్యార్థులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోకపోతే 12న ప్రగతి భవన్ ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. రావుల చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తున్నదన్నారు. ప్రభుత్వం వైపు నుంచే కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో ప్రజల పక్షాన మాట్లాడే హక్కు ప్రతిపక్షాలకు ఉంటుందన్నారు. 2019 ఎన్నికల్లో ప్రతాప్‌రెడ్డిపై గెలువలేమనే పరోక్షంగా అధికార దుర్వినియోగం చేసి ఆయనపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేశారన్నారు. కేసీఆర్ నిరంకుశ పాలనతో ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగే ప్రమాదముందని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ్రు శోభారాణి, తెలుగు యువత అధ్యక్షుడు టీ. వీరేందర్ గౌడ్ పాల్గొన్నారు.

ఇంత అలసత్వమా?

- రైల్వే పనుల్లో ఆలస్యంపై ఎంపీల అసంతృప్తి
- దక్షిణ మధ్య రైల్వే జీఎంతో సమావేశం
- కేంద్రం చొరవ తీసుకోవాల్సిందే
- విభజన హామీలు నెరవేర్చాలి: ఎంపీలు



హైదరాబాద్, జనవరి 10 (మనం ప్రతినిధి): రాష్ట్రంలో జరుగుతున్న రైల్వే పనుల పట్ల అలసత్వం ప్రదర్శించడంపై తెలంగాణ ఎంపీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విభజన చట్టంలో, షెడ్యూల్ 9లో చెప్పి నట్లు కేంద్రం చొరవ తీసుకుని హామీలు అమలు చేయాలని తెలంగాణ ఎంపీలు ముక్త కంఠంతో డిమాండ్ చేశారు. బుధవారం రైల్ నిలయంలో రైల్వే జీఎంతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణలో రైల్వే విస్తీర్ణం చాలా తక్కువ ఉందని తెలిపారు. కరీంనగర్ - మనోహరబాద్ రైల్వే లైన్ కోసం కేసీఆర్ కృషి చేస్తే...గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు గజ్వేల్ వరకు శరవేగంగా పనులు జరుగుతున్నాయన్నారు. సిద్దిపేట నుంచి కరీంనగర్ వరకు భూసేకరణ చేస్తున్నామని, ఈ నెల చివరి వరకు పూర్తిచేసి రైల్వేకు అందజేస్తామని తెలిపారు. పెద్దపల్లి నుంచి జగిత్యాల వరకు ఎలక్ట్రిఫికేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు. కరీంనగర్ నుంచి కాజీపేట, హసన్‌పర్తి రైల్వే లైన్ సర్వే పూర్తి చేశారని అన్నారు. వచ్చే సంవత్సరం నుంచి పనులు మొదలు పెట్టాల్సిన మణుగూరు -రామగుండం పనులు ఇంకా ప్రతిపాదన దశలోనే ఉన్నాయన్నారు. పనులు ముందుకు సాగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వరకు రైల్వే లైన్ వేయాలని అధికారులను కోరారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతోనే రైల్వే పనులు చేయాల్సి ఉంటుందని, కాబట్టి రైల్వే బోర్డు ప్రభుత్వంతో చర్చలు జరపాలని సూచించారు. విజయవాడ, ముంబై మార్గాలలో పెద్ద రైల్వే స్టేషన్ల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించిందని ఆయన తెలిపారు. వివిద స్టేషన్లలో రైళ్లు నిలుపేందుకు దేశ వ్యాప్తంగా 2700 రిక్వెస్ట్‌లు చేశామని చెప్పారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పెద్ద సమస్యగా మారిందని, ఉత్తర తెలంగాణ ప్రజల ఆకాంక్ష అని అన్నారు. వరంగల్‌లో ఫ్యాక్టరీ స్థలంపై ఎలాంటి న్యాయవివాదాలు లేవని పేర్కొన్నారు. పాలమూరుకు కొత్త రైల్వేలైన్స్ వస్తే వలసలు తగ్గుతాయని ఎంపీ నంది ఎల్లయ్య అన్నారు. 184 కిలోమీటర్ల దూరం... 920 కోట్ల అంచనా, గద్వాల్ - వనపర్తి, నాగర్ కర్నూల్ - గద్వాల్ - అచ్చంపేట ఒక సంవత్సరం నుంచి లైన్ వేయాలని రైల్వే జీఎంకు సూచించారు. పనుల విషయంలో రైల్వే అధికారులు తీవ్ర అలసత్వం వహిస్తున్నారని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మౌలాలిలో ప్యాసింజర్ రైళ్లను ఒక నిమిషం ఆపాలని, ఆలేరులో జైన మందిరం ఉందని...వారికోసం చార్మినార్ ఎక్స్ ప్రెస్‌ను నిలపాలని సూచించారు.

బడ్జెట్‌లో బీసీలకు పెద్దపీట

- అభివృద్ధికి పక్కా ప్రణాళికలు: జోగు రామన్న

హెదరాబాద్, జనవరి 10(మనం ప్రతినిధి): బీసీల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు పక్కా ప్రణాళికలు రూపొందించారని, వచ్చే బడ్జెట్‌లో బీసీలకు పెద్ద పీట వేస్తారని అటవీ, బీసీ సంక్షేమ శాఖల మంత్రి జోగు రామన్న అన్నారు. సచివాలయంలోని తన చాంబర్‌లో బుధవారం బీసీ సంక్షేమం, అటవీ, పర్యావరణ, అటవీ అభివృద్ధి సంస్థల క్యాలెండర్‌ను, బీసీ సహకార సమాఖ్యల వెబ్‌సైట్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ బీసీ వర్గాలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు సీఎం కేసీఆర్ సూచనలు చేశారన్నారు. ఈ మేరకు బీసీ ప్రజాప్రతినిధులంతా కలిసి ప్రణాళికలు రూపొందించినట్టు చెప్పారు. కొత్త సంవత్సరంలో బీసీ వర్గాల కోసం అనేక కార్యక్రమాలను ప్రారంభించి, దశల వారీగా అమలు చేయనున్నట్టు తెలిపారు. అందులో భాగంగానే బీసీ సంక్షేమ సహకార సమాఖ్యకు సంబంధించిన వెబ్‌సైట్‌ను ప్రారంభించామన్నారు. 11 సమాఖ్యలకు చెందిన సభ్యులు వెబ్‌సైట్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని మంత్రి జోగు రామన్న సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బాపురావు రాథోడ్, గడ్డం వివేక్‌రెడ్డి , చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర కరెంటు..

చీకటి ఒప్పందాలు

- 'ఇండియాబుల్స్'పై ఎందుకంత ప్రేమ?
- 'భద్రాద్రి' పేరుతో వేల కోట్ల కమీషన్లు: రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, జనవరి 10 (మనం ప్రతినిధి): రైతులకు 24 గంటల కరెంటు పేరుతో సీఎం కేసీఆర్ చీకటి ఒప్పందాలకు తెరలేపారని కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి ఆరోపించారు. వ్యవసాయానికి నిరంతరం కరెంటు సరఫరా చేస్తున్నామని రైతులపై ప్రేమ ఒలక బోస్తూ మరోవైపు రూ. వేల కోట్ల అవినీతికి టీఆర్ఎస్ ప్రభుత్వం పాల్పడుతుందని ఆరోపించారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 2014, నవంబరు 10న అసెంబ్లీలో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. 21వేల మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం పెంచేలా ప్రభుత్వం మూడేండ్ల ఒప్పందాలను కుదుర్చుకుందని, ఇందుకోసం ప్రభుత్వం రూ.94వేల కోట్ల అప్పు తీసుకుంటుందని చెప్పారని అన్నారు. అయితే ఈ విషయంలో ఎలాంటి పురోగతి లేదని అన్నారు. అలాగే, 18 నెలల్లో 1,080 మెగావాట్ల భద్రాద్రి పవర్ ప్లాంట్‌ను పూర్తి చేస్తామని సీఎం ప్రకటించి మూడేండ్లు గడిచినా అడుగు ముందుకు పడలేదన్నారు. ఒక్క యూనిట్ ఉత్పత్తి అదనంగా జరగలేదని ఆరోపించారు. భద్రాద్రి పవర్‌ప్లాంట్‌ను బీహెచ్ఈఎల్ అప్పగించామని ప్రభుత్వం చెప్పినా తెర వెనుక ఒప్పందాలు చేసుకుందన్నారు. కేంద్రం వద్దన్నప్పటికీ కాలం చెల్లిన సబ్ క్రిటికల్ టెక్నాలజీనే ఈ పవర్ ప్లాంట్‌లో వినియోగించనున్నారని చెప్పారు. కమీషన్ల కోసమే ఇలా చేశారన్నారు. అవుట్‌డేటెడ్ టెక్నాలజీని చూపించి ఇండియాబుల్స్ సంస్థ కేసీఆర్‌ను ప్రసన్నం చేసుకుందని విమర్శించారు. ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్రం సూపర్ క్రిటికల్ టెక్నాలజీనే వాడాలని ఆదేశిస్తే వేల కోట్ల నష్టం జరుగుతుందన్నారు. ఉమ్మడి ఏపీలోనే ఈ టెక్నాలజీని ఇండియాబుల్స్ ప్రతిపాదిస్తే జెన్‌కో అధికారులు తిరస్కరించారని గుర్తు చేశారు. ఇండియా బుల్స్‌తోపాటు..పలు ప్రైవేటు విద్యుత్ సంస్థలతో ప్రభుత్వం చీకటి ఒప్పందాలను చేసుకుని ప్రజలపై భారం మోపేందుకు సంసిద్ధమవుతోందని, దాదాపు ఏడువేల కోట్ల భారం పడనుందని చెప్పారు. కేంద్రం యూనిట్‌ను రూ. 2.20లకే ఇస్తామని చెప్తున్నా ప్రభుత్వం ప్రైవేటు సంస్థలతో చేసుకున్న ఒప్పందాల నేపథ్యంలో ఒక్కో యూనిట్‌కు రూ.4.90 చెల్లిస్తోందని అన్నారు. యాదాద్రి పవర్‌ప్లాంట్ భూ పరిహారంలో బినామీ పేర్లతో టీఆర్ఎస్ పాలకులు, నాయకులు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దక్షిణ భారతదేశంలో కరెంటు కోతల్లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామని కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి పీయూష్‌గోయల్ తెలిపినా ప్రభుత్వం తమ కమీషన్ల కోసం భద్రాద్రి, యాదాద్రి పవర్ ప్లాంట్లను ప్రారంభిస్తుందని ఆరోపించారు. రాజస్థాన్ క్యాడర్‌కు చెందిన తెలంగాణ ఐఏఎస్ అధికారి రమేష్ ఇక్కడ సేవలు చేయడానికి వస్తే ఆయన తమ చీకటి ఒప్పందాలకు అడ్డం వస్తున్నారని, తిరిగి పంపించారన్నారు.

18 తండాలకు కరెంటే లేదు..

నిరంతరం కరెంటు సరఫరా చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం కొడంగల్ నియోజకవర్గంలోని 18 తండాలకు నేటికి కరెంటు సరఫరా లేదని తెలిపారు. తన శాఖలో ఏం జరుగుతుందో మంత్రి జగదీశ్‌రెడ్డికి తెలియదని విమర్శించారు. విద్యుత్ ఒప్పందాలు, ప్రాజెక్టులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బహిరంగ చర్చకు తాము సిద్ధమని ప్రకటించారు.



దమ్ముంటే చర్చకు రా..!

- కరెంట్‌పై దొంగలెక్కలెవరివో తేల్చుకుందాం
- రేవంత్‌రెడ్డికి బాల్క సుమన్ సవాల్


హైదరాబాద్, జనవరి 10 (మనం ప్రతినిధి): విద్యుత్ రంగంపై దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని, ఎవరివి దొంగ లెక్కలో తెల్చుకుందామని కాంగ్రెస్ నేత రేవంత్ రెడ్డికి టీఆర్ఎస్ ఎంపీ బాల్క సుమన్ సవాలు విసిరారు. విద్యుత్ రంగంపై పీసీసీ చీఫ్ ఉత్తమ్, సీఎల్పీ నేత జానారెడ్డితో కలిసి చర్చకు వచ్చినా తమకు అభ్యంతరం లేదన్నారు. స్థలం, సమయం, రేవంత్ నిర్ణయించినా సరేనని పేర్కొన్నారు. తమ పార్టీ నుంచి తాను, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, భానుప్రసాద్ చర్చకు వస్తారని తెలిపారు. రైతులకు నిరంతర కరెంట్ పేరుతో సీఎం కేసీఆర్ చీకటి ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారని రేవంత్‌రెడ్డి చేసిన సవాలుపై ఆయన స్పందించారు. బుధవారం ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వరరెడ్డి, భానుప్రసాద్‌తో కలిసి బాల్క సుమన్ స్పందించారు. ''మేం చెప్పేవి తప్పయితే నేను ముక్కు నేలకు రాసేందుకు సంసిద్ధం. రేవంత్ చెప్పేది అబద్ధమైతే ఆయన అబిడ్స్ చౌరస్తాలో నేలకు ముక్కురాసేందుకు సిద్ధమేనా'' అని సవాలు విసిరారు. సీఎం కేసీఆర్‌పై ఇష్టారీతిలో మాట్లాడితే ఊరుకోబోమని హెచ్చరించారు. 24 గంటల విద్యుత్‌ను ప్రవేశ పెట్టడాన్ని జీర్ణించుకోలేకే రేవంత్ అవాకులు చెవాకులు పేలుతున్నారని అన్నారు. రేవంత్‌రెడ్డి కాదని, రవ్వంత రెడ్డి అని ఎద్దేవా చేశారు. ఆయన చేరికతో గాంధీభవన్ కాస్త.. అబద్ధాల భవన్‌గా మారిందని అన్నారు. 24 గంటల విద్యుత్ షాక్ నుంచి కాంగ్రెస్ నేతలు తేరుకోలేక పోతున్నారని పల్లా రాజేశ్వరరెడ్డి ఎద్దేవా చేశారు.

టీఆర్ఎస్ సవాల్‌కు సిద్ధం: రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 10 (మనం ప్రతినిధి): విద్యుత్‌పై బహిరంగ చర్చకు రావాలని టీఆర్ఎస్ ఎంపీ బాల్క సుమన్ విసిరిన సవాలను రేవంత్‌రెడ్డి స్వీకరించారు. ఈ నెల 12వ తేదీన చర్చకు వస్తానని అన్నారు. విద్యుత్తు కొనుగోళ్లు, ఒప్పందాల విషయంలో తాను చేసిన విమర్శలపై చర్చకు సిద్ధమని ఓ ప్రకటనలో బుధవారం స్పష్టం చేశారు. బాల్క సుమన్ కోరిన విధంగా బహిరంగ చర్చకు నాతో పాటు అలంపూర్ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, టీపీసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రావణ్ వస్తారని స్పష్టం చేశారు. ప్రగతిభవన్లోనైనా, మరే వేదికపైనైనా సరే ఈ నెల 12వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు తాము చర్చకు వస్తామని చెప్పారు. ఈ బహిరంగ చర్చ తర్వాత తప్పుడు మాటలు మాట్లాడుతున్నవి ఎవరో, ముక్కుకు నేలకు రాసేదెవరో ప్రజలే నిర్ణయిస్తారని అన్నారు.


గురుకుల విద్యార్థులు భేష్

- అవకాశాలిస్తే వారు ఎవరికీ తీసిపోరు
- డిప్యూటీ సీఎం కడియం ప్రశంసలు
- ఘనంగా ఇంటర్ సొసైటీ స్పోర్ట్ లీగ్ ప్రారంభం




హైదరాబాద్, జనవరి 10 (మనం ప్రతినిధి): పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు అవకాశాలు కల్పిస్తే ఎవరికీ తీసిపోరని గురుకుల విద్యార్థులు నిరూపిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి అన్నారు. తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్స్ ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ లీగ్ -2018ని బుధవారం గచ్చిబౌలిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రదర్శించి న స్వాగతవిన్యాసాలు అదుతేమని కొనియాడారు. ఐదు సొసైటీల నుంచి రెండువేల మంది విద్యార్థులు ఈ లీగ్ లో పాల్గొనడం సంతోషకరరంగా ఉందన్నారు. గత మూడేళ్లుగా ఈ ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ లీగ్ ను నిర్వహిస్తున్నారని, దీనివల్ల వివిధ సొసైటీలలోని విద్యార్థుల మధ్య మంచి సంబంధాలు ఏర్పడుతాయన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పేదలకు మంచి విద్య అందించాలనే సంకల్పంతో దేశంలో ఎక్కడా లేనన్ని గురుకులాలు తెలంగాణలో ఏర్పాటు చేశారన్నారు. తెలంగాణ లో 546 గురుకులాలు, 475 కేజీబీవీలు, 194 మోడల్ స్కూళ్లలో ఎనిమిది లక్షల మంది విద్యార్థులు నాణ్యమైన విద్యను పొందుతున్నారని తెలిపారు. గురుకులాల్లోని విద్యార్థులకు మంచి ఆహారాన్ని అందిస్తున్నామన్నారు. గురుకుల పాఠశాలల్లో 8,000 పోస్టులను భర్తీ చేస్తున్నామని, ఈ నెలలోపే ఉపాధ్యాయులు పాఠశాలలకు వస్తారన్నారు. ఒక్కో గురుకుల విద్యార్థిపై సాలీన 1,02,000 రూపాయలు ఖర్చు చేస్తున్నామన్నారు. అందుకే నేడు ప్రభుత్వ విద్యాలయాలు, గురుకులాల్లో ఉన్న వసతులు, విద్యార్థులతో కార్పోరేట్, ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు పోటీ పడలేరన్నారు. ప్రభుత్వం కల్పించిన వసతులను వినియోగించుకుని బాగా కష్టపడి గురుకుల విద్యార్థులు వారి కుటుంబాల్లో వెలుగులు నింపాలని, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరికి స్వాగతం తెలిపేందుకు పెరేడ్ నిర్వహించిన బాలానగర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు డిప్యూటీ సిఎం ముగ్దులై పదివేల రూపాయల నగదు బహుమతిని అందించారు. అన్ని సొసైటీలకు చెందిన విద్యార్థులు అద్బుతమెన ప్రతిభను ప్రదర్శించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్ అథారిటీ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల కార్యదర్శి ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్, విద్యాశాఖ గురుకుల విద్యాలయాల డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి, మైనారిటీ సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి షఫీ ఉల్లా, బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి మల్లయ్య భట్టు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..



మంచిమాట



'నీకో లక్ష్యం ఉండటమే కాదు.. దాన్ని ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా సాధించుకునే వ్యూహ నైపుణ్యం కూడా ఉండాలి'

- అబ్దుల్ కలామ్

గురువారం, జనవరి 11

సమాచార చౌర్యం

'సమాచారం సంపద' అన్నది నానుడి. వివిధ రకాల సంపదల కోసం తరాలుగా సాగుతున్న వెంపర్లాట తీరులోనే నేడు సమాచార సంపద స్వాయత్తత కోసమూ వివిధ కార్పొరేట్ శక్తులు భారీగా పోటీపడుతున్నాయి. అయితే ఆధార్‌తో ప్రజాసాధికారిత సాధించాలన్న సర్కార్ సంకల్పం ప్రారంభించక ముందే పక్కదారి పట్టింది. ఏకాంతతకు భంగం కలిగించడమే కాకుండా, దేశభద్రతకు ముప్పు ఏర్పడేంత బలహీనమైన యంత్రాంగంలో దేశ ప్రజల సమాచారం నిక్షిప్తం చేసిన వైనంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. గతవారం ట్రిబ్యూన్ అనే ఆంగ్ల దినపత్రిక మహిళా విలేకరి చేసిన స్టింగ్ ఆపరేషన్ మీడియాలో వైరల్‌గా మారడమే, కాకుండా దేశప్రజల్లో అభద్రతా భావాన్ని రేకెత్తించింది. రూ.500లకే కోట్లాది ప్రజల సమస్త వివరాలను నిక్షిప్తం చేసిన లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌ను సంపాదించడం, కేవలం రూ.300 చెల్లించితేనే ఆధార్ వివరాలను రాబట్టే సాఫ్ట్‌వేర్‌ను ఆ విలేకరి కొనుగోలు ఉదంతం అందర్నీ విస్మయపరిచింది. అదేవిధంగా ఇండియాటుడే చానల్ స్టింగ్ ఆపరేషన్‌లో రూ.2 చెల్లిస్తేనే కావలసిన వ్యక్తుల వివరాలు పొందే అవకాశం ఉండడంతో, దాదాపు 15 వేలమంది వివరాలను లోపాయికారీగా సంపాదించడం దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆధార్ డేటాబేస్ సైబర్ నేరగాళ్లకు సింగిల్ టార్గెట్‌గా ఉన్న కథనాలు మీడియాలో వెలువడడంతో యునిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఈఐ) ఈ డేటాబేస్ భద్రతపై మరింత దృష్టి సారించింది. ఆధార్ గోప్యతను మెరుగుపరిచేందుకు రెండు అంచెల భద్రతా వ్యవస్థను రూపొందించి జూన్ 1 నాటికి అన్ని ఏజెన్సీలు ఈ కొత్త విధానంలోకి మారాలని నిర్ణయించింది.

ఆధార్ సమాచారం దేశానికి అతి ముఖ్యమైన ఆస్తి. ఈ డేటాను రక్షించే ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించే బాధ్యత యూఐడీఏఈఐ సంస్థది మాత్రమే కాదు. కేంద్ర ప్రభుత్వం ప్రధాన బాధ్యత వహిస్తూ నియంత్రించకపోతే దేశ ఆర్థిక వ్యవస్థ అంతా చిన్నాభిన్నమయ్యే ప్రమాదం ఉంది. ఆధార్ సమాచార వ్యవస్థ భద్రతలోని లుకలుకలను స్టింగ్ ఆపరేషన్లు బయటపెట్టడంతో ప్రభుత్వ యంత్రాంగం ఉలిక్కిపడింది. కానీ, ఆధార్ వ్యవస్థలోని లొసుగులు సవరించడంలో సత్వరమే చర్యలు తీసుకోవడానికి బదులు స్టింగ్ ఆపరేషన్ నిర్వహించిన విలేకరులపై ప్రభుత్వం కేసులు పెట్టడం విచిత్రం. ఆధార్ సమాచారం బహిర్గతం కావడం ఇది మొదటిసారి కాదు. గత ఏడాది మే నెలలో కూడా ఆధార్ వివరాలు అక్రమంగా బహిర్గతమైన సంగతి సుప్రీంకోర్టు ముందు కేంద్రం అంగీకరించింది. అయితే ఇది ఆధార్ వ్యవస్థ లోపం కాదనీ, వివిధ ప్రభుత్వ శాఖలు అవగాహనాలేమి కారణంగా జరిగిందని మోదీ సర్కార్ సమర్థించుకుంది. ఆయా ప్రభుత్వ శాఖలు దాదాపు 10 కోట్ల మంది పౌరుల ఆధార్ వివరాలు తమ వెబ్‌సైట్లలో ఉంచడంతో ఇలా జరిగిందని, దాన్ని వెంటనే సవరించామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఆధార్ వ్యవస్థలో లోపమున్నా, వాటిని వినియోగించుకొనే ప్రభుత్వ శాఖల అవగాహనలో లోపమున్నా జరిగింది సరిదిద్దుకోలేని నష్టంగా కేంద్రం భావించడం లేదు. పౌర సమాజ సంస్థలు ఆధార్ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి ఆధార్ డేటా పోతుందని ఎప్పటినుంచో మొత్తుకుంటున్నా కేంద్రం నిర్లక్ష్యం వహించింది. దేశవ్యాప్తంగా డేటా సేకరణ కోసం కామన్ సర్వీస్ సెంటర్ స్కీం (సీఎస్ సీఎస్) అనే యంత్రాంగంగా కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ 3 లక్షల మంది ఆపరేటర్లను నియమించింది. వారిద్వారా కొందరు నేరగాళ్ళు ఆధార సమాచారాన్ని సేకరించి అంగట్లో సరకులాగా మార్చివేశారని ట్రిబ్యూన్ కథనం పేర్కొన్నది.

సంక్షేమ పథకాలు వాస్తవ లబ్ధిదారులకు చేరడంలేదని, మధ్య దళారులు ప్రభుత్వ నిధులను కాజేస్తున్నారని, ఈ పరిస్థితిని సరిచేసే లక్ష్యంతో ఆధార్ విధానం ఉపకరిస్తుందని కేంద్ర ప్రభుత్వం డిజిటలైజేషన్ ప్రక్రియను ప్రారంభించింది. తర్వాత ఆధార్ అనుసంధాన విధానాన్ని సంక్షేమ పథకాల నుంచి సేవల రంగానికి, ఆర్థిక లావాదేవీలకు విస్తరించింది. ఈ విధానం వల్ల ప్రభుత్వ నిధుల దుర్వినియోగాన్ని, పన్ను ఎగవేతను, ఉగ్రవాదుల కార్యకలాపాలను, వారికి అందుతున్న ఆర్థిక సహకారాన్ని, మనీ ల్యాండరింగ్ వంటి చీకటి వ్యవహారాలను నివారించవచ్చని సర్కార్ బలవంతంగా ఆధార్ అనుసంధాన ప్రక్రియను చేపట్టింది. ఆధార్ విధానం వల్ల వ్యక్తుల హక్కులకు భంగం వాటిల్లుతోందన్న వ్యాజ్యంపై 'వ్యక్తిగత గోప్యత'ను ప్రాథమిక హక్కుగా గుర్తిస్తూ 2017 ఆగస్టులో సుప్రీంకోర్టు ధర్మాసనం సంచలనాత్మక తీర్పు చెప్పింది. దేశవ్యాప్తంగా వివిధ ప్రజాసంఘాలు, హక్కుల సంఘాలు ఆధార్ అనుసంధానాన్ని బలవంతంగా రుద్దడాన్ని వ్యతిరేకిస్తున్నా కేంద్ర ప్రభుత్వం మొండిపట్టుదలతో వ్యవహరిస్తోంది. ఇప్పటికే దేశంలో తారస్థాయిలో కొనసాగుతున్న బూటకపు ఆధార్ కార్డుల వ్యాపారాన్ని నిరోధించేందుకు ప్రభుత్వం వద్ద ఎలాంటి యంత్రాంగమూ లేదు. వ్యక్తి స్వేచ్ఛ, సమాచార భద్రత, ఏకాంతత హక్కు వంటి పెద్దపెద్ద మాటలెలా ఉన్నా ఆహార సంక్షేమ పథకాన్ని ఆధార్‌తో బల వంతంగా అనుసంధానించే ప్రయత్నం ఆకలి చావులకు కారణమవుతోంది. ఆధార్ వలె పౌరుల సమాచారాన్ని సేకరించిన దేశ ఆర్థిక వ్యవస్థకు, భద్రతకు, వ్యక్తిగత స్వేచ్ఛకు, ఆధార్ సమాచార చౌర్యంపై కొందరు ప్రభుత్వ ప్రబుద్ధులు తేలికగా చూస్తున్నారు. అయితే అన్నిటికీ ఆధార్ తప్పనిసరి చేయడాన్ని, దాన్ని వ్యతిరేకిస్తున్న ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై సుప్రీంకోర్టు విచారణ పూర్తయ్యేవరకూ కేంద్రం ఆగకపోవడం అన్యాయం. కనీసం ఇలాంటి స్టింగ్ ఆపరేషనైనా ప్రభుత్వం కళ్ళు తెరిపించనున్నాయా?

మహర్‌ల రాష్ట్రం మహారాష్ట్రం

ఇటీవల భీమ్‌కొరెగావ్‌లో మనువాదుల అమానవీయ దాడి, దానికి ప్రతిగా దళితులు నిర్వహించిన మహారాష్ట్ర బంద్. ఈ బంద్ మహారాష్ట్ర అంటే మహర్ శక్తులు దీప్తించిన రాష్ట్రమని మరోసారి ప్రపంచానికి తెలియచెప్పింది. డా॥ బాబాసాహెబ్ భావజాల భేరీనాదాన్ని మరోమారు మోగించింది. అంతేకాదు ఈ సంఘటన మరోసారి దేశ స్వాతంత్ర్య పోరాటాన్ని, బ్రిటిషువారి రాజ్య విస్తరణనూ, దానికి దోహదకారులైన శక్తుల్ని మన ముందుకు తెచ్చింది.

కొరెగావ్‌లో బహుజన శక్తులపై దాడికి కారణంగా 'ఈ దేశంలో బ్రిటిషువారి పక్షాన నిలబడి, స్థానిక భారతీయ పాలకులైన పీష్వాల్ని ఓడించిన వారు దేశభక్తులెలా అవుతారు? అలాంటి వారిని స్మరించడం తప్పుకాదా?' అంటూ మనువాద బీజేపీ, ఆరెస్సెస్ వాదులు వాదిస్తున్నారు. కొరెగావ్ మహర్ అమరవీరుల స్మారకస్థూపం దగ్గరకు వచ్చేవారి వాహనాల్ని ధ్వంసం చేయడం, ఆ వాహనాలకు కట్టి ఉన్న నీలిజెండాల్ని, పంచశీల పతాకాల్ని నేలకేసి కొట్టడం, తమకే దేశభక్తి ఉన్నట్టు 'పూనడం' వీటన్నిటినీ చూస్తుంటే వీరిది అజ్ఞానమో, అహంకారమో అర్థం కావడం లేదు. ఏదోవిధంగా, ఏదోపేరుతో బరితెగించి, తిరిగి మనువాద రాజ్యాన్ని పునఃప్రతిష్టించడమే వీరి ధ్యేయంగా కనిపిస్తోంది. కులభూతాన్ని నిద్రలేపి, అంటరానితనాన్ని ఆదర్శంగా చూపించే రామరాజ్య స్థాపనకై తెగబడుతున్న పచ్చి అమానవీయమే అగపడుతోంది. ఈ సంఘటన వంద ప్రశ్నల్ని మనముందుంచింది. అందులో ముఖ్యమైనది ఏది దేశభక్తి? ఏది భారతదేశం? ఎవరు దేశభక్తులు? అనేది తెలుసుకోవాలన్నా, తేల్చుకోవాలన్నా మనం ఒకసారి చరిత్రని వెనక్కి తిరిగి చూడాల్సిందే! దేశద్రోహులెవరో తేల్చాల్సిందే! వేల సంవత్సరాల భారతచరిత్రలో ఇదిగో 'ఇదే' భారతదేశం అని నిక్కచ్చిగా తేల్చే భూభాగం ఏది? ఇప్పుడు మనం పాకిస్థాన్‌గా పిలుచుకునే భూభాగమే వేద, పురాణ, ఇతిహాసాల కాలంలోని భారతదేశం. భరత వర్షం. సింధూ నదీతీరమే ఈ దేశం నాగరికతకి తొలివాకిలి. 'సింధూ' దేశమే హిందూదేశంగా పేరుపడింది. భారతదేశ గత వైభవానికి కీర్తిపతాక అయిన తక్షశిల విశ్వవిద్యాలయం ఇప్పటి పాకిస్థాన్‌లోనే ఉంది. అంటే క్రీ.పూ. 5 వేల నుంచే ప్రపంచం ఈ ప్రాంతాన్నే మనం గొప్పగా ఈనాడు చెప్పుకుంటున్న 'భారతదేశంగా' గుర్తించింది. వైదిక నాగరికత మొత్తం ఇక్కడే వికసించింది. ఆర్యభూమి అంటే ఇప్పటి ఆఫ్ఘన్, పాకిస్తాన్ ప్రదేశమే గానీ, ఇప్పటి భారతదేశం కాదు. ఆ తర్వాత కేవలం మౌర్య పాలకుల కాలంలోనే ఇప్పుడున్న మొత్తం భారతదేశం ఒకేపాలన కిందికి వచ్చింది. అటు పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, ఇరాక్ సరిహద్దు నుంచి, ఇటు బర్మా వరకూ మొత్తం అఖండ మౌర్య సామ్రాజ్యమే భారత ఖండానికి ఒక రూపాన్నిచ్చింది. మానవీయ విలువలతో తన సామ్రాన్యానికి ప్రాణప్రతిష్ట చేశాడు అశోకుడు. అహింస, కరుణ, సామాజిక సమానత, ప్రజా సంక్షేమ, యజ్ఞయాగాల్లో జంతుబలుల నిషేధం, ప్రజాస్వామ్య గణతంత్ర పాలన ఈ దేశానికి రుచి చూపించిన సామ్రాట్టు ఆయన.

మానవీయ విలువలతో రాజ్యపాలన చేయడం ఓర్వలేని అమానవీయ మనువాద శక్తులు మౌర్య సామ్రాజ్యంపై కన్నెర్ర చేశాయి. మౌర్య సేనాపతి, బ్రాహ్మణుడైన పుష్యమిత్రశుంగుడు ఆఖరి మౌర్య చక్రవర్తి బృహద్రధుణ్ణి చంపి, రాజ్యాన్ని హస్తగతం చేసుకున్నాడు. మనువాద పాలన ప్రారంభించాడు. దాంతో తిరిగి అఖండ భారతం చెప్పలేనన్ని ముక్కచెక్కలైంది. చిన్నచిన్న రాజ్యాలుగా చీలిపోయింది. 'అఖండం' ఖండఖండాలైంది. ఆ 'పుణ్యం' బ్రాహ్మణవాది, వైదిక మనువాది అయిన పుష్యమిత్రునిదే! ఆ తర్వాత మొఘల్ చక్రవర్తుల కాలంలోనే తిరిగి దాదాపుగా అలాంటి విశాల స్వరూపాన్ని భారతదేశం తీసుకుంది. క్రీ.శ.500 తర్వాత భారత దేశంలో కులవాదం బలపడింది. అగ్రవర్ణాలు, వారిలో అగ్రకులాలే పాలకులుగా చెలామణి అయ్యారు. అలాంటి అఖండ భారత ఐక్యత బ్రిటిష్ వారి వల్లే సాధ్యమైంది. ఇప్పటి ఈ అఖండ భారతం వారు పెట్టిన భిక్షే. వైదికేతరులైన మౌర్యులు, మొఘలులు, బ్రిటీషుకారి కాలాల్లో తప్ప ఏ హిందూరాజు కాలంలో 'అఖండ భారత



> కొరెగావ్‌లో కేవలం తమ నిమ్నజాతి వీరుల్ని, వారి వీరత్వాన్ని మాత్రమే స్మరించుకుంటారు. 'భారత దేశం, అఖండ భారతం' అనే భావన, 'దేశ స్వాతంత్ర్యం' అనే భావనలు ఆనాడు లేవు.ఆనాడు దేశభక్తి అంటే ప్రభుభక్తే. రాజ్యభక్తే. ఒక దేశంగా భారతదేశంపై భక్తిభావం, బ్రిటిషు కాలంలో స్వాతంత్ర్య పోరాటంలోంచి ప్రభవించినదే!


దేశం' అనే విశాల భూభాగం లేదు. అసలు వారికి అలాంటి భావనా లేదు. హిందూ రాజులు చేసింది సువిశాల దేశాన్ని శతఖండ భారతంగా బద్దలు చేయడమే! 1498లో భారతదేశం వచ్చిన ఐరోపా వర్తకులు 200 ఏళ్ళలో పరిపాలనలో భాగస్వామ్యాన్ని పంచుకున్నారు. పోర్చుగీసు, డచ్, పోలెండ్, ఫ్రెంచ్ తదితర ఐరోపా దేశాల వ్యాపారుల్లో చివరికి ఇంగ్లండ్, ఫ్రెంచ్ వారే బలంగా మిగిలారు. వారిలో కూడా ఆఖరికి మిగిలింది బ్రిటిషువారే. ఇటు ఫ్రెంచ్ వారుగాని, అటు బ్రిటిషు వారుగానీ ఈ దేశంలో నిలదొక్కుకుని, పాలకులుగా మారడానికి కారకులెవరు? ఈ చారిత్రక పరిణామం, వాస్తవం తెలుసుకోక పోవడంవల్లే కొరెగావ్‌లో హిందూ మతో న్మాదులు దళితులపై దాడి కి దిగారు. 'దళిత వీరుల్ని 'దేశభక్తులు కారని' నిందించారు. 1750 తర్వాత బ్రిటిషు వర్తక సంఘం ఈస్ట్ ఇండియా కంపెనీ బలపడింది. ఆ తర్వాత వందేళ్ళ లో అనేక యుద్ధాలు చేసి 1850 నాటికి మొత్తం దేశాన్ని తన పాలన కిందికి తెచ్చుకుంది. మొదటి నుంచి బొంబాయి, మద్రాస్, కలకత్తాలు బ్రిటిషు ఈస్ట్ ఇండియా కంపెనీ వ్యాపార కేంద్రాలు. 1757లో బెంగాల్‌లో ప్లాసీ యుద్ధంలో మొఘల్ చక్రవర్తుల సామంత రాజు సిరాజిద్దౌలాను బ్రిటీషు వారు ఓడించి తమకు 'తోలుబొమ్మ'గా మారిన మీర్ జాఫర్‌ను గద్దె నెక్కించారు. ఆ తర్వాత మీర్ జాఫర్‌ను గద్దెదించారు. బ్రిటిషు ట్రూప్‌కి నాయకత్వం వహించింది రాబర్ట్ క్లైవ్. కలకత్తా ప్రధాన రాజవీధిలో యుద్ధం సాగు తోంది. సిరాజుద్దౌలా సైనికులు వీధుల్లో నిలబడి పోరాడుతున్నారు. ఆ వీధిలో సైనికులతో పాటు వేలాది మంది వీధులకు ఇరువైపులా కనిపించారు. 'ఇంత మందిని ఓడించడం కష్టం' అన్నాడు. అప్పుడు పక్కనే ఉన్న పండితుడు (దుబాసీ) 'మా దేశంలో అందరూ యుద్ధం చేయరు. చేయకూడదు. కేవలం బ్రాహ్మణ, క్షత్రియులు మాత్రమే అర్హులు. ఇతర శూద్ర అంటరాని కులా లకు కత్తిపట్టే యోగ్యత లేదు. వారంతా జరిగే యుద్ధాన్ని చూడ్డానికి వచ్చిన ప్రేక్షకులే' అన్నాడు. ఆ యుద్ధంలో క్లైవ్ జయించాడు. 'భారతదేశాన్ని మనం తేలిగ్గా జయించగలం. ఇందుకు ఎక్కువ సమయం పట్టదు. ఇక్కడి కులవ్యవస్థే మన విజయానికి ప్రధాన కారణ'మని బ్రిటిషు ప్రభుత్వానికి సందేశం పంపాడు. 1758లో జరిగిన బొబ్బిలి యుద్ధంలో ఫ్రెంచ్ వారు గెలిచారు. 1756లో కర్ణాటకలోని శ్రీరంగపట్టణాన్ని వశపరచు కున్నారు. వారికి నాయకుడు బుస్సీదొర. ఆ సమయంలో నిజాం మనుమడు (కూతురు కొడుకు) ముజఫర్ జంగ్ గోల్కొండ పాలకుడుగా ఉన్నాడు. అతని తర్వాత 1760లో నిజాం మరో కుమారుడు నిజామలీఖాన్ గోల్కొండ పాలకుడ య్యాడు. నిజాం తర్వాత నాజర్ జంగ్, ముజఫర్ జంగ్‌లు ఫ్రెంచ్‌వారికి వత్తాసు దార్లుగా ఉండగా నిజామలీఖాన్ మాత్రం బ్రిటిషు వారికి దగ్గరయ్యాడు. 1792లో ఆంగ్లేయులు నిజాం సైన్య సహ కారంతో శ్రీరంగపట్టణంపై (టిప్పు సుల్తాన్‌పై) యుద్ధానికి దిగారు. నిజాం ప్రభువులతో కంపెనీ అధికారి జేమ్స్ పేట్రిక్ సంధి కుదుర్చు కున్నాడు. దీనివల్ల బ్రిటిషు వారు బలంగా నిలదొక్కుకున్నారు.

నిజానికి టిప్పు సుల్తాన్‌పైకి యుద్ధానికి వెళ్ళిన వారిలో 21 వేల మందీ భారతీయ అగ్రవర్ణ సైనికులే! వీరంతా కలసి ఆంగ్లేయుల తరపున యుద్ధంచేసి టిప్పును ఓడించారు. కొందరు టిప్పుని రహస్యంగా దాక్కోమని చెప్పగా 'గొర్రెలా దాక్కొని పదికాలాలు బతకడం కంటే దేశం కోసం పులిలా పోరాడి ఒక్క రోజులోనే మరణిస్తా'నని చెప్పి, అదేరోజు యుద్ధంలో వీరమరణం పొందాడు. టిప్పు రాజ్యంలో 156 హిందూ దేవాలయాల్ని పునరుద్ధరించాడు. శ్రీరంగంలోని రంగసాథస్వామికి ఆయన సమర్పించిన కానుకలు వెలకట్టలేనివి. వీరమరణం పొందిన టిప్పు దేశభక్తుడా? టిప్పును మట్టికరపించి, బ్రిటిషు వారి పాలనకు పునాది వేసిన 22 వేల అగ్రకుల సైనికులు దేశభక్తులా? సైన్య సహకార పద్ధతి ఒప్పందానికీ దళితులకూ ఎలాంటి సంబంధం లేదు. కాబట్టి ఈ విషయంలో 'దేశద్రోహులు' ఎవరో తేలిగ్గానే తెలుస్తుంది. అప్పట్లో చెన్నపట్నం చంద్రగిరి రాజ్యంలో భాగంగా ఉండేది. చంద్రగిరి రాజైన శ్రీరంగరాయలు 1643లో చెన్నపట్నాన్ని బ్రిటిషు వారికి కౌలుకిచ్చారు. వారు అక్కడ సెయింట్ జార్జ్‌కోట నిర్మించుకుని, న్యాయాధికారాన్ని కూడా పొందారు. ఆ సమయంలో కర్ణాటకకు నెక్‌నాంఖాన్ గవర్నర్‌గా ఉండేవాడు. ఆయనకు చెన్నపట్నం బ్రిటిషువారికి తగాదాలు వచ్చాయి. తమకు రావలసిన సొమ్ము చెల్లించమంటే నాటి కంపెనీ అధికారి ఫాక్స్ క్రాఫ్ట్ నిరాకరించాడు. దానితో నెక్‌నాంఖాన్ చెన్నపట్నంపై దండెత్తాడు. బ్రిటిషువారు వారికి చెల్లించాల్సిన బాకీ చెల్లించారు. దానితో చెన్నపట్నంపై సర్వాధికారాన్ని 1672 ఫిబ్రవరి 22న అప్పగించాడు. దీన్ని సమర్థించిన వారు నాటి గోల్కొండ మంత్రులు అక్కన్న, మాదన్నలు. 1685లో బ్రిటిషు వారు గోల్కొండ నవాబుపై యుద్ధాన్ని ప్రకటించి రాజ్యంలో భాగమైన నిజాంపట్నం, మచిలీపట్నం ప్రాంతాల్ని ఆక్రమించారు. 1687లో గోల్కొండ పతనంతో బ్రిటిషు వారు స్వేచ్ఛాయుతులై స్వదేశీ రాజుల్ని లెక్కచేయని స్థితికి ఎదిగారు. అలాగే 1857 ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఝాన్సీలక్ష్మిని ఓడించింది కేవలం బ్రిటిషువారే కాదు. అప్పుడు బ్రిటిషు వారికి సైనిక సహకారం అందించింది సిక్కులు. బ్రిటిషు సేనాని చాంబర్లేన్ నాయకత్వంలో 3 వేల మంది పంజాబ్ నుంచి ఢిల్లీ వైపునకు ఒకదిశలో, మరోదిశలో సర్, హెచ్ బార్నార్డ్ నాయకత్వంలో 12 వేల మంది వచ్చారు. వీరిలో 7 వేల మంది భారతీయులే అంటే తొలి భారత స్వాతంత్ర్య పోరాటాన్ని అణచిన వారిలో అత్యధికులు భారతీయ రాజులే కారణం. కొరెగావ్ యుద్ధంలో 22 మంది మహర్‌లు నేలకొరిగారు. వారి స్మృతిగా స్థూప నిర్మాణం జరిగింది. ప్రతియేటా అక్కడ జనవరి 2న మహర్ వీరులకు స్మృత్యంజలి ఘటిస్తారు. అది వారికి ఒక ఉత్తేజాన్ని కలిగించే ఉత్సవంగా మారింది. ఇన్ని ఏళ్ళుగా ఆ ఉత్సవాలు అలా జరుగుతూనే ఉన్నాయి. కానీ అప్పుడు పుష్యమిత్రుని రూపంలో, ఆ తర్వాత పీష్వాల రూపంలో తలెత్తిన మనువాదం ఇప్పుడు 2018లో మనువాద ఆరెస్సెస్, బీజేపీ పాలన రూపంలో తిరిగి తలెత్తింది. కొరెగావ్‌లో కేవలం తమ నిమ్నజాతి వీరుల్ని, వారి వీరత్వాన్ని మాత్రమే స్మరించుకుంటారు. 'భారత దేశం, అఖండ భారతం' అనే భావన, 'దేశ స్వాతంత్ర్యం' అనే భావనలు ఆనాడు లేవు. ఆనాడు దేశభక్తి అంటే ప్రభుభక్తే. రాజ్యభక్తే. ఒక దేశంగా భారతదేశంపై భక్తిభావం, బ్రిటిషు కాలంలో స్వాతంత్ర్య పోరాటంలోంచి ప్రభవించినదే! ఖచ్చితంగా చెప్పాలంటే 1909 వందేమాతర ఉద్యమం నుంచి పుట్టిందే!

◆ బొర్రా గోవర్ధన్
9390600157

పురుగు మందులు ప్రాణాంతకమా?

రసాయనిక పురుగుమందుల వల్ల జంతువులు, మొక్కలు, పురుగుల ప్రాణాలకు ప్రమాదం వాటిల్లుతోంది. ఈ భయానక పరిస్థితులు ప్రపంచవ్యాప్తంగా నెలకొన్నవా లేదా అన్నది పక్కన పెడితే ఎవరూ ఏమీ చెప్పలేని పరిస్థితి. నవజాత శిశువుల్లోను, తల్లిపాలల్లోను, ఇతర ఆహారపదార్థాల్లోను, ప్రపంచవ్యాప్తంగా మంచినీటిలోను పారిశ్రామిక విషాలు మిళితమై ఉంటున్నాయి. ప్రతి ఏడాది మానవ విసర్జనాలు 250 బిలియన్ టన్నులు విడుదలవుతుంటాయి. భూగ్రహంపై ఈ విషపదార్థాల ప్రభావం ప్రతిచోటా నెలకొని ఉంది. ఫలితంగా భూమి మొత్తం విషపదార్థంగా తయారయ్యేలా ఉందనడంలో సందేహం లేదు. ఈ 'విషగోళం' చుట్టూ అక్కడక్కడా విషపుచుక్కల కనిపిస్తున్నాయి. రసాయనాల వినియోగం సర్వవ్యాప్తమైన ఈ రెండు దశాబ్దాల కాలంలో అమెరికాలో దీర్ఘకాలిక రోగాలు విస్తరించినట్టు వార్తలు వచ్చాయని జర్నల్ ఆఫ్ ఆర్గానిక్ సిస్టమ్స్ తెలియజేసింది. 20వ శతాబ్దం ప్రారంభంలో టీబీ, న్యుమోనియా, అతిసార వంటి వ్యాధుల కారణంగా మరణాలు కూడా సంభవించాయి. 21వ శతాబ్దంలో మరణాలకు కారణమైన ఈ దీర్ఘకాలిక రోగాలకు బదులుగా గుండెజబ్బులు, గుండెపోటు, క్యాన్సర్ తదితరాలు పెరిగాయి. విచారించవలసిన విషయం ఏమిటంటే అమెరికాపై వీటి ప్రభావం అధికంగా ఉండడం! పురుగుమందుల ఆత్మహత్యలను నూటికి నూరుశాతం వాస్తవమని చెప్పలేం. అయితే, ఇందుకు సంబంధించి సూచికలు మాత్రం వాస్తవాలు వెల్లడిస్తున్నాయి. పర్యావరణంలో తీవ్ర సమస్యలు తలెత్తడమే దీర్ఘకాలిక జబ్బులకు కారణమని తెలుస్తోంది. ఇది సరిహద్దుల నుంచి అంటే కాలిఫోర్నియా, కెనడా నుంచి మెక్సికో వరకు పర్యావరణ మార్పుల కారణంగా దీర్ఘకాలిక వ్యాధులు వ్యాపించాయి. ఆస్టిజమ్, స్థూలకాయం, హృదయ సంబంధ రోగాలు, నిరాశ నిస్పృహలు, క్యాన్సర్, చిక్కిపోవడం, పేగు సంబంధ జబ్బులు, ఆల్జీమర్స్, పార్కిసన్స్ తదితర రోగాల విజృంభణకు పరిసరాల విపత్కరాలకు సంబంధం లేదు. 'పరిసరాల ప్రభావం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు కచ్చితంగా తెలియకపోయినా క్యాన్సర్, మధుమేహం, నరాల సంబంధమైన సమస్యలకు సంబంధించి పరిసరాలపై పురుగుమందుల వాడక ప్రభావం ఉంటుందని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (ఎన్ఐహెచ్) సంస్థ తెలియజేసింది. పురుగుమందుల ప్రభావం ఆరోగ్య సమస్యలకు కారణమవుతుందా అనే ప్రశ్నకు, సమాజం మొత్తాన్ని కలతపెట్టే అవాస్తవ ప్రచారం జరుగుతోందని భావించాలి.



అమెరికాలో పంటల్లో కలుపు సంహారకంగా, అడవుల్లోను, వనాల్లోను, తోటల్లోను, పారిశ్రామిక కలుపు ప్రాంతాల్లోను గ్లైఫోసేట్ అనే కీటకనాశని వాడకంపై పెద్దయెత్తున వివాదం, చర్చోపచర్చలకు దారితీసింది. వాస్తవం చెప్పుకోవాలంటే 1974 నుంచి గ్లైఫోసేట్ విచ్చలవిడిగా వాడడం పెరిగింది. 1974 నుంచి 2014 వరకు మూడింట రెండొంతుల ప్రాంతంలో ఈ గ్లైఫోసేట్ వాడకం విస్తరించింది. 1974లో 1400 (1000 ఎల్‌బీ)గా ఉన్న గ్లైఫోసేట్ వాడకం 2014 వచ్చేసరికి 249,906 (1000ఎల్‌బీ)కి పెరిగింది. జన్యుపరమైన కలుపునివారిణి వాడకం ప్రపంచవ్యాప్తంగా 56 శాతానికి చేరుకుంది. అమెరికాలో గ్లైఫోసేట్‌ను మించి మరో పురుగునివారిణి మందు వినియోగంలో లేదు. గ్లైఫోసేట్ వినియోగంతో వాస్తవ వివరాలు పరిశోధనల ప్రగతిని వేగవంతం చేస్తాయి. 1974లో మొట్టమొదటి క్రిమిసంహారకం మోన్‌శాంటో అని చెప్పుకోవచ్చు. ఐరోపా దేశాలన్నింటికీ ఇటీవల కాలంలో గ్లైఫోసేట్ వాడకానికి ఐదేళ్ల అనుమతినిస్తున్నట్లు యూరోపియన్ యూనియన్ ప్రకటించింది. దాంతో ఈ పురుగు నివారిణిని నిషేధించాలని డిమాండు చేస్తూ దాదాపు 1.3 మిలియన్ల యూరోపియన్ పౌరులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడం ద్వారా చేస్తున్న పోరాటంపై నీళ్లు చల్లినట్లయింది. మొక్కలకు, జంతువులకు, ప్రజలకు హాని కలిగించే పురుగుమందుగా చెప్పడాన్ని రైతులు, పర్యావరణవేత్తలు ఖండిస్తున్నారు. మరి వీరు సరైనదారిలో ఉన్నాయా లేక 1.3 మిలియన్ పిటిషన్ దారులు సరిగ్గా ఆలోచిస్తున్నారా? ఇందులో వాస్తవం ఏదో తెలియడం లేదు. గత రెండు దశాబ్దాల కాలంలో అమెరికాలోను, ఇతర ప్రపంచదేశాల్లోను దీర్ఘకాలిక జబ్బులు సంభవించాయి. మొక్కల్లోను, జంతువుల్లోను జీర్ణక్రియ విధానంలో గ్లైఫోసేట్ జోక్యం పెరిగిందని సాక్ష్యాలున్నాయి. గ్లైఫోసేట్ అవశేషాలు ఈ రెండింటిలోను బయటపడ్డాయి. వినాళగ్రంథి ప్రక్రియను గ్లైఫోసేట్ భంగం కలిగించి పేగుల్లో బాక్టీరియా సమతుల్యతను దెబ్బతీస్తుంది. డీఎన్ఏను దెబ్బతీసి క్యాన్సర్ కారకాలకు దారితీయిస్తుంది. క్యాన్సర్ ప్రేరకానికి గ్లైఫోసేట్ అవకాశం ఇస్తుందని ఇటీవల ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. అయితే, మానవుల్లో క్యాన్సర్‌కు, గ్లైఫోసేట్‌కు సంబంధంపై అధ్యయనాలు విరుద్ధ అభిప్రాయాలను వ్యక్తంచేశాయి. ఎలుకలు, పందికొక్కులు, మనుషుల్లో గ్లైఫోసేట్ ప్రయోగాలతో డీఎన్ఏ దెబ్బతినడానికి కారణం కాగలదని తెలిసింది. సంప్రదాయక ఎరువులతో పండించే పంటల కంటే గ్లైఫోసేట్‌తో పండించే పంటలు ఎంతో కలుషితమవుతాయి. కలుపును మట్టుబెట్టడంతో పాటు మరింత లోతుగా అధికస్థాయిలను (రౌండప్) ఎదుర్కొనేందుకు తగినవిధంగా ఈ గ్లైఫోసేట్‌ను రూపొందించడమే ఇందుకు కారణం. ఈ రౌండప్‌లు జంతువులకు హాని కలిగించవని, కలుపును తొలగించడానికి మాత్రమే ఇది ఉపయోగపడుతుందని మోనోశాంటో తరచుగా చెబుతుంటుంది. 'షికిమేట్'గా వ్యవహరించే దీని పనితీరు జంతువుల్లో కనిపించడం లేదు. బాక్టీరియాలో కనిపిస్తోంది. అందువల్లే అది జంతువులకు, మానవులకు క్రమపద్ధతిలో ఏవిధంగా హాని చేస్తోందో అర్థంచేసుకోవాల్సి ఉంటుంది. అమెరికాలో కొన్ని ఆహారపదార్థాల్లో గ్లైఫోసేట్ ఉందని కనుగొన్నారు. అంతేగాక యూరిన్ పరీక్షలో పాజిటివ్ ఫలితం వచ్చిందని అన్‌రెస్కో లాబొరేటరీల పరిశోధనల్లో తేలింది. ఈ పరీక్షలను శాన్‌ఫ్రాన్సిస్కోకు చెందిన కాలిఫోర్నియా యూనివర్సిటీ (యుసీఎస్ఎఫ్) నిర్వహించింది. రౌండప్ వ్యవసాయంతో గ్లైఫోసేట్‌తో ఆహారం కలుషితమవుతుంది. సోయాబీన్స్‌లో గ్లైఫోసేట్ సాంద్రత 11,900 పీపీబీ (అత్యధికంగా 20,100 పీపీబీ) ఉందని ఇటీవల నిర్వహించిన సర్వేలో తేలింది. మోనోశాంటో తెలిపిన దాని ప్రకారం అవశేషాల స్థాయిలు 5,600 పీపీబీ ఉంటే అది అత్యధిక స్థాయిలో ఉన్నట్లే!

◆ రాబర్ట్ హంజికర్
(గ్లోబల్ రీసెర్చ్.సీఏ సౌజన్యంతో)



చదువుల చిలుకలు


కవిత

ఆ దాంపత్య హృదయాలు
పేగు బంధానికి
కాసిన చదువుల చిలకలను
మార్కుల మెట్ల పై
ఉద్యోగ లక్ష్యాలే ఊపిరిగా నడిపించి
ర్యాంకుల రోబోలను చేసాయి
ఏపుగా ఎదిగిన చిలకలు
ఒత్తిడికి ఒదగలేక
నిరుద్యోగానికి నిలవలేక
సభ్య సమాజంలో నడవలేక
శ్మశానాలకు తరలిపోతున్నాయి

- అభిరామ్ ఆదోని
9704153642

ఎడిట్ పేజీకి వ్యాసాలు, లేఖలు పీడీఎఫ్, ఓపెన్ ఫైల్ ఫార్మాట్‌లలో పంపవలసిందిగా సూచన.
e-mail: manamlekhalu@gmail.com
చిరునామా : Manam Telugu Daily, D.No. 6-3- 864/4/B, SBN Acrade 4th & 5th floor, Green lands, opp. Green park Hotel, Hyderabad, 500016, Telangana.

మనం
కుటుంబం
గురువారం, 11 జనవరి 2018
www.manamnews.com





'క్రైమ్ హాజ్ నో జెండర్' అన్నది ఇటీవలి కాలంలో అక్షరసత్యంగా మారుతోంది తెలుగు రాష్ట్రాల్లో. గత కొన్ని రోజులుగా జరుగుతున్న వరుస హత్యలు, వాటి వెనుక ఉన్న వ్యక్తులను మీడియాలో చూసి అవాక్కవడం సామాన్యుల వంతవుతోంది. ఓవైపు హింసాత్మక సంఘటనలు విపరీతంగా పెరుగుతుండగా, ఇటువంటి విధ్వంసకర ఘటనలకు మహిళలు కూడా సూత్రధారులుగా మారుతుండడం దేనికి దారితీస్తుందోనని అందరిలో వణుకు పుట్టిస్తోంది. బుధవారం ఖమ్మం జిల్లాలో ఇద్దరు మహిళలు, భర్తలను హతమార్చడం సంచలనంగా మారింది

షీరియల్ కిల్లర్స్

నేరాలు చేసే అవసరాలు పెరిగాయి!

అమ్మాయిల్లో చిన్నవయసునుంచే నేరాలపట్ల ఆసక్తి పెరుగుతుండడం, నేరాలు చేసే సరికొత్త అవసరాలు పుట్టుకువస్తుండడం విశేషం. పాకెట్ మనీకోసం హత్యచేసి తప్పించుకు తిరుగుతున్న అమ్మాయిలు, ఈర్ష్యతో రగిలిపోతూ నేరం చేసేవారు కొందరైతే..ఆస్తులు అంతస్తులకోసం ప్రాణాలు తీసేవారుగా మరికొందరు మహిళలు మారుతున్నారు. కానీ విచిత్రంగా ఇటీవలి కాలంలో భర్తలను చంపడం లేదా చంపించడం అనే నేరానికి పాల్పడుతున్న భార్యల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది.

ఇంకెంతమంది స్వాతి, జ్యోతి శ్రీవిద్యలో?

ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో గత కొన్ని రోజుల్లో కట్టుకున్న భర్తలనే హత్యచేయడం, చేయించడం ద్వారా



స్వాతి, జ్యోతి, శ్రీవిద్యలు వార్తల్లోకెక్కి భయపెడుతున్నారు. అయితే చట్టానికి చిక్కిన ఇలాంటి వారు కేవలం ముగ్గురే కాగా, చిక్కనివారు ఇంకెంతోమంది ఉన్నారని పోలీసులు చెబుతున్నారు. బాయ్ ఫ్రెండ్ మోజులో పడి మరికొందరు ఇలాంటి ఉన్మాదాలకు పాల్పడుతుంటే, జీవితంపై కనీస అవగాహన లేకుండా కటకటాలపాలవుతున్నవారు మరికొందరు. నిన్నటికి నిన్న బెంగళూరు నగరంలో ఓ మహిళ..పెళ్లై మూడు నెలలు అయ్యిందని, తనపై సామూహిక అత్యాచారం జరిగిందని, తన నగలుకూడా దోచుకున్నారని, ఇంటికెళ్లి భర్తతో ఎలా బ్రతకాలని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై రేయింబవళ్లు మెరుపువేగంతో దర్యాప్తు జరిపిన బెంగళూరు పోలీసులు ఆమె చెప్పినట్టు అసలు అత్యాచారమే జరగలేదని, పైపెచ్చు ఆమె చెబుతున్నదంతా కట్టుకథ అని, భర్తనుంచి ఈ సాకుతో విడిపోయి, హాయిగా ప్రియుడితో కలిసి బ్రతకాలన్నదే దీనివెనుకున్న కారణమని, అత్యాచారం మిస్టరీని ఛేదించారు. పోలీసుల ఇంటరాగేషన్‌లో తనకు ఇష్టంలేని పెళ్లిచేసిన తల్లిదండ్రుల వల్ల భర్తతో కలిసి బ్రతకలేక, బాయ్‌ఫ్రెండ్‌ను వదులుకోలేక ఈ నాటకమాడినట్టు సదరు మహిళ అంగీకరించింది. వివాహవ్యవస్థను పతనం అంచుకు తీసుకెళేలా ఇలాంటి వారు కొందరు చేస్తున్న ఆకృత్యాలు సభ్య సమాజాన్ని తలదించుకునేలా చేస్తున్నాయి.





మహిళా నేరస్థుల్లో ఆ రాష్ట్రం టాప్

మహిళల్లో నేరప్రవృత్తి పెరుగుతోందని చెప్పేందుకు పోలీసు రికార్డులే నిలువెత్తు సాక్ష్యాలు. మహిళా నేరస్థుల్లో మహారాష్ట్ర మొదటి స్థానంలో ఉండగా ఆతరువాతి స్థానాల్లో.. ఉత్తరప్రదేశ్, కర్నాటక, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్ ఉన్నాయి. తాజాగా మన తెలుగు రాష్ట్రాల్లోకూడా మహిళా నేరస్థుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. ఒకటి తర్వాత ఒకటి వెలుగులోకి వస్తున్న ఘోరమైన నేరాల వెనుక మహిళలుండడం సంచలనం సృష్టిస్తోంది. కేవలం క్షణికావేశంతోనే కాక, స్కెచ్ వేసి, పకడ్బందీగా హత్యలకు పాల్పడుతున్నవారు చాలామందే ఉన్నారు.

వైట్ కాలర్ కిల్లర్స్

చిన్నా చితకా నేరాలమాట అటుంచితే హైప్రొఫైల్ నేరాలు, కుంభకోణాల్లో మహిళలు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఆస్తికోసం భర్తలను మార్చుతూ, ఆఖరుకి కన్న కూతురినే హతమార్చి, వ్యాపారవేత్తగా చెలామణి అవుతూ చట్టానికి చిక్కిన ఇంద్రాణి ముఖర్జి, డేరా బాబాకు అన్నీ తానై వ్యవహరించిన హనీప్రీత్ సింగ్, నేను దేవతనంటూ అమాయకులను నిలువునా ముంచేస్తూ, సెటిల్మెంట్ల వ్యాపారంతో వెలుగిపోతున్న రాధే మాతోపాటు చాలామంది హైప్రొఫైల్ వుమెన్ క్రిమినల్స్ మనదేశంలో ఉన్నారు. డ్రగ్స్ ధంధాతో ముంబైలో వంద కోట్లకు పైగా సంపాదించిన కిలాడీ లేడీ, శశికళా రమేష్ అలియాస్ బేబీ ప్రస్తుతం జైల్లో ఉంది. సైనైడ్‌తో సీరియల్ కిల్లర్‌గా వణికించిన కేడీ కెంపమ్మ కూడా జైలు శిక్ష అనుభవిస్తోంది. దావూద్ ఇబ్రహీం సోదరి హసీనా పార్కర్ మాఫియా డాన్‌గా ముంబైను వణికించింది. ఇక పిల్లలను కిడ్నాప్ చేసే గ్యాంగుల్లో కూడా మహిళలే అసలు నేరస్థులుగా ఉంటుండగా, చట్టానికి చిక్కినప్పుడు చూద్దాంలే అన్న అతి ఆత్మవిశ్వాసంతో, టెక్నాలజీని ఆశ్రయిస్తూ, తక్షణ స్వార్థ ప్రయోజనాలకోసం నేరస్థులుగా మారుతూ పనులు జరుపుకుంటున్నారు.







టీవీ షోలతో గాడ్‌మదర్లుగా..

టీవీ షోలను, సీరియళ్లను చూసి గాడ్‌మదర్లుగా మారే మహిళలు అనేకమని క్రిమినల్ రికార్డులు చెబుతున్నాయి. పవిత్రమైన బంధాలు, అనుబంధాలను మరచిపోయేలా అనుమానపు విషబీజాన్ని నాటే సీరియళ్ల 'నెగిటివ్ ఇంప్రెషన్' అనే ఉచ్చులో చిక్కుకుని మహిళలు తమ బంగారు జీవితాన్ని చేజేతులా ఛిద్రం చేసుకుంటున్నారు. పాశ్చాత్య పోకడలు, ఫ్యాషన్లు, హద్దుమీరిన స్వేచ్ఛా స్వాతంత్రాలు కోరుకునే విచ్చలవిడితనం వీరిలో తెలియని ఆవేశాన్ని నింపుతూ ఇలాంటి నేరాలకు ఉసిగొలుపుతోంది.













ఆకాశంలో సంకురాత్రి

సంక్రాంతి, పొంగల్, మకర సంక్రాంతి, ఉత్తరాయణ్, మాఘ బీహూ, లోహ్రీ, మాఘ మేళా, మాఘి, శిశుర సంక్రాత్, పౌష్ సంగ్ర్కాంతి, తిలా సంక్రాత్, ఖిచ్డీ, తిర్మూరి..ఇలా వివిధ పేర్లతో పిలిచే సంక్రాంతి అంటే సంబరాల జాతరే. మనదేశంలోని దాదాపు అన్ని గ్రామాలు, నగరాలు, పట్టణాల్లో జరిగే పతంగుల పండుగ ఆబాలగోపాలంలో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతుంది. ఈ తోకలేని పిట్టల ఆకారాలు, అందాలతో సంక్రాంతినాడు అంబరానికే సరికొత్త సొబగులు వచ్చేలా ఇవి చేసే సందడి అంతా ఇంతా కాదు.



క్రియేటివ్ రంగోలి



కళాత్మకత ఉట్టిపడేలా ముగ్గులు వేయడం అంటే పెద్ద సవాలే. ఏటాలానే షరామామూలుగా ముగ్గుపిండి, రంగులు, ముగ్గులు కాకుండా కాస్త వెరైటీగా రంగోలి ట్రై చేసే ఆసక్తి ఉన్నవారు వారిలోని క్రియేటివిటీని ప్రదర్శించేందుకు సంక్రాంతి సరైన సమయం. వృథాగా ఉన్న డిస్పోజబుల్ స్పూన్లతో ఈ ఫోటోలోని ముగ్గు ఎంత చక్కగా కనిపిస్తోందో చూశారా? ముందు మీకు నచ్చిన డిజైన్‌ను అవుట్‌లైన్‌గా వేసి దాంట్లో రంగులను నింపాలి, ఆతరువాత డిజైన్‌కు అనుగుణంగా ఇలా డిస్పోజబుల్ స్పూన్లు పెట్టి, వాటిలోనూ రంగులను నింపితే వచ్చిన ముగ్గులో గొబ్బెమ్మలు పెడితే అందరూ వావ్ అనడం ఖాయం, ట్రై చేసి అందరి మెప్పు పొందండిమరి. ఇంట్లో వృథాగా ఉన్న పలు వస్తువులను ఇలా ముగ్గుల్లో పొందికగా అమర్చారంటే మీలోని ప్రతిభను నలుగురికీ చూపించే అవకాశం వస్తుంది.

ఆధార్.. '16'

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. ఆధార్ సంఖ్య పొందిన 119 కోట్ల దేశ పౌరుల వ్యక్తిగత గోప్యత, సమాచార దుర్వినియోగ నిరోధం దిశగా కొత్త వ్యవస్థకు రూపకల్పన చేసినట్లు అందులో వెల్లడించింది. ఈ ఏడాది మార్చి 1 నుంచి దీన్ని ప్రవేశపెడుతున్నామని, అదేనెల 31నాటికి ఆధార్ ప్రామాణీకరణను ధ్రువీకరించుకునే సంస్థలన్నీ దీన్ని అమలులోకి తేవాలని ఆదేశించింది. మొత్తంమీద ఆధార్‌ను వినియోగించే ప్రతి సంస్థ, వ్యక్తి 2018 జూన్ 1 నుంచి ఈ విధానాన్ని అనుసరించడం తప్పనిసరి చేసింది. ఆధార్ సమాచారం రూ.500కే దొరుకుతోందన్న వార్తా కథనాల నేపథ్యంలో ఉలిక్కిపడిన యూఐడీఏఐ తొలుత దీన్ని ఖండించడమే కాకుండా, గుర్తుతెలియని వ్యక్తులతోపాటు సదరు వార్త ప్రచురించిన పత్రిక, విలేకరిపైనా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆధార్ సమాచారం లీకయ్యే ప్రసక్తే లేదని ప్రకటించింది. అయితే, ఈ ప్రకటనలకు భిన్నంగా కొత్త వ్యవస్థను అమలులోకి తేనుండటం ఈ సందర్భంగా గమనార్హం. కొత్త విధానం రూపకల్పన కోసం కొన్ని నెలలనుంచీ యూఐడీఏఐ కసరత్తు చేస్తోంది. కొత్త పద్ధతి ప్రకారం... ఆధార్ ధ్రువీకరణ కోరిన ప్రతిసారి బయోమెట్రిక్ వివరాలుసహా ఒక 'తాజా 16 అంకెల తాత్కాలిక కాల్పనిక సంఖ్య'ను కొత్త వ్యవస్థ సృష్టిస్తుంది. ఇది కేవలం ఒకసారికి మాత్రమే పనికొస్తుంది. ఆధార్ కార్డుదారులు అవసరమైన సందర్భాల్లో ఇలా రోజుకు ఎన్ని కొత్త కాల్పనిక సంఖ్యలనైనా సృష్టించుకోవచ్చు. దీంతోపాటు 'పరిమిత కేవైసీ'కింద కార్డుదారుకు సంబంధించి అవసరమైనంత మేర మాత్రమే వివరాలను ధ్రువీకరించే పద్ధతిని కూడా యూఐడీఏఐ ప్రవేశపెట్టింది.

ఆధార్ లేదంటే... ప్రభుత్వ లెక్కల్లో వ్యక్తి లేనట్టేనా?

దేశంలో తలదాచుకునేందుకు ఇంత నీడలేని నిర్భాగ్యులంతా ప్రభుత్వ లెక్కల్లో ఉన్నటా.. లేనట్టా? సుప్రీం కోర్టు బుధవారం వెలిబుచ్చిన సందేహమిది. అయితే, ఇది ఆధార్‌కు సంబంధించినది కాదు... నిరాశ్రయుల ఇక్కట్లపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ మీద విచారణ సందర్భంగా వేసిన ప్రశ్న. ఎముకలు కొరికే చలిలో నిరాశ్రయులైన ప్రజలకు రాత్రివేళ నీడ కల్పించే ఆశ్రయాల నిర్వహణపై ఈ పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ సాగుతుండగా అటువంటి అభాగ్యులకు ఆధార్ ప్రాతిపదికన ఆశ్రయం కల్పించవచ్చునని రాష్ట్ర ప్రభుత్వ తరపు లాయర్ సూచించారు. దీంతో ధర్మాసనం మండిపడింది. ''అసలు ఇల్లంటూ లేనివారికి ఆధార్ కార్డు పొందడం ఎలా సాధ్యం? అది లేకపోతే వారు ప్రభుత్వ లెక్కల్లో ఉండరా?'' అని నిలదీసింది. అక్కడితో ఊరుకోని సదరు న్యాయవాది... 'ఓటరు గుర్తింపు కార్డు వంటిదైనా చాలు'' అన్నారు. దీంతో చిర్రెత్తుకు రాగా– ''ఓటరు గుర్తింపు కావాలంటే చిరునామా ధ్రువీకరణ కావాలి. కొంపాగోడూ లేనివారు అదెక్కడినుంచి తెస్తారంటారు?'' అని మరో మొట్టికాయ వేసింది.

సహకరించండి

(మొదటి పేజీ తరువాయి)

ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సమావేశం అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. టీఎస్ ఐ పాస్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా నిలిచిందన్నారు. హైదరాబాద్ ఫార్మాసిటీ ఏర్పాటుకు కావాల్సిన నిమ్జ్ స్టేటస్, ఫార్మాసిటీ అభివృద్ధికి రూ.1500 కోట్లను ఇవ్వాలని కేంద్రమంత్రిని కోరినట్టు తెలిపారు. నిజామాబాద్ స్పైస్ పార్క్‌కి రూ.20 కోట్లను కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ప్రకటించిందని, ఆ నిధులు విడుదల చేయాలని కోరినట్లు వివరించారు. హైదరాబాద్–వరంగల్, హైదరాబాద్–రామగుండం, హైదరాబాద్– బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్లకు కావాల్సిన నిధులను కేటాయించాలని సురేశ్‌ప్రభును కోరామని చెప్పారు. ఫిబ్రవరి 22, 23 తేదీలలో హైదరాబాద్‌లో నిర్వహించే బయో ఆసియా సదస్సుకు గౌరవ అతిథిగా కేంద్రమంత్రి సురేశ్‌ప్రభును ఆహ్వానించగా అందుకు ఆయన అంగీకారం తెలిపారన్నారు. అంతకుముందు కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ ఆధ్వర్యంలో జరిగిన పీఐఓ పార్లమెంటేరియన్ (భారత సంతతి పౌరులు) సమావేశంలో మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. దేశంలోనే పాస్‌పోర్ట్‌ల వెరిఫికేషన్, ఇమ్మిగ్రేషన్ విషయాల్లో తెలంగాణ ప్రభుత్వం ముందు వరుసలో ఉందని, ఈ విషయంలో తమను కేంద్ర విదేశాంగ మంత్రి ప్రశంసించారని తెలిపారు. పశ్చిమాసియా దేశాలలో చాలామంది తెలుగువారు ఉన్నారని, ఈ నేపథ్యంలో అక్కడి రాయబార కార్యాలయాల్లో నలుగురి చొప్పున తెలుగు అనువాదకులను నియమిస్తే బాగుంటుం దని సమావేశంలో సూచించామని తెలిపారు. తెలుగువారికి ఉపయోగపడేలా హైదరాబాద్‌లో విదేశీభవన్ ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. సురేశ్‌ప్రభును మంత్రి కేటీఆర్‌తో పాటు ఢిల్లీ తెలంగాణ భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ జి. అశోక్ కుమార్ కలిశారు.

ప్రైవేటు పండుగ



(మొదటి పేజీ తరువాయి)

ప్రైవేటు బస్సు చార్జీలకు రెక్కలొచ్చాయి. భారీస్థాయిలో ఉన్న డిమాండును ప్రైవేటు ట్రావెల్స్ సంస్థలు దర్జాగా సొమ్ముచేసుకొంటున్నాయి. రవాణా శాఖాధికారుల నిర్లిప్తత, ప్రభుత్వ యంత్రాంగం లంచగొండితనాలే పెట్టుబడిగా ప్రైవేటు సంస్థలు ప్రయాణికులను దోచేస్తున్నాయి. సంక్రాంతి సీజన్ అనేగానే మూడు నెలల ముందే రైలు టికెట్లు బుక్ అయిపోతున్నాయి. తత్కాల్ టికెట్లు కూడా హాట్‌కేకుల్లా పెట్టిన రెండు మూడు నిమిషాల్లోనే ఖాళీ అయిపోతున్నాయి. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను పెట్టినా.. అవి అంతంతమాత్రంగానే ఉండటం, వాటిలోనూ టికెట్ ధర ఒకటిన్నర రెట్లు ఉండటానికి తోడు.. మామూలు రోజుల్లో సిటీ సర్వీసుగా తిరిగే బస్సులనే స్పెషల్ బస్సుల పేరుతో తిప్పేస్తారు. దాంతో కాస్త రేటు ఎక్కువైనా ప్రైవేటు బస్సులవైపు వెళ్దామని చూస్తే గుండెలు గుభేలుమంటున్నాయి. రూ. 500 ఉండే టికెట్‌ను రూ. 2వేలకు, వెయ్యి రూపాయలుంటే టికెట్‌ను మూడు వేలకు ట్రావెల్స్ సంస్థలు పెంచేశాయి. బెంగళూరు నుంచి పశ్చిమగోదావరి జిల్లా ఏలూరుకు వెళ్లాలంటే దాదాపు రెండున్నర వేల రూపాయలు పెట్టాల్సి వస్తోంది. పెంచిన ధరలను ఆయా సంస్థల వెబ్‌సైట్లలో బహిరంగంగానే పెడుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విశాఖతో పాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి విజయవాడ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ లాంటి నగరాలకు పెద్దఎత్తున జనం బయలుదేరతారు. కానీ ఈ డిమాండుకు తగినట్లుగా ప్రభుత్వరంగ రవాణా వ్యవస్థ లేకపోవడంతో తప్పనిసరిగా ప్రైవేటువైపు చూడాల్సి వస్తోంది. హైదరాబాద్ నుంచి విజయవాడకు సాధారణంగా రూ. 300–400 మధ్య ఉండే టికెట్ ఇప్పుడు 1000–1500 మధ్య పలుకుతోంది. ఏసీ బస్సు టిక్కెట్ ధర రూ.700 నుంచి 2000కు చేరింది. విశాఖ – బెంగుళూరు ఏసీ టికెట్ రూ.1400 నుంచి మూడున్నరవేలకు చేరింది. రూ. 900 ఉన్న హైదరాబాద్ –విశాఖ ఏసీ టికెట్ ధర ఇప్పుడు మూడు వేల రూపాయలు. సాధారణ టికెట్ ధర 800 నుంచి రెండు వేలకు పెరిగింది. ఇంత పెద్ద మొత్తం చెల్లించి టికెట్ కొన్నా బస్సులు సకాలంలో గమ్యం చేరతాయన్న గ్యారెంటీ లేకపోవడం ప్రయాణికులను కలవరపరుస్తోంది.

ప్రైవేటు బస్సు యాజమాన్యాలు పాత బస్సులను రోడ్డు మీదకు తేవడం.. అవి మధ్యలోనే ఆగిపోవడం ప్రతి సీజన్‌లోనూ కనిపించే తతంగమే. గతంలో ఇలాంటి సీజన్‌లలో తనిఖీలు చేసే రవాణా శాఖాధికారులు ఇప్పుడు ఆ దిశగా ప్రయత్నాలేమీ చేయడం లేదు. అధికార పార్టీకి చెందిన నేతలకే పలు ట్రావెల్స్ సంస్థలు ఉండటం వల్లే అధికారులు ప్రైవేటు బస్సుల జోలికి వెళ్లే సాహసం చేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విమానాల టికెట్లు చుక్కల్లోనే..

సాధారణంగా వారం, పది రోజుల ముందు బుక్ చేసుకుంటే విమాన టికెట్ల ధరలు కాస్తలో కాస్త అందుబాటులోనే కనిపిస్తాయి. కానీ ఇప్పుడు మాత్రం సీజన్‌ను సొమ్ము చేసుకోవడంలో విమానయాన సంస్థలు అందరికంటే ముందున్నాయి. హైదరాబాద్ నుంచి విశాఖపట్నానికి విమాన టికెట్ రూ. 12 వేల నుంచి 15వేల మధ్య పలుకుతోంది. జనవరి 12 నుంచి 14వ తేదీ వరకు కనీసం రూ. 11,600కు తక్కువ టికెట్లే లేవు. హైదరాబాద్–విశాఖ మార్గంలో 12వ తేదీకి ఇండిగో విమాన టికెట్ రూ. 11,607 ఉంది. స్పైస్ జెట్ టికెట్ రూ. 16,389 కనిపిస్తుంటే ఎయిరిండియా వన్ స్టాప్‌టికెట్ ఏకంగా రూ. 22,376 ఉంది.


బ్లాబ్లా కార్లకు డిమాండ్

కొద్దిలో కొద్ది బ్లాబ్లా కార్ లాంటి కార్ పూలింగ్ సైట్లు చాలావరకు నయంగా కనిపిస్తున్నాయి. బెంగళూరు నుంచి ఏలూరుకు వెళ్లాలంటే రూ. 1200 నుంచి కూడా అందుబాటులో ఉన్నాయి.

సాధారణంగా సొంత కార్లు తీసుకుని ఊళ్లకు బయల్దేరేవాళ్లు తాము ఒక్కరం వెళ్లడం ఎందుకని ఇలా కార్‌పూలింగ్ ఆఫర్ చేస్తారు. బస్సులతో పోలిస్తే దీని ధర తక్కువగా ఉండటంతో ఎక్కువమంది వీటి వైపు మొగ్గు చూపిస్తున్నారు.

'సింగిల్ బ్రాండ్'.. 100 పర్సెంట్

(మొదటి పేజీ తరువాయి)



మార్గంలో 'ప్రభుత్వ అంగీకారం'తో అనుమతి ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా 'ఏక సంస్థ వస్తు చిల్లర (సింగిల్ బ్రాండ్ రిటైల్) వ్యాపారం'లో 100 శాతం ఎఫ్‌డీఐ ప్రవాహానికి అనుమతిస్తూ సంస్కరణల విస్తృతికి తెరతీసింది. అలాగే నిర్మాణాభివృద్ధి రంగంలోనూ 100 శాతం ఎఫ్‌డీఐకి తలుపులు తెరవాలని తీర్మానించింది. ఈ మేరకు ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం ఢిల్లీలో జరిగిన మంత్రిమండలి సమావేశం సదరు ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. దీంతోపాటు జాతీయ పౌర విమానయాన సంస్థ 'ఎయిరిండియా'లో విదేశీ విమానయాన సంస్థలు 49 శాతం పెట్టుబడులు పెట్టేందుకు సమ్మతిస్తూ తీర్మానించింది. ఈ నిర్ణయాలతో 'ఐకియా' వంటి విదేశీ ఏక సంస్థ వస్తు వ్యాపార సంస్థలకు లబ్ధి కలుగుతుంది. అలాగే ఎయిరిండియాలో ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ మరింత వేగిరం కావడానికి తోడ్పడుతుంది. ఇప్పటికే చేపట్టిన సంస్కరణలవల్ల 2016–17 ఆర్థిక సంవత్సరం ఎన్నడూ లేనంత రికార్డు స్థాయిలో రూ.3.83 లక్షల కోట్ల పెట్టుబడులు దేశంలోకి ప్రవహించాయి. ఈ నేపథ్యంలో తాజా నిర్ణయాలవల్ల పెట్టుబడుల ప్రవాహం మరింత పెరుగుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

ఎయిరిండియాలో ఎఫ్‌డీఐకి షరతులు

జాతీయ పౌర విమానయాన సంస్థ ఎయిరిండియాలో విదేశీ పెట్టుబడులకు కొన్ని షరతులతో నిబంధనలను ప్రభుత్వం సడలించింది. దీని ప్రకారం... విదేశీ విమానయాన సంస్థలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పెట్టే పెట్టుబడులు 49 శాతానికి మించరాదు. అంతేకాకుండా ఎయిరిండియా యాజమాన్యంలో గణనీయ శాతం, సంస్థపైనియంత్రణ భారత జాతీయుల చేతిలోనే ఉండాలి. ఇప్పుడున్న విధానపరంగా... విదేశీ విమానయాన సంస్థలు ప్రభుత్వ అనుమతి మార్గంలో భారతీయ విమానయాన కంపెనీల చెల్లింపు మూలధనంలో 49 శాతానికి మించకుండా పెట్టుబడులు పెడుతున్నాయి. అయితే, ఈ విధానం కింద ఎయిరిండియాలో ఇలా పెట్టుబడులు పెట్టే అవకాశం ఇప్పటివరకూ లేదు. ఈ నేపథ్యంలో ఎయిరిండియా నుంచి వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణకు కేంద్ర కేబినెట్ ఆర్థిక వ్యవహారాల కమిటీ (సీసీఈఏ) నిరుడు సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. మరోవైపు రుణభారంతో కుంగిపోతున్న ఎయిరిండియాను ప్రభుత్వం ఆదుకుంటూ రావడంవల్ల మన జాతీయ విమానయాన సంస్థ ప్రజాధనంతో మనుగడ సాగిస్తోంది. నిరుడు మార్చి 31నాటికి సంస్థపైగల రూ.48,877 కోట్ల రుణభారంలో రూ.17,360 కోట్లు విమాన కొనుగోళ్ల ఖాతాలోనిది కాగా, రూ.31,517 కోట్లు నిర్వహణ మూలధనానికి సంబంధించిన మొత్తంగా ఉంది.

వాటా విక్రయంపై మంత్రుల బృందం కసరత్తు

ఎయిరిండియాలో ప్రతిపాదిత వ్యూహాత్మక వాటా విక్రయ ప్రక్రియను ఖరారు చేసేందుకు మంత్రుల బృందం ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. ఇది పూర్తికాగానే సంభావ్య కొనుగోలుదారుల నుంచి 'ఆసక్తి వ్యక్తీకరణ'కు ఆహ్వానం పలకనుంది. బుధవారం నాటి మంత్రిమండలి సమావేశంలో ఇతర నిర్ణయాలతోపాటు స్థిరాస్తి రంగంపైనా ఒక స్పష్టత ఇచ్చింది. ఈ మేరకు స్థిరాస్తి క్రయవిక్రయ మధ్యవర్తిత్వ సేవలు స్థిరాస్తి వ్యాపారంగా పరిగణనలోకి రావని వివరించింది. తదనుగుణంగా ఇందులో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ఆటోమేటిక్ మార్గంలో అనుమతి ఇవ్వాలని నిర్ణయించింది. అలాగే విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐ), విదేశీ షేర్లపై పెట్టుబడిదారులు (ఎఫ్‌పీఐ) విద్యుత్ ఎక్స్ఛేంజిలలో ప్రాథమిక మార్కెట్ ద్వారా పెట్టుబడులు పెట్టేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఇంతకుముందు ఎఫ్ఐఐ/ఎఫ్‌పీఐలు షేర్ మార్కెట్ ద్వారా మాత్రమే విద్యుత్ మార్కెట్‌లో ఇలాంటి పెట్టుబడులకు వీలుండేది.

'సింగిల్ బ్రాండ్'పై సీఏఐటీ ఆందోళన

ఏక సంస్థ వస్తు చిల్లర వ్యాపారంలో 100 శాతం ఎఫ్‌డీఐని ఆటోమేటిక్ మార్గంలో అనుమతించడాన్ని అఖిలభారత వ్యాపారుల సమాఖ్య (సీఏఐటీ) వ్యతిరేకించింది. దీనివల్ల భారత చిల్లర వ్యాపార రంగంలో బహుళజాతి సంస్థల ప్రవేశం అత్యంత సులువుగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నిర్ణయం చిన్న వ్యాపారులకు శరాఘాతమని, దీనివల్ల చిరు వ్యాపారుల జీవితాలు ఛిద్రమవుతాయని ఆందోళన వ్యక్తం చేసింది. వాస్తవానికి ఎన్నికల సమయంలో తానిచ్చిన వాగ్దానాన్ని ఈ నిర్ణయంద్వారా బీజేపీ ఉల్లంఘించిందని ఆరోపించింది.

పెట్టుబడులు.. ఉపాధి.. ఆదాయాల వృద్ధి

ఏక సంస్థ వస్తు చిల్లర వ్యాపారంలో ప్రస్తుతం 49 శాతం ఎఫ్‌డీఐని ఆటోమేటిక్ మార్గంలో అనుమతిస్తుండగా ఇకపై అంతకుమించితే ప్రభుత్వ అనుమతి అవసరమవుతుంది. ఈ మేరకు నిబంధనలను సరళీకరించడం వల్ల వాణిజ్య సౌలభ్యం పెరుగుతుందని ప్రభుత్వం పేర్కొంటోంది. దేశంలోకి విదేశీ పెట్టుబడులు మరింతగా ప్రవహించి, పెట్టుబడితోపాటు ఉపాధి, ఆదాయాలపరంగా వృద్ధి నమోదయ్యేందుకు ఈ నిర్ణయం దోహదపడగలదని చెబుతోంది. పెట్టుబడులకు ముందస్తు అనుమతి అవసరం ఉండదు కాబట్టి ఆటోమేటిక్ మార్గంలో సత్వర ఆమోదానికి వీలు కలుగుతుంది. ఈ పరిణామం ఫలితంగా ఏక సంస్థ వస్తు చిల్లర వ్యాపారంలోకి పెట్టుబడుల వేగం పెరుగుతుందని భావిస్తున్నట్లు ఓ ప్రైవేటు సంస్థ భాగస్వామి ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

ఏపీకి 60.. తెలంగాణకు 50 టీఎంసీలు

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించింది. జలసౌధాలో బుధవారం నాడు బోర్డు సమావేశం జరిగింది. ఇందులో బోర్డు సభ్య కార్యదర్శి పరమేశం, తెలంగాణ నీటి పారుదల శాఖ ఇంజనీరు ఇన్ చీఫ్ మురళీధర్, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఇప్పటి వరకు వినియోగించుకున్న నీటితో పాటు భవిష్యత్ వినియోగంపైనా ఈ సమావేశంలో చర్చించారు. అందుబాటులో ఉన్న 139 టీఎంసీల నీటిని వచ్చే ఆగస్టు నెల వరకు జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని ఉభయ రాష్ట్రాలకు బోర్డు సూచించింది. 20 టీఎంసీల నీటిని పక్కకు పెట్టి 110 టీఎంసీలనీటిని మాత్రమే రెండు రాష్ట్రాలు ఉపయోగించుకునేలా నిర్ణయం తీసుకున్నారు. టెలిమెట్రీ, చిన్న నీటి వనరుల వినియోగం తో పాటు ఇతర అంశాలపై ఏర్పాటు చేసిన కమిటీలు ఇచ్చే నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

చెక్కులే కావాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కువ మంది రైతులు కోరారని మంత్రి స్పష్టం చేశారు. 71 లక్షల 75 వేల మంది రైతులు ఉన్నట్లు అధికారులు గుర్తించారని వెల్లడించారు. సాగులో ఉన్న భూమి కోటి ఎకరాలకు పైగా ఉన్నట్లు గుర్తించినట్లు మంత్రి తెలిపారు. ఇన్ని ఎకరాల వరకే పెట్టుబడి ఇస్తామనే కటాఫ్ ఆలోచన ఇప్పటి వరకు లేదన్నారు. 92.7 శాతం మంది రైతులకు 10 ఎకరాల లోపు భూమి ఉందని పోచారం శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. 0.28 శాతం మందికి మాత్రమే 20 ఎకరాల పైగా భూమి ఉందని వెల్లడించారు.సాగుకు అనువుగా లేని భూములను ఈ పథకం పరిధి నుంచి తొలగించాలని కమిటీ సభ్యులు సూచించారు. ఎకరాలపై పరిమితి లేదని, 97.2 శాతం మంది రైతులు పది ఎకరాలలోపు వారేనని, ఈ పథకం అమలులో ఎలాంటి అవకతవకలు లేకుండా సమర్థవంతంగా అమలు చేస్తామని ఉద్ఘాటించారు. ఈ పథకం అమలు తర్వాత బ్యాంకుల్లో నగదు నిల్వలు లేక రైతులు ఇబ్బందులు పడే అవకాశం ఉందని, రైతులకు అవసరమైనంత వేర నగదు నిల్వలు అందుబాటులో ఉంచుకోవాలని బ్యాంకులను కోరామని పేర్కొన్నారు. తుది నివేదికను రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సమర్పిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులైన మంత్రులు ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వరరావు, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో వరద.. బురద

(మొదటి పేజీ తరువాయి)

బీభత్సం సృష్టించింది. కొండచరియలు విరిగి పడ్డాయి. నీటి ప్రవాహానికి బురద తోడై రోడ్లను ముంచెత్తింది. ఇళ్లలోకి బురద చొచ్చుకురావడం, పైనుంచి కొండచరియలు విరిగిపడడంతో పదుల సంఖ్యలో ఇళ్లు ధ్వంసమయ్యాయి. దీంతో 13 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 20 మందికిపైగా గల్లంతయ్యారు. ఇటీవల భారీ దావాగ్ని కారణంగా వేల ఎకరాల అటవీ భూమి దగ్ధమై పోగా వర్షం నీటిని పీల్చుకోలేదని అధికారులు తెలిపారు. దీంతో వరద ఉద్ధృతి భారగా పెరిగిందని వివరించారు. శాంతా బార్బరా సమీపంలోని మౌంటు సిటీలో నీటి ప్రవాహానికి కొండలపై నుంచి భారీగా బురద, బండరాళ్లు కొట్టుకు వచ్చి జనావాసాలపై పడ్డాయి. అధికారులు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపడుతున్నారు. శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. మాంటెసిటోలో ఇలా శిథిలాల కింద చిక్కుకున్న 14 ఏళ్ల యువతిని రక్షించినట్లు తెలిపారు.

పలు రహ దారులపై కిలోమీటర్ల మేర బురద పేరుకు పోవడంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచి పోయింది. కాలిఫోర్నియా హైవేపై బురద కార ణంగా సుమారు 275 వాహనాలు చిక్కు కుపోయాయని హైవే పెట్రోల్ అధికారులు వెల్ల డించారు.

ప్రేమించలేదని చంపేశాడు!

నిద్రిస్తున్న యువతిపై కత్తితో దాడి
కూకట్‌పల్లిలో ప్రేమోన్మాది దారుణం





హైదరాబాద్, జనవరి 10(మనం ప్రతినిధి):

మొన్న సంధ్యారాణి.. నిన్న ప్రవల్లిక.. నేడు జానకి.. ప్రేమోన్మాదుల చేతిలో బలయ్యారు. ప్రేమను తిరస్కరించిందనే ఆగ్రహంతో ఓ ప్రేమోన్మాది.. నగరంలోని మూసాపేట్ హబీబ్‌నగర్‌లో దారుణానికి ఒడిగట్టాడు. మంగళవారం రాత్రి యువతి నిద్రిస్తున్న గదిలోకి ప్రవేశించిన దుండగుడు ఆమెను కత్తితో పొడిచి చంపేశాడు. ప్రేమను నిరాకరించిన పాపానికి యువతిని దారుణంగా హత్య చేసి పరారయ్యాడని చెబుతున్నారు పోలీసులు. శ్రీకాకుళం జిల్లా రాజాం మండలం గుయ్యనవలస గ్రామానికి చెందిన బోను జానకి(24) కేపీహెచ్‌బీలోని డీమార్ట్ సూపర్ మార్కెట్లో పనిచేస్తోంది. మూసాపేట హబీబ్‌నగర్‌లో రూప అనే అమ్మాయితో కలిసి అద్దెకుంటోంది. జానకి పనిచేస్తున్న సూపర్ మార్కెట్‌లోనే రంగారెడ్డి జిల్లా పెద్దేముల్ సమీపంలోని మారేపల్లి గ్రామానికి చెందిన అనంతప్ప అలియాస్ ఆనంద్ కూడా పనిచేస్తున్నాడు. కొద్దికాలంగా తనను ప్రేమించాలం టూ జానకిని వేధిస్తున్నాడు. జానకి తిరస్కరించడంతో.. పది రోజుల క్రితం జానకి ఇంటికి వెళ్లి తనను ప్రేమించకపోతే చంపేస్తానని బెదిరించి వెళ్లాడు. దీంతో ఆందోళన చెందిన జానకి ఉద్యోగానికి రాజీనామా చేసి ఇంటికి వెళ్లిపోవాలని నిర్ణయించుకుంది.

పండుగకు ఊరెళ్లి పోతానని, తిరిగి వచ్చే ఉద్దేశం లేదని కొలీగ్స్‌తో చెప్పింది. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం రూప ఇంటికి వచ్చేసరికి గదిలో జానకి రక్తపు మడుగులో ఉంది. కడుపులో కత్తి పోట్లతో అపస్మారకస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. వెంటనే స్పందించిన రూప చుట్టుపక్కల వారి సాయంతో జానకిని సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించింది. అయితే, కత్తిపోట్ల కారణంగా తీవ్ర రక్తస్రావం కావడంతో పరిస్థితి విషమించిదని వైద్యులు పేర్కొన్నారు. మరో ఆస్పత్రికి తీసుకెళ్లమని సూచించడంతో కూకట్‌పల్లిలోని మరో పెద్ద ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి జానకి తుదిశ్వాస విడిచింది.

అదుపులో నిందితుడు: ఎస్సై నారాయణ సింగ్

స్నేహితురాలు రూప పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో నిందితున్ని అదుపులోకి తీసుకున్నట్టు కూకట్‌పల్లి ఎస్సై నారాయణ సింగ్ తెలిపారు. ఘటన స్థలిని పరిశీలించామన్నారు. నిందితున్ని విచారిస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. ఘటన గూర్చి ఎస్సై మాట్లాడుతూ జానకి మృతదేహంపై మూడు కత్తిపోట్లు ఉన్నాయని, కడుపులో రెండు కత్తిపోట్లు, ఎదపైన ఓ కత్తిపోట్లు ఉన్నాయన్నారు. పక్కనే ఉన్న ఈశ్వర్ అనే యువకుడి సహాయంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి ఆస్పత్రికి తరలించారు. బెటర్ ట్రీట్‌మెంట్ కోసం మరో ఆస్పత్రికి తీసుకెళ్లారు. కానీ ఆ సమయానికే జానకి చనిపోయినట్టుగా వైద్యులు వెల్లడించారని ఎస్సై తెలిపారు.

నిందితున్ని కఠినంగా శిక్షించాలి: స్థానికులు

నాలుగు సంవత్సరాలుగా జానకి, రూపలు ఇక్కడే ఉంటున్నారు. వాళ్లు ఎప్పుడూ అనవసరంగా ఎవరితో నూ మాట్లాడేవారు కాదు. ఉదయం విధులకు వెళ్లి సాయంత్రం వచ్చే వాళ్లు. వీరు డిమార్ట్‌లో పనిచేసేవారు. ఇంట్లో ఉన్న ఇద్దరు యువతులు ఎప్పుడూ కూడా తమ పని తాము చేసుకునేవారని, అనంతప్ప ఒకసారి ఆమెతో గొడవపడి డీమార్ట్‌లో ఫోన్ కూడా పగులగొట్టాడు. అతడు బాగా బెదిరిస్తున్నాడని తమ దృష్టికి తీసుకొచ్చాందని స్థానికుడు ఈశ్వర్ తెలిపారు. అభం శుభం తెలియని అమ్మాయిని దారుణంగా హత్య చేసిన నరరూప రాక్షసుడిని కఠినంగా శిక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

ఊరెళ్లిపోతానని చెప్పింది..

అనంతప్ప వేధింపులతో జానకి భయాందోళనలకు లోనైంది. ఈ పరిస్థితిలో ఇక్కడే ఉండలేనని, ఈ నెల జీతం అందుకున్నాక ఉద్యోగం మానేసి ఊరికి వెళ్లిపోతానని జానకి స్నేహితురాలు అందని రూప వివరించింది. సంక్రాంతి పండుగకు వెళ్లి అటే ఉంటానని, తిరిగి వచ్చే ఉద్దేశం తనకు లేదని చెప్పినట్లు వివరించింది. ఒకటి రెండు రోజుల్లో ఊరెళ్లేందుకు అన్నీ సిద్ధం చేసుకుందని, అయితే ఇంతలోనే ఈ దారుణం జరిగిందని రూప కన్నీటి పర్యంతమైంది.



కేంద్రీయ విద్యాలయాల్లో

హిందూ ప్రార్థనలా?

- **వివరణ ఇవ్వండి.. కేంద్రానికి సుప్రీం ఆదేశం**

న్యూఢిల్లీ, జనవరి 10: కేంద్రీయ విద్యాలయాల్లో ఉదయం సమావేశంలో విద్యార్థులందరూ తమ విశ్వాసాలకు భిన్నంగా తప్పనిసరిగా హిందూ మతానికి సంబంధించిన ప్రార్థన చేయడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన సుప్రీం కోర్టు.. దీనిపై వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. జస్టిస్ నారిమన్, జస్టిస్ నవీన్ సిన్హాలతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. దేశ వ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విద్యాలయాల్లో బలవంతంగా విద్యార్థులచే ప్రార్థన చేయిస్తున్నారని మధ్యప్రదేశ్‌కు చెందిన వీనాయక్ షా తన పిటిషన్‌లో పేర్కొన్నారు. మైనార్టీ మతాలకు చెందిన పిల్లలు, తల్లిదండ్రుల విశ్వాసాలకు భిన్నంగా ప్రార్థన చేయించడం రాజ్యాంగ వ్యతిరేకమని ఆక్షేపించారు. విద్యార్థులు, టీచర్లు అందరిచే సామూహిక ప్రార్థన చేయించడంపై కేంద్ర ప్రభుత్వాన్ని, కేంద్రీయ విద్యాలయాలను బాధ్యులుగా పేర్కొంటూ మార్గదర్శనం చేయాలని సుప్రీం కోర్టును కోరారు.

సిట్ చేతికి సిక్కు అల్లర్ల కేసు

- **ముగ్గురితో ఏర్పాటు చేస్తాం: సుప్రీం**

న్యూఢిల్లీ, జనవరి 10: 1984లో దివంగత ప్రధాని ఇందిరా గాంధీ హత్యానంతరం సిక్కులపై జరిగిన దాడి కేసుల విచారణను పర్యవేక్షించడానికి కొత్తగా సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) ఏర్పాటు చేయనున్నట్టు సుప్రీం కోర్టు ప్రకటించింది. హైకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో ముగ్గురు సభ్యులను నియమించనున్నట్టు వెల్లడించింది. సిట్ ఏర్పాటుకు పేర్లను సూచించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా సారథ్యంలో జస్టిస్ ఏఎం ఖాన్‌విల్కర్, జస్టిస్ చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు సూచించింది. హైకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో ఏర్పాటు చేసే సిట్‌లో ఒక విశ్రాంత ఐపీఎస్ అధికారి, సర్వీసులో ఉన్న ఐపీఎస్ అధికారి సభ్యులుగా ఉండాలని స్పష్టం చేసింది. సిక్కులపై దాడులకు సంబంధించి 241 కేసులు నమోదు కాగా, వీటిలో 186 కేసులను విచారించకుండానే మూసివేసినట్టు తాము నియమించిన పర్యవేక్షణ కమిటీ తమ దృష్టికి తీసుకువచ్చినట్టు సుప్రీం ధర్మాసనం వెల్లడించింది.

జూన్ 28 నుంచి అమర్‌నాథ్ యాత్ర

- **ఆగస్టు 26వరకు కొనసాగింపు: దేవస్థానం బోర్డు**

న్యూఢిల్లీ, జనవరి 10: ఈ ఏడాది అమర్‌నాథ్ యాత్ర 60 రోజులపాటు కొనసాగనుంది. జూన్ 28 నుంచి ఆగస్టు 26 వరకు యాత్ర కొనసాగుతుందని దేవస్థానం బోర్డు ప్రకటించింది. ఈ మేరకు బోర్డు చైర్మన్, రాష్ట్ర గవర్నర్ ఎన్ఎన్ వోహ్రా నేతృత్వంలోని బోర్డు సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. కాగా, దక్షిణ కశ్మీర్ హిమాలయాల్లోని ఈ దేవాలయ పరిసరాల్లో అనుసరించాల్సిన విధివిధానాలపై ఇటీవల జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ) ఇచ్చిన ఆదేశాలపైనా చర్చించామని, వీటిపై సమీక్షా పిటిషన్ దాఖలు చేస్తామని అధికారులు వివరించారు. వివరించారు. దేవాలయ పరిసరాల్లో అందరూ నిశ్శబ్దం పాటించాలని ట్రైబ్యునల్ ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై నిరసనలు వ్యక్తంకావడంతో.. గుహలో మంత్ర ఉచ్చారణలు, భజనలపై తాము ఎలాంటి నిబంధనలూ విధించడంలేదని ఎన్‌జీటీ స్పష్టతనిచ్చింది.మంచు లింగం ముందుకు వెళ్లినప్పుడు మాత్రం అందరూ నిశ్శబ్దంగానే ఉండాలని స్పష్టీకరించింది.



త్వరలో ఎగిరే రిక్షాలు!

- **నగరాల్లో ట్రాఫిక్ చిక్కులకు చెక్**
- **కేంద్ర మంత్రి జయంత్ సిన్హా వెల్లడి**

జంషెడ్‌పూర్, జనవరి 10: నగరాల్లో ట్రాఫిక్ అవస్థల బారి నుంచి బయటపడి సుఖంగా ప్రయాణించేలా త్వరలో ఎయిర్ రిక్షాలు అందుబాటులోకి వస్తాయని కేంద్ర విమానయానశాఖ సహాయ మంత్రి జయంత్ సిన్హా వెల్లడించారు. డ్రోన్ల టెక్నాలజీ సాయంతో సులభంగా ప్రయాణించేలా ఎయిర్ రిక్షాలు తీసుకురావాలని అనుకుంటున్నట్లు కేంద్రమంత్రి పేర్కొన్నారు. జంషెడ్ పూర్ నగరంలోని జేఆర్డీ టాటా స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో టాటా స్టీల్, సీఐఐ సంయుక్తంగా ఏర్పాటుచేసిన సదస్సులో కేంద్రమంత్రి పాల్గొని ప్రసంగించారు. ఆకాశంలో ప్రయాణించడానికి అయ్యే వ్యయం ఆటోరిక్షాల్లో ప్రయాణానికి అయ్యే వ్యయం ఒకటేనని తాజాగా నిర్వహించిన సర్వేలో తేలిందని మంత్రి చెప్పారు. నగరవాసులు ఆటోల్లో కిలోమీటరు దూరం ప్రయాణించడానికి నాలుగు రూపాయలు చార్జీ చెల్లిస్తున్నారని అలాగే విమానాల్లో వేలకిలోమీటర్ల దూరం ప్రయాణిస్తున్నందున విమాన చార్జీ ఎక్కువ అవుతుందని పేర్కొన్నారు. డ్రోన్ సాంకేతికతతో ఎయిర్ రిక్షాలు నడిపేందుకు వీలుగా తమ విమానయాన మంత్రిత్వ శాఖ నిబంధనలు రూపొందిస్తుందని మంత్రి చెప్పారు. ఇప్పటికే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, జర్మనీ దేశాల్లో ఎయిర్ సర్వీసులు నడుస్తున్నాయని అదే తరహాలో తాము కూడా ఎయిర్ రిక్షాలు నడిపే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు మంత్రి వివరించారు.

బ్రిటన్ కేబినెట్‌లో నారాయణమూర్తి అల్లుడు



- **మరో భారతీయుడికి కూడా చోటు..**

లండన్, జనవరి 10: బ్రిటన్ మంత్రివర్గంలో తాజాగా ఇద్దరు భారతీయులకు స్థానం లభించింది. పునర్వ్యవస్థీకరణలో భాగంగా ప్రధాని థెరీసా మే.. రిచ్‌మండ్ ఎంపీ రిషీ సునాక్, ఫేర్‌హామ్ ఎంపీ సుయెలా ఫెర్నాండెజ్‌కు కేబినెట్ హోదాతో మంత్రిత్వ శాఖలు కేటాయించారు. కాగా, రిషీ సునాక్.. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి అల్లుడు కావడం విశేషం. మరో ఎంపీ, సుయెలా ఫెర్నాండెజ్ పూర్వీకులు గోవాకు చెందినవారు. సునక్‌కు కేబినెట్ ర్యాంకుతో హౌజింగ్ శాఖను కేటాయించగా.. ఫెర్నాండెజ్‌కు యురోపియన్ యూనియన్‌లో ప్రస్తుతమున్న బ్రిటన్ తరపు శాఖను అప్పజెప్పారు. రిషి నార్త్ యార్క్‌షైర్‌లోని రిచ్‌మండ్ నుంచి 2015లో తొలిసారి ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2017 మళ్లీ ఎన్నికయ్యారు. 37 ఏళ్ల రిషి సునక్.. ఆక్స్‌ఫర్డ్, స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాల్లో చదువుకున్నారు. బెంగుళూరుకు చెందిన ఓ సిలికాన్ వ్యాలీ కంపెనీలో సునక్ పెట్టుబడులు ఉన్నాయి. స్టాన్‌ఫర్డ్ వర్సిటీలో నారాయణమూర్తి కుమార్తె అక్షత మూర్తితో సునక్‌కు పరిచయమైంది. కాగా, ఇప్పటివరకు హౌజింగ్ శాఖ బాధ్యతలు చూసిన అలోక్ శర్మకు ఉపాధి కల్పన శాఖను కేటాయించారు.

‘ఎంపీలాడ్స్’... మరో మూడేళ్లు

2020 మార్చిదాకా పొడిగింపు

- **టీఎస్‌పీఎల్ మూసివేతకు ఓకే**
- **కేంద్ర కేబినెట్ భేటీ నిర్ణయాలు**

న్యూఢిల్లీ, జనవరి 10: పార్లమెంటు సభ్యుల నియోజకవర్గ అభివృద్ధి పథకం (ఎంపీలాడ్స్)ను 2020 మార్చి 31దాకా కొనసాగించాలని కేంద్రం నిర్ణయించింది. బుధవారం ప్రధాని మోదీ అధ్యక్షతన ఢిల్లీలో సాగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశం ఈ మేరకు (సీసీఈఏ) తీర్మానించింది. అలాగే మంత్రిమండలి భేటీలోనూ పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదం తెలిపినట్లు అధికార ప్రకటన తెలిపింది. ఎంపీలాడ్స్ పొడిగింపు నేపథ్యంలో ఏటా రూ.3,950 కోట్ల వంతున మూడేళ్లలో రూ.11,850 కోట్లను ప్రభుత్వం ఈ పథకానికి కేటాయిస్తుంది. అంతేకాకుండా స్వతంత్ర సంస్థద్వారా ఈ పథకంపై పర్యవేక్షణకు, రాష్ట్ర/జిల్లా స్థాయి అధికారులకు సామర్థ్య నిర్మాణం/శిక్షణ కోసం కేంద్ర నిర్వహించే కార్యక్రమాలకు ఏటా అదనంగా రూ.5 కోట్ల వంతున కేటాయిస్తారు. ఎంపీలాడ్స్ పథకం 1993-94లో ప్రారంభం కాగా- 2017 ఆగస్టు వరకూ దేశవ్యాప్తంగా రూ.44,929 కోట్లకుపైగా నిధులతో 18,82,180 పనులు పూర్తిచేశారు. ఇక 2015 డిసెంబరు నాటి సీసీఈఏ భేటీ నిర్ణయం మేరకు తుంగభద్ర స్టీల్ ప్రాడక్ట్స్ లిమిటెడ్ (టీఎస్‌పీఎల్) మూసివేతకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మైసూర్ (కర్ణాటక), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల సమాన భాగస్వామ్యంతో 1960లలో ఇది ఏర్పాటైన ఈ సంస్థ పేరును కంపెనీల రిజిస్ట్రార్ రికార్డుల నుంచి కూడా తొలగిస్తారు. ఈ సంస్థకు సంబంధించిన 20వేల చదరపు మీటర్ల భూమితోపాటు లోహశోధన-సామగ్రి నిర్వహణ ప్లాంట్లను ప్రస్తుత కర్ణాటక ప్రభుత్వానికి అప్పగించాలని మంత్రిమండలి తీర్మానించింది. అలాగే హోస్పేట్‌లోని 82.37 ఎకరాల భూమిని ఎకరా రూ.66 లక్షల వంతున కర్ణాటక ప్రభుత్వానికి విక్రయించాలని నిర్ణయించింది.



‘దిలీప్’ బంగ్లా

ఆక్రమణ యత్నం

- **బిల్డర్‌పై చీటింగ్ కేసు నమోదు**

ముంబై, జనవరి 10: ఫ్లాట్ రిజిస్ట్రేషన్ పత్రాలను ఫోర్జరీ చేసి ఆస్తి హక్కు కోరుతూ కోర్టుకెక్కిన ఓ బిల్డర్‌పై ముంబై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. ప్రఖ్యాత నటుడు దిలీప్ కుమార్‌కు చెందిన బాంద్రాలోని బిల్డింగ్ తన స్థలంలో నిర్మించారని ఆరోపిస్తూ స్థానిక బిల్డర్ సమీర్ భోజ్వానీ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇందుకు రుజువుగా ఫ్లాట్ రిజిస్ట్రేషన్ పత్రాలనూ చూపించా డు. తన ఫ్లాట్‌లో అక్రమంగా బిల్డింగ్ నిర్మించారని ఆరోపిస్తూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. సదరు డాక్యుమెంట్లను పరిశీలించిన పోలీసులు అవి ఫోర్జరీ చేసినవి కావొచ్చని సందేహించారు. ఈ క్రమంలో దిలీప్ కుమార్ భార్య సైరా బాను ఫిర్యాదు చేయడంతో సమీర్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు డిప్యూటీ కమిషనర్ పరాగ్ మనెరే తెలిపారు.

విజయయాత్రలో

పాక్ జిందాబాద్ నినాదాలు



- **యూపీ నగర పాలక సంస్థ చైర్‌పర్సన్‌పై దేశద్రోహం కేసు**

బరేలీ(ఉత్తర ప్రదేశ్), జనవరి 10: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని నవాబ్‌గంజ్ నగర పాలిక పరిషత్ నూతన చైర్‌పర్సన్ షిఫ్లా తాహిర్‌పై దేశద్రోహం కేసు నమోదయ్యింది. షిఫ్లాతాహిర్ చైర్‌పర్సన్‌గా ఎన్నికవ్వడంతో గత డిసెంబరు 23న తాహిర్ భర్త మహ్మద్ తాహిర్ మరో 500 మందితో కలిసి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా పాకిస్థాన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. వీహెచ్‌పీ నవాబ్‌గంజ్ విభాగం చైర్మన్ అఖిలేష్ గంగావర్ ఫిర్యాదు మేరకు పోలీసులు ఆమెపై కేసు నమోదు చేశారు. ఊరేగింపునకు సంబంధించిన వీడియోను లఖ్‌నవ్‌లోని ఫోరెన్సిక్ విభాగానికి పోలీసులు పంపగా, ఆరోపణలు నిజమేనని తేలడంతో ఆమెపై దేశద్రోహం కేసు నమోదు చేశారు. కాగా, నవాబ్‌గంజ్ నగర పాలిక ఎన్నికల్లో నవంబరులో గెలిచిన షిఫ్లా, పోలింగ్ సమయంలో అరెస్టు అయ్యారు. ఈ కేసుకు సంబంధించి హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్న ఆమె డిసెంబరు 23న గ్రామానికి తిరిగి వచ్చారు.

హిందువులైతే బీజేపీకి ఓటేయండి

- **ముస్లింలైతే కాంగ్రెస్‌కు వేయండి**
- **రాజస్థాన్ మంత్రి వ్యాఖ్యపై దుమారం**

అల్వార్, జనవరి 10: హిందువులందరూ బీజేపీకి ఓటు వేయాలని, ముస్లింలు కాంగ్రెస్‌కు వేయాలని రాజస్థాన్ మంత్రి జస్వంత్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. అల్వార్ లోక్‌సభ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉన్న యాదవ్ ఈ వ్యాఖ్యలు చేసినట్టుగా వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మేవాత్ ఎన్నికల ప్రచారంలో ముస్లింలను ఉద్దేశించి యాదవ్ మాట్లాడుతూ.. తాను చేసిన అభివృద్ధి పనులకు తనకు ఓటు వేయాలని, బీజేపీకి కాదని, ఇది హిందువుల పార్టీ అని అన్నారు. దుగేడా గ్రామంలో ఆయన ప్రచారం చేస్తూ.. ‘‘మీరు హిందువులు కాబట్టి నాకు ఓటు వేయండి. మీరు ముస్లింలు అయితే కాంగ్రెస్‌కు వేయండి’’ అని వ్యాఖ్యానించారు. అలాగే నామినేషన్ కార్యక్రమానికి భారీ వాహన శ్రేణితో రావాలని, వీటికి తాను బిల్లు చెల్లిస్తానని యాదవ్ చెబుతున్నట్టుగా మరో వీడియోలో ఉంది. కాంగ్రెస్ నాయకులు వీటిపై ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. తనపై వచ్చిన ఆరోపణలను యాదవ్ ఖండించారు. ఈ వీడి యో క్లిప్‌లు కాంగ్రెస్ కుట్రని విమర్శించారు. తన వ్యాఖ్యలను వక్రీకరించేలా కాంగ్రెస్ నాయకులు వీడియోలను రూపొందించారని ఆరోపించారు. గతంలో తాను ‘ఉత్తమ ప్రధాని మోదీ’ అని వ్యాఖ్యానించగా, అవినీతిప్రధాని అన్నట్టుగా కాంగ్రెస్ నాయకులు చిత్రీకరించారని యాదవ్ పేర్కొన్నారు.

చిరుత దాడిలో ముగ్గురు పిల్లలు మృతి

- **బాలుడిని చంపేసి సగం తినేసిన మృగం**
- **మధ్యప్రదేశ్ జిల్లాలో దారుణం..**
- **సమీప గ్రామాల్లో భయాందోళనలు**

చింద్వారా(మధ్యప్రదేశ్), జనవరి 10: జనారణ్యంలోకి వచ్చిన ఓ చిరుత ముగ్గురు చిన్నారుల ప్రాణాలను బలితీసు కోవడంతో పాటు అందులో ఒకరి శరీరాన్ని సగం వరకూ తినేసింది. మధ్యప్రదేశ్ రాష్ట్రం లోని చింద్వారా జిల్లాలోని అటవీ సమీప గ్రామాల్లో ఈ సంఘటన చోటుచేసుకుంది. వరుసగా రోజుకో చిన్నారిని ఈ మృగం పొట్టనపెట్టుకుంటుండడంతో స్థానికుల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. రాత్రిపూట బయటికి వెళ్లాలంటేనే భయంతో వణికిపోతున్నారు. మంగళవారం రాత్రి జిర్పానీ గ్రామానికి చెందిన ఓ పన్నెండేళ్ల కుర్రాడు చిరుతకు ఆహారంగా మారిపోయాడు. కుర్రాడిపై దాడి చేసిన చిరుత అతడిని చంపేసి, శరీరంలో కొంత భాగాన్ని ఆహారంగా స్వీకరించింది. తెల్లవారిన తర్వాత పిల్లాడి మృతదేహాన్ని చూసి గ్రామస్థులు తీవ్ర ఆందోళనకులోనయ్యారు. చిరుత బారి నుంచి కాపాడాలంటూ అధికారులను వేడుకున్నారు. కాగా, చిరుత తొలిసారిగా ఆదివారం నాడు ఓ మూడేళ్ల చిన్నారిపై దాడిచేసింది. మోహ్లిమాతా గ్రామానికి చెందిన ఇద్దరు అక్కచెల్లెల్లు వంటచెరుకు కోసం గ్రామం పక్కనే ఉన్న అడవిలోకి వెళ్లారు. ఈ క్రమంలో కట్టెలు ఏరుతున్న మూడేళ్ల చిన్నారిపై చిరుత దాడి చేసి చంపేసింది. ఆ చిన్నారి సోదరి భయంతో వణుకుతూ చిరుత కంటపడకుండా తప్పించుకుంది. అదేరోజు బిజౌలీ పాథర్ గ్రామానికి చెందిన పదేళ్ల కుర్రాడిపైనా చిరుత దాడి చేసింది. గ్రామంలోని తన ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న కుర్రాడిపై పంజా విసిరి గాయపరిచింది. అనంతరం బాలుడి శరీరాన్ని వంద మీటర్ల వరకు ఈడ్చుకెళ్లి వదిలేసింది. తీవ్రగాయాలపాలైన కుర్రాడు ఆ తర్వాత కొద్దిసేపటికే మరణించాడు. కాగా, రక్తం రుచిమరిగిన ఈ చిరుతను మట్టుబెట్టడానికి పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపట్టామని అటవీశాఖ అధికారులు వెల్లడించారు. దాడిలో మృతిచెందిన పిల్లల కుటుంబాలకు నష్ట పరిహారం అందించనున్నట్లు తెలిపారు.



మన ఆర్మీ దెబ్బకు..

138మంది పాక్ సైనికుల మృతి




- **సరిహద్దుల్లో కవ్వింపుల ఫలితం**

న్యూఢిల్లీ, జనవరి 10: సరిహద్దుల్లో కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉన్నా తరచుగా దాన్ని ఉల్లంఘించి కవ్వింపు చర్యలకు పాల్పడడం పాకిస్థాన్‌కు అలవాటే.. ఆయా సందర్భాలలో భారత సైనికులు ఎదురుకాల్పులు జరపడమూ సాధారణమే! గత ఏడాదిలో ఇలాంటి కవ్వింపు చర్యల ఫలితంగా పాక్ 138 సైనికులను పోగొట్టుకుందని జమ్ము, కశ్మీర్ ప్రభుత్వం సహా ఇంటలి జెన్స్ వర్గాల సమాచారం. ఇదే సమయంలో 28 మంది భారతీయ సైనికులు ప్రాణాలు కోల్పోగా మరో 70 మందికి గాయాలయ్యాయని తెలిపింది. సరిహద్దుల్లో పాక్ సైనికుల కవ్వింపు చర్యలతో పాటు పలు ఉగ్రవాద కార్యకలాపాలకు కౌంటర్‌గా భారత సైన్యం నిర్వహించిన పలు ఆపరేషన్లలో 138 మంది పాక్ సైనికులు చనిపోగా 155 మంది గాయాలపాలయ్యారు. అయితే, ఇలాంటి ఘటనలలో మరణించిన వారు సైనికులు కారని, సాధారణ పౌరులను భారత సైన్యం పొట్టనబెట్టుకుందని ఆరోపించడం పాక్ ప్రభుత్వానికి అలవాటని సైనిక అధికార ప్రతినిధి కల్నల్ అమన్ ఆనంద్ తెలిపారు. ఇటీవల భారత సైన్యానికి చెందిన ఐదుగురు కమాండోలు సరిహద్దు దాటి వెళ్లి ముగ్గురు పాక్ సైనికులను చంపేసిన సంఘటనలోనూ పాక్ ఇదే అబద్ధాన్ని కొనసాగించిందన్నారు. పాక్ సైనికుల కవ్వింపు చర్యలను భారత సైన్యం ఎప్పటికప్పుడు సమర్థంగా తిప్పికొట్టిందని, భవిష్యత్తులోనూ ఇలాగే వారికి బుద్ధి చెబుతూనే ఉంటామని ఆయన స్పష్టంచేశారు. మొత్తంగా గతఏడాది 221 పర్యాయాలు పాక్ సైనికులు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించారని పేర్కొన్నారు. కాగా, 2017 లో భారత సరిహద్దుల్లో కాల్పుల ఘటనలు ఎన్ని చోటుచేసుకున్నాయి.. అందులో పాక్ సైనికులకు ఎంతమందికి గాయాలయ్యాయన్న ప్రశ్నపై పాక్ సైన్యం స్పందించలేదు.

తమిళనాడు ఎమ్మెల్యేల వేతనాలు రెట్టింపు

అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టిన సీఎం పళనిస్వామి



- **జీతాల పెంపుకోసం వారం రోజులుగా ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె**
- **అయినా.. పట్టించుకోని ప్రభుత్వ.. వెల్లువెత్తిన విమర్శలు**

చెన్నై, జనవరి 10: జీతాలు పెంచాలంటూ వారం రోజుల నుంచి నిరవధిక సమ్మె చేస్తున్న తమిళనాడు ఆర్టీసీ కార్మికులకు అక్కడి ప్రభుత్వం షాకిచ్చింది. ఆర్టీసీ కార్మిక సంఘాల డిమాండ్లను పక్కనబెట్టి... ఎమ్మెల్యేల జీతాలు, అలవెన్సులు పెంచాలంటూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బుధవారం అసెంబ్లీలో సీఎం పళనిస్వామి ఓ బిల్లును ప్రవేశపెట్టారు. అది ఆమోదం పొందితే ఎమ్మెల్యే వేతనాలు నెలకు రూ.55 వేల నుంచి రూ. 1.05 లక్షలకు పెరగనుంది. అలాగే, ఎమ్మెల్యే అభివృద్ధి నిధులు రూ.2 కోట్ల నుంచి రూ.2.5 కోట్లకు చేరుతాయి. అయితే, ఈ పెంపుపై విపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ‘‘ఓవైపు ఆర్టీసీ కార్మికులు తమ వేతనాలు పెంచాలని వారం రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం ఎమ్మెల్యేల వేతనాల పెంపునకు సిద్ధం కావడం శోచనీయం. సర్కారు తీరును చూసి ప్రజలు నవ్వుకుంటారు’’ అని డీఎంకే నేత స్టాలిన్ పేర్కొన్నారు. తమ నెలవారీ జీతాలు పెంచాలనీ, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ తమిళనాడు ఆర్టీసీ కార్మికులు గత వారం రోజులుగా సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. పండుగ సమయంలో నిరవధిక సమ్మె చేపట్టడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2.57 రెట్లు జీతాలు పెంచాలంటూ కార్మికులు డిమాండ్ చేస్తుండగా... సీఎం ఎడప్పాడి మాత్రం 2.44 రెట్లు మాత్రమే పెంచుతామంటూ వెల్లడించారు. ఇందుకు కార్మిక సంఘాలు ససేమిరా అంటున్నాయి. వామపక్షాలు, డీఎంకే అనుబంధ సంఘాలు సహా మొత్తం 17 కార్మిక సంఘాలు ఈ సమ్మెలో పాల్గొంటున్నాయి

కొట్టుకున్న శ్రీలంక ఎంపీలు!

బాండ్ కమిషన్ నివేదికపై గందరగోళం

పార్లమెంట్‌లో విపక్ష, అధికార పక్ష సభ్యులు బాహాబాహీ

కొలంబో,జనవరి 10: శ్రీలంక పార్లమెంట్ చరిత్రలోనే తొలిసారిగా ఎంపీలు బాహాబాహికి దిగారు. ఒకరిపై ఒకరు ముష్టిఘాతాలు కురిపించుకున్నారు. దాంతో పలువురు ఎంపీలకు గాయాలయ్యాయి. కొందరు ఎంపీల షర్టులు చిరిగిపోయాయి. బుధవారం పార్లమెంట్‌లో ప్రధాని రాణిల్ విక్రమసింఘే బాండ్ కమిషన్ రిపోర్ట్‌ను చదువుతున్న సమయంలో కొందరు ప్రతిపక్ష ఎంపీలు వెల్‌లోకి దూసుకువచ్చారు. దీంతో సభలో గందరగోళం ఏర్పడింది అరపులు, నినాదాలతో హోత్తించారు. అదే సమయంలో ప్రభుత్వ, ప్రతిపక్ష ఎంపీల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. అయితే గొడవలో ఎంతమందికి గాయాలు అయ్యాయో స్పష్టంగా తెలియదు. కానీ కొందరు ఎంపీల షర్ట్‌లు చిరిగాయి. సెంట్రల్ బ్యాంక్ మాజీ గవర్నర్ అల్లుడు అవినీతికి పాల్పడ్డారని, దాంట్లో సుమారు 72 మిలియన్ల డాలర్ల మేరకు అవినీతి జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ ఆరోపణలపై నియమించిన బాండ్ కమిషన్ రిపోర్ట్‌ను సభలో ప్రవేశపెట్టారు. ‘‘సభలో ఇలాంటి దృశ్యాన్ని నేనెప్పుడూ చూడలేదు. కొందరైతే ఏదో ఒక వస్తువును ప్రధానిపైకి విసిరేయడం కనిపించింది. ఇది చాలా బాధాకరం’’ అని శ్రీలంక సహాయం మంత్రి హర్ష డిసిల్వా ట్విట్టర్‌లో పేర్కొన్నారు.



పి.కె ప్లాన్ బి...ఓకే

కొన్ని కాంబినేషన్లు బాక్సాఫీస్ వద్ద మ్యాజిక్ చేస్తాయి. అలాంటి కాంబినేషనే పవన్ కల్యాణ్, డైరెక్టర్ త్రివిక్రమ్‌లది. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'జల్సా', 'అత్తారింటికి దారేది' సంచలనాలు సృష్టించాయి. 'జల్సా' తర్వాత ఐదేళ్ళకు 'అత్తారింటికి దారేది' విడుదలైంది. 'అత్తారింటికి దారేది' విడుదలైన ఐదేళ్ళకు ఇప్పుడు 'అజ్ఞాతవాసి' ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అంతేకాకుండా ఇది పవన్ కల్యాణ్ 25వ చిత్రం కావడం విశేషం. ఎన్నో విశేషాలతో పాటు భారీ అంచనాల మధ్య వచ్చిన ఈ సినిమాపై 'మనం' అందిస్తున్న సమీక్ష మీ కోసం:

బ్యానర్ : హారిక అండ్ హాసిని క్రియేషన్స్
నటీనటులు: పవన్ కల్యాణ్, కీర్తి సురేష్, అను ఇమాన్యుయేల్, బొమన్ ఇరాని, ఖుష్బూ, ఆది పినిశెట్టి, జయ ప్రకాష్, రావు రమేష్, మురళీ శర్మ, తనికెళ్ళ భరణి, శ్రీనివాసరెడ్డి, వెన్నెల కిషోర్, పరాగ్ త్యాగి, పవిత్రా లోకేష్, రఘుబాబు, ఇంద్రజ తదితరులు
ఛాయాగ్రహణం: వి. మణికందన్
కూర్పు: కోటగిరి వెంకటేశ్వరరావు
సంగీతం: అనిరుధ్
నిర్మాత: ఎస్.రాధాకృష్ణ
రచన, దర్శకత్వం: త్రివిక్రమ్ శ్రీనివాస్

కథ:

ఏబీ గ్రూప్ అధినేత గోవింద భార్గవ్(బొమన్ ఇరాని). అతని భార్య ఇంద్రాణి (ఖుష్బూ), కొడుకు మోహన్ భార్గవ్. కొందరు గోవింద భార్గవ్, మోహన్‌ని ప్లాన్ ప్రకారం చంపేస్తారు. విందా కాల్‌లో రికార్డ్ చేసిన వాయిస్ ప్రకారం.. వీరి చావుకి కారణం అతని బోర్డు మెంబర్స్ వర్మ (రావు రమేష్), శర్మ (మురళీ శర్మ) అని అర్థమవుతుంది. అయితే.. అసలు ఎందుకు చంపి ఉంటారు అనేది మిస్టరీగా ఉండిపోతుంది. ఇది తెలుసుకోవడం కోసం ఆమె అస్సాం నుంచి ఒక యువకుడిని పిలిపిస్తుంది. అతనే బాలసుబ్రమణ్యం (పవన్ కల్యాణ్). అసలు విషయాలు రాబట్టడం కోసం.. ఏబీ గ్రూప్ ఆఫీస్‌లో పర్సనల్ అసిస్టెంట్‌గా జాయిన్ అవుతాడు బాలు. అక్కడ శర్మ (మురళీ శర్మ), వర్మ (రావు రమేష్) ఫోన్ డేటా ద్వారా ఈ హత్య గురించి తెలుసుకోవాలనుకుంటాడు బాలు. ఈ ప్రాసెస్‌లో వాళ్లకు దగ్గరవడం కోసం శర్మ దగ్గర అసిస్టెంట్‌గా పని చేస్తున్న సూర్యకాంతం (అను ఇమ్మాన్యుయేల్)కి, అలాగే వర్మ కూతురు సుకుమారి (కీర్తి సురేష్)కి కూడా దగ్గరౌతాడు బాలు. అయితే తర్వాత బాలుకి..ఈ హత్యలతో శర్మ, వర్మలకు ఎటువంటి సంబంధం లేదని తెలుస్తుంది. మరి ఆ హత్యలు చేసింది ఎవరు? ఎందుకోసం చేశారు? ఆ హత్యల తదనంతరం ఈ కంపెనీలో ఎటువంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి? హత్యలు జరిగిన వెంటనే బాలునే ఎందుకు ఇంద్రాణి పిలిపించింది? మరి బాలు ఆ హత్య ఉదంతాన్ని ఛేదించాడా? ఇంతకీ హంతకుడు ఎవరు? సీతారామ్ (ఆది పినిశెట్టి) ఎవరు? అభిషిక్త్ భార్గవ్‌కి, బాలుకి సంబంధం ఏమిటి? ఎ.బి.గ్రూప్‌లోని ఎ.బి. ఎవరు? ఇలాంటి ప్రశ్నలకు సమాధానం తెలుసుకోవాలంటే సినిమా చూడాల్సిందే.


విశ్లేషణ:

పగ, ప్రతీకారం నేపథ్యంలో తెలిసిన కథనే మళ్ళీ తెరపై చూపించారు..త్రివిక్రమ్. కాకపోతే తన మార్కు, కామెడీతో, మాటలతో సినిమాని సాధ్యమైనంత వరకు బోర్ కొట్టకుండా నడిపించేశారు. 'అత్తారింటికి దారేది'లో మేనత్త, మేనల్లుడు బంధాని చక్కగా చూపించిన త్రివిక్రమ్.. ఈ సినిమాలో సవతి తల్లి, సవతి కొడుకు మధ్య బంధం బాగా చూపించారు. ప్లాన్ బి అనే కాన్సెప్ట్‌ని తన స్క్రీన్ ప్లేలో చక్కగా ఉపయోగించుకున్నారు. శర్మ, వర్మ కామెడీ ట్రాక్ బాగా డిజైన్ చేసుకున్నారు. అయితే సినిమాని ఆద్యంతం ఆసక్తికరంగా తెరకెక్కించడంలో తన మ్యాజిక్‌ని రిపీట్ చేయలేకపోయారు. నటీనటుల విషయానికి వస్తే.. పవర్ స్టార్ పవన్ కల్యాణ్ వన్ మాన్ షో చేసి సినిమా మొత్తాన్ని తన భుజాలపై మోశారు. అస్సాంలో ఇచ్చే ఎంట్రీ సీన్ నుంచి చివరి సీన్ వరకు అడుగడుగున అభిమానులను అలరించే ప్రయత్నం చేశారు. రొమాంటిక్ సీన్స్, ఆఫీస్ సీన్స్‌లో అమాయకంగా కనిపిస్తూ ఇచ్చే హావభావాలు అభిమానులకు బాగా నచ్చుతాయి. తను పాడిన 'కొడకా కోటేశ్వర్రావా' పాటలో బాగా యాక్టివ్‌గా కనిపించారు. అలాగే సీరియస్ సీన్స్‌లో పవన్ పలికే సంభాషణలు చాలా బాగున్నాయి. ఇక తన కామెడీ టైమింగ్‌తో సినిమాని మరో స్థాయికి తీసుకునివెళ్ళారు పవన్. ఇక హీరోయిన్స్ కీర్తి సురేష్, అను ఇమ్మాన్యుయేల్ గ్లామర్ షో, కామెడీకి పరిమితమయ్యారు. ఆది మరోసారి స్టైలిష్ విలన్‌గా తన విలనిజంతో ఆకట్టుకున్నాడు. సవతి తల్లి అయినా... కన్న కొడుకు కంటే ఎక్కువగా సవతి కొడుకు అభిని చూసుకునే పాత్రలో ఖుష్బూ నటన బాగుంది. ప్రతి ఫ్రేమ్‌లోనూ హుందాగా కనిపించింది. ఇక వీలునామాలో తన వాటాను కూడా అభికే ఇచ్చేయమని భర్తకు చెప్పే సన్నివేశంలో ఆమె నటన చాలా బాగుంది. ఇక మురళీ శర్మ, రావు రమేష్‌లతో పవన్ సీన్స్ బాగా వర్కవుట్ అయ్యాయి. మిగిలిన నటుల్లో బొమన్ ఇరానీ, తనికెళ్ల భరణి, వెన్నెల కిషోర్, పవిత్రా లోకేష్ పాత్రల పరిధి మేరకు బాగానే నటించారు. సాంకేతిక నిపుణుల విషయానికి వస్తే.. అనిరుధ్ అందించిన సంగీతం బాగుంది. పాటలు వినసొంపుగా ఉన్నాయి. అలాగే వాటి చిత్రీకరణ లావిష్‌గా ఉంది. ముఖ్యంగా అనిరుధ్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అయితే సినిమాని మరో స్థాయికి తీసుకుని వెళ్ళింది. పోరాట సన్నివేశాల్లో.. కొత్త తరహాలో ఆర్.ఆర్. ఇచ్చాడు. మణికందన్ ఛాయాగ్రహణం అద్భుతంగా ఉంది. ప్రతి ఫ్రేమ్‌ని చాలా రిచ్‌గా ప్రెజెంట్ చేశారు. కోటగిరి ఎడిటింగ్ మరింత క్రిస్పీగా ఉండాల్సింది. ఇక మాటల విషయా నికి వస్తే త్రివిక్రమ్ కలం.. మాటలు రాయడానికి తన పదునంతా చూపించింది. ''కుందేళ్ళు కులాసాగా తిరుగుతున్నాయ్...సింహం సరదాగా రావొచ్చు''. ''రాజ్యం మీద ఆశలేని వాడికంటే గొప్ప రాజు ఎక్కడ దొరుకుతాడు''తో పాటు ట్రైలర్‌లో చూపించిన కుర్చీ డైలాగ్ అర్థవంతంగా ఉన్నాయి. నిర్మాణ విలువలకు ఎక్కడా వంక పెట్టలేం.

చివరగా.. పి.కె ప్లాన్ బి...ఓకే.

రేటింగ్ : 2.75/5

మరో దక్షిణాది చిత్రంలో...


• అమితాబ్ బచ్చన్

బాలీవుడ్ సూపర్‌స్టార్ బిగ్ బి అమితాబ్ బచ్చన్ ప్రస్తుతం దక్షిణాది సినిమాల్లో నటించడానికి ఆసక్తిని చూపుతున్నారు. అసలు విషయానికి వస్తే చిరంజీవితో 'సైరా నరసింహారెడ్డి' చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో చిరంజీవి గురువు పాత్రలో అమితాబ్ కనపడనున్నారు. ఈ సినిమా కాకుండా ఓ తమిళ చిత్రంలో కూడా అమితాబ్ కనపడబోతున్నారని ఇండ్రస్టీ టాక్. సూర్య హీరోగా కె.వి.ఆనంద్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించనుంది. ఇందులో ఓ కీలక పాత్రలో అమితాబ్‌ను నటింపచేసేందుకు ముమ్మర ప్రయత్నాలే జరుగుతున్నాయని కోలీవుడ్ వర్గాల సమాచారం. ఈ సినిమా ఏప్రిల్‌లో స్టార్ట్ అవుతుంది. ఈలోపు సూర్య సెల్వ రాఘవన్ సినిమాను పూర్తి చేసేస్తాడు.

కేరళకు సైరా


• చిరంజీవి

చిరంజీవి టైటిల్ పాత్ర పోషిస్తున్న చిత్రం 'సైరా నరసింహారెడ్డి'. ఇటీవల ఈ సినిమా హైదరాబాద్‌లో ఓ షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. తదుపరి షెడ్యూల్‌కు సంబంధించిన ప్రణాళికలు జరుగుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్‌ను కేరళలో చిత్రీకరించబోతున్నారు. సురేందర్ రెడ్డి దర్శకత్వంలో రామ్‌చరణ్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. చిరు సరసన నయనతార నటిస్తుంది. స్వాతంత్ర్యం కోసం పోరాడిన తొలి యోధుడు, తెలుగు వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత చరిత్ర ఆధారంగా సినిమా రూపొందుతుంది. సినిమాను తెలుగు, తమిళం, హిందీ భాషల్లో తెరకెక్కిస్తున్నారు. రత్నవేలు సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు.

భయపెడుతున్న అనుష్క


• అనుష్క శర్మ

కమర్షియాలిటీని పక్కకుపెట్టి వైవిధ్య కథలను ఎంచుకోవడంలో బాలీవుడ్ బ్యూటీ అనుష్క శర్మ ముందు వరుసలో ఉంటారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అనుష్క 'పరి' అనే చిత్రంలో నటిస్తుంది. ఈ చిత్ర టీజర్‌ను అనుష్క తాజాగా విడుదల చేయగా.. అందులో ముఖం నిండా రక్తపుమరకలతో భయాన్ని తెప్పిస్తోంది అనుష్క. ఈ చిత్రానికి ప్రోసిత్ రాయ్ దర్శకత్వం వహిస్తుండగా, క్లీన్ స్లేట్ ఫిలింస్ బ్యానర్‌పై అనుష్క నిర్మిస్తుంది. లీ సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాను న్నారు. ఇదిలా ఉంటే టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీతో వివాహం తరువాత కొన్ని రోజులు రెస్ట్ తీసుకున్న అనుష్క.. ఈ ఆదివారం తిరిగి షూటింగ్‌లో జాయిన్ అయింది.



బి.జయ దర్శకత్వంలో 'లక్కీ ఫెలో'



చంటిగాడు, గుండమ్మగారి మనవడు, లవ్‌లీ, వైశాఖం వంటి చక్కని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్‌ని రూపొందించిన దర్శకురాలు జయ బి. పుట్టినరోజు జనవరి 11. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తన దర్శకత్వంలో రానున్న కొత్త సినిమా వివరాలను తెలిపారు. ''వైశాఖం' చిత్రం పూర్తిగా నాకు సంతృప్తిని కలిగించింది. ప్రేక్షకులు మా చిత్రాన్ని ఆదరించి పెద్ద హిట్ చేశారు. చాలామంది 'సినిమా చాలా బాగుంది.. మంచి సినిమా తీశారు' అని అప్రిషియేట్ చేశారు. నెక్స్ట్ మా ఆర్.జె. సినిమాస్ బేనర్‌లో 'లక్కీఫెలో' చిత్రాన్ని రూపొందిస్తున్నాం. జూన్‌లో సినిమా స్టార్ట్ చేసి మూడు నాలుగు నెలల్లో షూటింగ్ కంప్లీట్ చేస్తాం. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. ఓ యంగ్ హీరో ఈ చిత్రంలో నటిస్తున్నారు. ఆ హీరో ఎవరనేది త్వరలోనే ఎనౌన్స్ చేస్తాం. జనరల్‌గా కొంతమందికి అన్‌ఎక్స్‌పెక్టెడ్‌గా, విచిత్రంగా ఒక ఛాన్స్ వస్తుంది. అది రాగానే అందరూ వాడు 'లక్కీఫెలో'రా అని చెప్తారు. అతను ఆ ఛాన్స్ కోసం ట్రై చేయకపోయినా గొప్ప ఛాన్స్ వస్తుంది. అది చాలా రేర్‌గా జరుగుతుంది. అది హీరో క్యారెక్టరైజేషన్. ఆ ఛాన్స్‌ని హీరో ఎలా తీసుకుంటాడు? మిస్ యూజ్ చేసుకుంటాడా? ఇంకా హైట్స్‌కి వెళ్తాడా? అనేది కాన్సెప్ట్. హ్యూమన్ సైకాలజీని బేస్ చేసుకుని సబ్జెక్ట్ రెడీ చేస్తున్నాం'' అన్నారు.

ఎన్నారై పాత్రలో..


• రవితేజ

గతేడాది 'రాజా ది గ్రేట్' చిత్రంతో సక్సెస్‌ను తన ఖాతాలో వేసుకున్నారు రవితేజ. ప్రస్తుతం కల్యాణ్ కృష్ణ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా తర్వాత శ్రీనువైట్ల దర్శకత్వంలో రవితేజ సినిమా చేయబోతున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం శ్రీనువైట్ల దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రంలో రవితేజ ఎన్నారై యువకుడిగా కనిపిస్తారట. కుటుంబ కథా చిత్రంగా తెరకెక్కనున్న ఈ సినిమాలో 90 శాతాన్ని యు.ఎస్‌లో చిత్రీకరిస్తారు. ఈ స్క్రిప్ట్‌కు తుది మెరుగులు దిద్దుతున్నారు దర్శకుడు శ్రీనువైట్ల. గతంలో రవితేజ, శ్రీనువైట్ల కాంబినేషన్‌లో 'నీకోసం', 'వెంకీ', 'దుబాయ్ శీను' చిత్రాలు ప్రేక్షకులను మెప్పించాయి.

తొలి ఇండియన్ స్పేస్ మూవీ 'టిక్ టిక్ టిక్'


• జయం రవి, నివేదా

జయం రవి, నివేదా పేతురాజ్ హీరో హీరోయిన్లుగా చదలవాడ బ్రదర్స్ సమర్పణలో శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర ఫిలిమ్స్ బ్యానర్‌పై శక్తి సౌందర్ రాజన్ దర్శకత్వంలో పద్మావతి చదలవాడ నిర్మాతగా వస్తోన్న చిత్రం 'టిక్ టిక్ టిక్'. ఇండియన్ సినిమా చరిత్రలో తొలి అంతరిక్ష సినిమాగా ఈ సినిమా తెరకెక్కడం విశేషం. ఈ సినిమా టీజర్‌ను యంగ్ హీరో అడివిశేష్ విడుదల చేశారు. సినిమా త్వరలోనే తెలుగు, తమిళంలో గ్రాండ్ లెవల్లో రిలీజ్ అవుతుంది. ఈ టీజర్‌కి ట్రెమెండస్ రెస్పాన్స్ వస్తుంది. ఈ సందర్భంగా హీరో అడివిశేష్ మాట్లాడుతూ ''ఇండియన్ సినిమాలో తొలి స్పేస్ మూవీ ఇది. నాకు ఇష్టమైన హీరో జయం రవిగారు ఈ సినిమాలో హీరోగా నటించారు. లక్ష్మణ్ తెలుగులో ఈ సినిమాను విడుదల చేస్తున్నారు. టీజర్ చూస్తుంటే హాలీవుడ్ మూవీ 'గ్రావిటీ' గుర్తొస్తోంది'' అన్నారు. లక్ష్మణ్ మాట్లాడుతూ ''మా బ్యానర్‌లో విడుదలైన 'బిచ్చగాడు' సినిమాను అందరూ ఆదరించారు. తర్వాత '16%' సినిమాను కూడా ప్రేక్షకులు ఆదరించారు. ఇప్పుడు మరో విభిన్నమైన చిత్రం 'టిక్ టిక్ టిక్' ద్వారా ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం. ఈ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతినిస్తుంది'' అన్నారు.

హీరో ఎవరు?


• తాప్సీ

హాకీ ప్లేయర్ సందీప్ సింగ్ జీవిత కథ ఆధారంగా రూపొందుతున్న 'సూర్మ' చిత్రంలో హాకీ ప్లేయర్ హర్‌ప్రీత్ పాత్రలో తాప్సీ నటిస్తున్న విషయం తెలిసిందే. సందీప్ పాత్రలో దిల్జీత్ నటిస్తున్నారు. షాద్ అలీ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. సెర్బియా గ్రౌండ్‌లో హాకీ ప్లేయర్‌గా అద్భుతమైన పెర్ఫార్మెన్స్ ఇచ్చిన తాప్సీ గోవాలో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. ఈ వేడుకలతో రిలాక్స్ అయిన తాప్సీ ఇప్పుడు హుషారుగా మళ్ళీ షూటింగ్‌లో పాల్గొనడానికి రెడీ అయ్యారు. బుధవారం నుంచి హైదరాబాద్‌లో జరుగుతున్న తెలుగు సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఆది పినిశెట్టి, తాప్సీ, రితికాసింగ్ ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి హరి దర్శకత్వం వహిస్తున్నారు. రచయిత కోన వెంకట్ ఈ చిత్రానికి నిర్మాత. ఈ చిత్రంలో హీరో ఎవరు అని అడిగిన ప్రశ్నకు కథే ఈ సినిమాకు హీరో అని సమాధానమిచ్చారు. కథే ప్రధానంగా రూపొందుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతినిస్తుందని ఆమె తెలిపారు.






విజయవాడలోని శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో బుధవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. గ్రామీణ వాతావరణం ప్రతిబింబించేలా విద్యార్థినులు కళాశాలను మామిడి తోరణాలు, పుష్పాలు, రంగవల్లులు, గొబ్బెమ్మలతో అలంకరించారు. కోలాటం, ఆటపాటలతో విద్యార్థినులు ఉత్సాహపరిచారు.

జగన్ @ 800

కి.మీ. మైలురాయి దాటిన పాదయాత్ర

చిత్తూరు జిల్లాలో కొనసాగుతున్న యాత్ర.. కడప, అనంతపురం, కర్నూలులో పూర్తి



చిత్తూరు, జనవరి 10: వైసీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర 800 కిలోమీటర్లు పూర్తి చేసుకుంది. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోని నల్లవెంగణపల్లి వద్ద ఈ మైలురాయిని దాటింది. ఈ సందర్భంగా గ్రామంలో వైఎస్ జగన్ మొక్కను నాటారు. నిరుడు నవంబరు 6వ తేదీన కడప జిల్లా ఇడుపులపాయ నుంచి ప్రజా సంకల్ప యాత్రను జగన్ ప్రారంభించిన విషయం తెలిసిందే. పాదయాత్రలో ప్రతి వంద కిలో మీటర్లకు ఒక మొక్కను నాటుతూ ఆయన ముందుకు సాగుతున్నారు. నవంబరు 14న కర్నూలు జిల్లాలోకి పాదయాత్ర ప్రవేశం చింది. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 100 కి.మీ., డోన్ నియోజకవర్గంలో 200 కి. మీ., ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 300 కిలోమీటర్ల మైలు రాయిని దాటారు. అనంతపురం జిల్లా గుమ్మేపల్లిలో 400 కి.మీ., ధర్మవరం మండలం ఉట్లూరు గ్రామంలో 500 కిలోమీటర్లు పూర్తి చేశారు. అనంతపురం జిల్లా ఉట్లూరు వద్ద 600 కిలోమీటర్లు దాటారు. చిత్తూరు జిల్లా జమ్మివారి పల్లె వద్ద 700 కిలోమీటర్ల మైలురాయిని జగన్ చేరుకున్నారు. దారిపొడవునా ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ ముందుకు సాగుతున్నారు.

చెరుకు రైతులను ఆదుకుంటాం



తాము అధికారంలోకి వచ్చాక చెరుకు, బెల్లం తయారీ రైతులను ఆదుకుంటామని జగన్ హామీ ఇచ్చారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా 58వ రోజు బుధవారం చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఆయన పాదయాత్ర చేశారు. గుండుపల్లిలో బెల్లం తయారీ రైతులతో జగన్ మాట్లాడారు. పెట్టుబడి, మద్దతుధర గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. బెల్లానికి గిట్టుబాటు ధర లేకుండాపోతోందని, చెరుకు అమ్ముకుందామన్నా షుగర్ ఫ్యాక్టరీలు మూతపడ్డాయని, ఎగుమతిపై కూడా ఆంక్షలు ఉన్నాయని రైతులు వివరించారు. రైతుల సమస్యలను విన్న జగన్.. మనందరి ప్రభుత్వం వచ్చాక చెరకు రైతులకు అన్నివిధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. 58వ రోజు పాదయాత్రను గుండుపల్లిలో ముగించారు. ఇప్పటివరకు మొత్తం 804.4 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు.



ఇస్రో చైర్మన్‌గా శివన్

హైదరాబాద్, జనవరి 10: భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) చైర్మన్‌గా ప్రముఖ శాస్త్రవేత్త శివన్.కే నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. శివన్ మూడేళ్ల పాటు ఈ పదవిలో ఉంటారు. ప్రస్తుతం తిరుమనంతపురంలోని విక్రమ్‌సరాభాయి స్పేస్ సెంటర్ డైరెక్టర్‌గా ఉన్న శివన్ మద్రాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఏరోనాటికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. బెంగళూరు ఐఐఎస్‌సీలో మాస్టర్స్ పూర్తి చేసిన ఆయన ముంబై ఐఐటీ నుంచి ఏరోనాటికల్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. 1982లో ఇస్రోలో చేరిన శివన్, పీఎస్ఎల్వీ ప్రాజెక్టులో కీలక పాత్ర పోషించారు.

యూపీఎస్సీ మెయిన్స్ ఫలితాలు విడుదల

హైదరాబాద్, జనవరి 10: గతేడాది అక్టోబర్‌లో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన యూపీఎస్సీ మెయిన్స్-2017 పరీక్ష ఫలితాలు బుధవారం వెలువడ్డాయి. ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల వివరాలను యూపీఎస్సీ తన అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచింది. ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, ఐఎఫ్ఎస్, ఇతర కేంద్ర శాఖలో ఉద్యోగాలకు సంబంధించి నిర్వహించిన ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఫిబ్రవరి 19వ తేదీ నుంచి ఇంటర్వ్యూలు జరుగుతాయి.



తిరుమలకు ఉప రాష్ట్రపతి

తిరుమల, జనవరి 10 (మనం న్యూస్) : భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు బుధవారం సాయంత్రం తిరుమలకు చేరుకున్నారు. వెంకటేశ్వరుని దర్శనం కోసం కుటుంబ సమేతంగా తిరుమలకు వచ్చిన ఉపరాష్ట్రపతికి పద్మావతి అతిథి భవనం వద్ద టీటీడీ కార్యనిర్వహణాదికారి అనిల్‌కుమార్ సింఘాల్, తిరుమల జెఈవో శ్రీనివాసరాజు, ముఖ్యభద్రతాధికారి రవికృష్ణ ఘన స్వాగతం పలికారు. ఉప రాష్ట్రపతి బుధవారం రాత్రి తిరుమలలో ఉండి, గురువారం ఉదయం క్షేత్రపాలకుడైన భూవరాహస్వామిని దర్శించుకుని అనంతరం స్వామివారిని దర్శించుకోనున్నారు. శ్రీవారి దర్శనానంతరం నెల్లూరు వెళతారు. అంతకముందు రాష్ట్ర భారీ పరిశ్రమల మంత్రి ఎన్. అమరనాథ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న తదితరులు రేణిగుంట విమానాశ్రయంలో ఉప రాష్ట్రపతికి స్వాగతం పలికారు.

ఏపీకి ప్రత్యేక గవర్నర్

- **నియమించాలి: విష్ణుకుమార్ రాజు**

విశాఖపట్నం, జనవరి 10 (మనం న్యూస్): ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక గవర్నర్‌ను నియమించాలని బీజేపీ డిమాండ్ చేసింది. పార్టీలకు అతీతంగా రాష్ట్రానికి చెందిన ఎంపీలంతా గవర్నర్ నియామకం కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని, తాము కూడా పార్టీ అధిష్టానాన్ని కోరుతామని బీజేపీ శాసనసభా పక్షనేత విష్ణుకుమార్ రాజు అన్నారు. ప్రస్తుత ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ ఏనాడైనా కుటుంబ పెద్దలా వ్యవహరించారా అని ప్రశ్నించారు. ఆంధ్రాలో వారం రోజులైనా ఉన్నారా అని వ్యాఖ్యానించారు. గవర్నర్ నాలా బిల్లును ఆరు నెలలుగా పెండింగ్‌లో పెట్టారని, గవర్నర్ కార్యాలయం సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదని విష్ణుకుమార్ రాజు విమర్శించారు.

పోలీసు స్టేషన్ ఎదుటే

ఒంటికి నిప్పు!

- **భార్య హంతకుడి ఆత్మహత్యాయత్నం**
- **క్రికెట్ బ్యాట్‌తో మోది భార్య హత్య**
- **బెయిల్‌పై ఇటీవలే విడుదలైన మహాలక్ష్మి**
- **తీవ్రంగా కాలిన గాయాలతో ఆస్పత్రి పాలు**

విశాఖపట్నం, జనవరి 10 (మనం ప్రతినిధి): కట్టుకున్న భార్యను క్రికెట్ బ్యాట్‌తో కొట్టి చంపిన ఓ వ్యక్తి.. బెయిల్‌పై బయటకు వచ్చి, పోలీసు స్టేషన్ ఎదుటే పట్టపగలు కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఈ ఘటన విశాఖపట్నంలో సంచలనం సృష్టించింది. విశాఖ జిల్లా పెందుర్తి ప్రాంతానికి చెందిన సెక్యూరిటీ గార్డు మునస మహాలక్ష్మి పెందుర్తి పోలీసు స్టేషన్ ఎదుట బుధవారం ఉదయం ఆత్మహత్యాయత్నం చేశాడు. తీవ్ర గాయాలతో ఆయన కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. భార్య రాజేశ్వరి, ఇద్దరు పిల్లలతో కలిసి పెందుర్తిలో నివాసం ఉండే మహాలక్ష్మి.. గత ఏడాది అక్టోబరు నెలలో భార్యతో గొడవపడి క్రికెట్ బ్యాట్‌తో బలంగా కొట్టడంతో ఆమె మరణించారు. ఈ కేసులో మహాలక్ష్మిని పెందుర్తి పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చగా 80 రోజుల పాటు జైలులో ఉన్నాడు. ఇటీవలే బెయిల్‌పై విడుదలయ్యాడు. వచ్చిన తర్వాత ఆస్తిలో వాటా ఇవ్వాలంటూ తండ్రిపైన, పిల్లలపైన ఒత్తిడిచేశాడు. ఆస్తి కోసం తమను కొట్టిగాయపర్చాడంటూ పిల్లలు నాలుగు రోజుల క్రితం పెందుర్తి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. దాంతో పోలీసులు విచారణకు పిలవడంతో బుధవారం పోలీసుస్టేషన్ ఎదుటే కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. స్టేషన్ ఎదురుగా కూడలి ప్రాంతంలోనిలబడి వాటిర్ బాటిల్లో పెట్రోలు తెచ్చుకుని.. దాన్ని తన మీద పోసుకుని అగ్గిపుల్ల గీసుకుని నిప్పంటించుకున్నాడు. అయితే మంటల వేడి తాళలేక అక్కడినుంచి పక్కకు పరుగులు పెట్టాడు. సరిగ్గా అదే సమయానికి బైకు మీద ఇద్దరు వ్యక్తులు వెళ్తూ.. ఈ ఘటన చూసి హడలిపోయి అక్కడే బైకు పారేశారు. మళ్లీ తమ వాహనానికి ఎక్కడ మంటలు అంటుకుంటాయోనని దాన్ని పక్కకు లాగారు. అలాగే, ఆ సమయంలో అటువైపుగా జీవీఎంసీ వాటర్ ట్యాంకర్ వెళ్తోంది. నిజానికి ట్యాంకర్ డ్రైవర్‌కు గానీ, అక్కడున్న ఇతరులకు గానీ ఏమాత్రం సమయస్ఫూర్తి ఉన్నా.. ట్యాంకర్‌లో నీళ్లతో వెంటనే మంటలు ఆర్పడానికి ప్రయత్నం చేసేవారు. ఆ ప్రయత్నం జరగకపోగా.. ట్యాంకర్ డ్రైవర్ కొద్ది ముందుకు తీసుకెళ్లి యూటర్న్ తీసుకుని రోడ్డుకు ఇవతలివైపు వచ్చేశాడు. ఈలోపు అక్కడ ఉన్న స్థానికులు ఎలాగోలా మంటలు ఆర్పి.. 108కు ఫోన్ చేయడంతో అతడిని కేజీహెచ్‌లో చేర్చారు. పెందుర్తి సీఐ జె. మురళి దర్యాప్తు చేస్తున్నారు.



హామీలు 100% అమలు

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

- **అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పూర్తి స్థాయిలో అమలు చేశాం**
- **జన్మభూమికి ప్రజలు స్వాగతం**
- **మంత్రులు, ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండాలి: సీఎం**



కాకినాడ, జనవరి 10 (మనం న్యూస్ బ్యూరో): గత ఎన్నికలలో ఇచ్చిన హామీలను వందశాతం అమలు చేశామని, ప్రజలకు అభివృ ద్ధి, సంక్షేమ పథకాలు అందాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అర్హులైన పేదలకు రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, గృహాలు, పింఛన్లు, అన్ని రకాల పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పూర్తి స్థాయిలో అమలు చేయడం వల్ల జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో ప్రజలు మంత్రులకు, ప్రజాప్రతినిధులకు స్వాగతం పలుకుతున్నారని చెప్పారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో జన్మభూమి కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 5వ విడత జన్మభూమి కార్యక్రమంలో అన్ని గ్రామాలలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి, ప్రభుత్వం చేపట్టిన పనులు ప్రజలకు వివరిస్తున్నారని అన్నారు. ఆయా గ్రామసభలలో ప్రజలు, ప్రజాప్రతినిధులు కలసి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించుకుని కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, మంచి ప్రవర్తనతో ప్రజలకు సేవలు అందించాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజలకు మరిన్ని పథకాలు అందేలా కృషి చేయాలన్నారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు నిర్దిష్టమైన ప్రణాళికలు రూపొందించుకుని, వాటి అమలు కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర విభజన తరువాత అనేక సమస్యలు ఎదురైనా, సమర్థంగా ఎదుర్కొని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని చంద్రబాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, మంత్రులు యనమల రామకృష్ణుడు, కిమిడి కళా వెంకట్రావు, ఎంపీ తోట నరసింహం, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నాబార్డు ద్వారా ప్యాకేజీ నిధులు ఇవ్వండి

- **కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీకి చంద్రబాబు లేఖ**

అమరావతి, జనవరి 10: కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీలోని ఆర్థిక సాయాన్ని విదేశీ ఆర్థిక సంస్థల నుంచి కాకుండా నాబార్డు గ్రాంటుల రూపంలో ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కోరారు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీకి బుధవారం ఆయన ఓ లేఖ రాశారు. ప్రత్యేక ప్యాకేజీ ప్రకటన ప్రకారం కేంద్ర ప్రాయోజిత పథకాల కింద 2015 నుంచి 2020 వరకూ ఏపీకి రూ.16,447 కోట్ల రావాల్సి ఉంది. అయితే నిబంధనల ప్రకారం ఈ నిధులు ఈఏపీ ప్రాజెక్టుల కోసం వినియోగించడం వీలు కాదని, నాబార్డు ద్వారా ఇస్తే రాష్ట్రానికి మేలు జరుగుతుందని ముఖ్యమంత్రి లేఖలో పేర్కొన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాల కింద ఇచ్చే సాయాన్ని 90:10 నిష్పత్తిలో ఇస్తే ఎంతయితే తేడా వస్తుందో ఆ మొత్తాన్ని విదేశీ ఆర్థిక సంస్థ నుంచి చేపట్టే ప్రాజెక్టులకు 2015-2020 మధ్యకాలంలో అందిస్తామనే ప్రకటనను తన లేఖలో సీఎం ప్రస్తావించారు. కేంద్ర ప్రాయోజిత పథకాల వాటాను 90:10 నిష్పత్తిలో ఇచ్చినట్లయితే ఆంధ్రప్రదేశ్‌కు 2015-16 సంవత్సరానికి రూ. 2,951 కోట్లు అధికంగా నిధులు రావాల్సి ఉంది. కానీ కేంద్రం ఆ మొత్తాన్ని 2,516కోట్ల రూపాయలుగా అంచనా వేసింది. అదే సూత్రం ప్రకారం 2016-17 ఆర్థిక సంవత్సరానికి రూ. 2,854 కోట్లు, 2017-18కి రూ.3,238 కోట్లు, 2018-19కి రూ.3,673 కోట్లు, 2019-20కి రూ.4,166 కోట్ల రూపాయలు రావాల్సి ఉంది. కేంద్రం వేసిన తాత్కాలిక లెక్కల ప్రకారం ఐదేళ్ల కాలానికి రూ.16,447 కోట్లు ఈ పద్దు కింద ఇవ్వాల్సి ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాల తరహాలోనే విదేశీ ఆర్థిక ప్రాజెక్టుల్లో ఏపీకి 90:10 నిష్పత్తిలో ప్రత్యేక ఆర్థిక సాయం చేయాలి. నిబంధనల వల్ల ఈఏపీ కింద చేపట్టే ప్రాజెక్టులు మొదలు కావడానికి, పూర్తికావడానికి చాలా సమయం పడుతుంది. అందువల్ల ఆర్థికసాయాన్ని విదేశీ ఆర్థిక సంస్థకు బదులుగా నాబార్డు నుంచి ఇప్పించాలని ఆయన విజ్ఞప్తిచేశారు. నాబార్డు ద్వారా ఏయే ప్రాజెక్టుకు నిధులు కావాలో ఆ జాబితాను కూడా అరుణ్‌జైట్లీ దృష్టికి తీసుకెళ్లారు. ఆ మొత్తాన్ని గ్రాంటు రూపంలో ఇవ్వాలని కోరారు. దీనివల్ల అది ఎఫ్‌ఆర్బీఎం పరిధిలోకి రాదని, తద్వారా రాష్ట్ర ప్రభుత్వం త్వరగా ప్రాజెక్టు పనులు మొదలుపెట్టడానికి వీలుంటుందని సీఎం లేఖలో పేర్కొన్నారు.

లెక్కలు తెలియకుండానే పీఏసీ చైర్మనా?

- **బుగ్గన రాజేంద్రనాథ్‌పై లంకా దినకర్ ఫైర్**

అమరావతి, జనవరి 10(మనం ప్రతినిధి): రాష్ట్రవిభజన తర్వాత రూ. లక్షా 56వేల కోట్ల అప్పులతో, ఆంధ్రప్రదేశ్ ప్రస్థానం ప్రారంభమయ్యిందని టీడీపీ అధికార ప్రతినిధి లంకా దినకర్ గుర్తు చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రం ఆదాయం, అప్పులు గురించి తెలియకుండానే బుగ్గన రాజేంద్రనాథ్ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ అయ్యారని మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేకే తప్పుడు లెక్కలతో వైసీపీ నేతలు ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. 2004 కంటే ముందు రాష్ట్రంలో ఉన్న అప్పు మొత్తాన్ని రాజశేఖర్‌రెడ్డి సీఎం అయ్యాక రెట్టింపు చేశారని దినకర్ ఆరోపించారు.

ఆటవిడుపు కార్యక్రమాలతో ఉత్తేజం

- **ఉద్యోగులకు ఆటల పోటీలు: అనూరాధ**
- **సచివాలయంలో సంక్రాంతి సంబరాలు**

అమరావతి, జనవరి 10: నిత్యం ఒత్తిడితో విధులు నిర్వహించే సచివాలయ ఉద్యోగులకు.. సంక్రాంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఆటవిడుపు కార్యక్రమాలు ఎంతో ఉత్తేజాన్ని కలిగిస్తాయని హోం శాఖ కార్యదర్శి అనురాధ అన్నారు. బుధవారం సచివాలయం ఆవరణలో మహిళా ఉద్యోగులకు ముగ్గుల పోటీలు, పురుషులకు కబడ్డీ పోటీలను నిర్వహించారు. అనురాధతో పాటు సీనియర్ అధికారులు ఎల్వీ సుబ్రహ్మణ్యం, కె.సునీత ముగ్గులను తిలకించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు బహుమతులు, పోటీల్లో పాల్గొన్నవారందరికీ కన్సులేషన్ బహుమతులు అందజేయనున్నారు.



సెన్సెక్స్ జనవరి 2018 10

34,433.07 ▼ -10.12



పెరిగినవి	%	తగ్గినవి	%
టీసీఎస్	3.64	డాక్టర్ రెడ్డీస్	-1.52
విప్రో	2.66	ఎన్‌టీపీసీ	-1.25
కోల్ ఇండియా	1.33	ఏషియన్ పెయింట్స్	-1.22
అదానీ పోర్ట్స్	1.05	బజాజ్ ఆటో	-1.10
ఇన్ఫోసిస్	0.99	ఎస్‌బీఐ	-1.05

నిఫ్టీ జనవరి 2018 10

10632.20 ▼ -4.80



పెరిగినవి	%	తగ్గినవి	%
టీసీఎస్	3.60	ఐషర్	-1.75
విప్రో	2.99	ఎన్‌టీపీసీ	-1.56
హెచ్‌సీఎల్ టెక్	2.46	యుపీఎల్	-1.49
హెచ్‌పీసీఎల్	1.75	ఏషియన్ పెయింట్స్	-1.31
టెక్ మహీంద్రా	1.55	డాక్టర్ రెడ్డీస్	-1.30

టాప్ లూజర్స్ 10 జనవరి

34,433.07


పాయింట్లు		%
2421.00	డాక్టర్ రెడ్డీస్	-1.52%
173.95	ఎన్‌టీపీసీ	-1.25%
1177.40	ఏషియన్ పెయింట్స్	-1.22%
3205.35	బజాజ్ ఆటో	-1.10%
301.05	ఎస్‌బీఐ	-1.05%
432.50	టాటా మోటార్స్	-0.93%
1722.00	హెచ్‌డీఎఫ్‌సీ	-0.78%
506.35	భారతీ ఎయిర్‌టెల్	-0.72%
1323.85	లార్సెన్	-0.67%
199.45	పవర్ గ్రిడ్	-0.62%

బి.ఎస్.ఇ సెన్సెక్స్ -10.12

బులియన్| గత 7 రోజులు



రూపాయి వర్సెస్ డాలర్ 63.60 (+11p)



వృద్ధిలో రేసు గుర్రం భారత్

- భారత్ వృద్ధి రేటు 2018లో 7.3 శాతంగా ఉండగలదని ప్రపంచ బ్యాంక్ అంచనా.
- చైనా మందగిస్తుండగా భారత్ వేగం పుంజుకుంటోంది.



వాషింగ్టన్: ''ఆశావహమైన ప్రభుత్వం సమగ్ర సంస్కరణలు చేపడుతున్నందు వల్ల, ఇతర ప్రవర్ధమాన ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే, భారతదేశానికి ''అపారమైన వృద్ధి సామర్థ్యం'' ఉందని ప్రపంచ బ్యాంకు నేడు పేర్కొంది. భారత్ వృద్ధి రేటు 2018లో 7.3 శాతంగా ఉంటుందని, తదుపరి రెండేళ్ళలో అది 7.5 శాతంగా ఉండగలదని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. పెద్ద నోట్ల రద్దు, వస్తువులు, సేవల పన్ను (జి.ఎస్.టి) వల్ల మొదట్లో కొన్ని లోటుపాట్లు ఉన్నప్పటికీ, భారత్ 2017లో 6.7 శాతం వృద్ధి సాధించగలదని ప్రపంచ బ్యాంక్ బుధవారంనాడు ఇక్కడ విడుదల చేసిన ప్రపంచ ఆర్థిక నివేదిక అవకాశాలు నివేదిక వెల్లడించింది. ''వచ్చే దశాబ్దంలో ఇతర ప్రధాన ప్రవర్ధమాన మార్కెట్ ఆర్థికవ్యవస్థల కన్నా భారత్ హెచ్చు వృద్ధి రేటును నమోదు చేయగల అవకాశం ఎంతైనా ఉంది. కనుక, నేను స్వల్పకాలిక సంఖ్యలపై దృష్టిపెట్టను. భారత్‌కు సంబంధించి నేను మొత్తంమీద పరిస్థితిని చూస్తాను. అపారమైన వృద్ధికి అవకాశం ఉన్నట్లు అత్యంత ముఖ్యమైన వాస్తవాలు వెల్లడిస్తున్నాయి'' అని ప్రపంచ బ్యాంక్ అభివృద్ధి అవకాశాల గ్రూప్ డైరెక్టర్ ఐహాన్ కోస్ ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. మందగిస్తున్న చైనాతో పోలిస్తే, భారత్ క్రమంగా వేగం పుంజుకుంటోందని ప్రపంచ బ్యాంక్ భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ''గత మూడేళ్ళ వృద్ధి సంఖ్యలు చాలా ఆరోగ్యకరంగా ఉన్నాయి'' అని నివేదికను రూపొందించిన కోస్ తెలిపారు.

జనాభా వర్గాల రేఖా సూచన చిత్రం కూడా భారత్‌కు అనుకూలంగా ఉందన్న సంగతిని గుర్తుంచుకోవాలని, ఇతర ఆర్థిక వ్యవస్థలలో ఇది అరుదుగా కనిపిస్తుందని ఆయన అన్నారు. ''ఈ సందర్భంలో, మహిళా కార్మిక శక్తి భాగస్వామ్యాన్ని మెరుగుపరచడం ముఖ్యమైన అంశం కాబోతోంది. సాపేక్షంగా చూస్తే, ఇతర ప్రవర్ధమాన మార్కెట్ ఆర్థిక వ్యవస్థలకన్నా (భారత్‌లో) మహిళా కార్మిక శక్తి పాల్గొనడం తక్కువగానే ఉంది. ప్రస్తుతం ఉత్పాదకతకు వెలుపల ఖాళీగా ఉన్న శక్తిని బయటకు తీయడం వల్ల పరిస్థితిలో ఎంతో మార్పు వస్తుంది'' అని ఆయన చెప్పారు. యువతలో నిరుద్యోగాన్ని తగ్గించడం కీలకం. ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించాలి. కానీ, అక్కడ బ్యాంకు ఆస్తుల నాణ్యత వంటి సమస్యలు ఇప్పటికే ఉన్నాయి. ఈ పనులు కనుక చేయగలిగితే, భారత్

పెట్టుబడులు, నిరుద్యోగం

భారత్‌కన్నా 0.1 శాతం ఎక్కువగా చైనా 2017లో 6.8 శాతం వృద్ధి సాధించింది. దాని వృద్ధి రేటు 2018లో 6.4 శాతంగా ఉండగలదని అంచనా వేశారు. తదుపరి రెండేళ్ళలో చైనా వృద్ధి రేటు స్వల్పంగా తగ్గి, వరుసగా 6.3 శాతం, 6.2 శాతంగా ఉండగలదని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది.
తన ఉన్న సామర్థ్యం కార్యరూపం ధరిం చాలంటే, సామ భారత్ పెట్టుబడుల అవకాశాలను ర్థ్యాన్ని సుల పెంపొందించే చర్యలు తీసుకో భంగా వినియో వాల్సిన అవసరం గంలోకి తెచ్చుకోవడమే కాదు, దాన్ని మించిన పనితీరు ప్రదర్శించగలదని కోస్ స్పష్టం చేశారు.

ప్రోద్బలం అవసరం

''భారత్‌కు సమగ్ర సంస్కరణలు చేపడుతున్న ఆశావహమైన ప్రభుత్వం ఉంది. పన్నుల మధ్య సామరస్యంతో, ఒకే దేశం, ఒకే మార్కెట్, ఒకే పన్ను భావనతో తెచ్చిన ప్రధాన సంస్కరణ జి.ఎస్.టి. ప్రభుత్వం 2016 చివరలో తెచ్చిన పెద్ద నోట్ల రద్దు సంస్కరణ ఉండనే ఉంది. వీటి స్వల్పకాలిక పర్యవసానాల గురించి కూడా ప్రభుత్వానికి తెలుసు'' అని కోస్ చెప్పారు. తాత్కాలికంగా కొన్ని అవాంతరాలుండవచ్చని ఉందని కోస్ చెప్పారు. ''నిరర్థక రుణాలు, ఉత్పాదకత విషయంలో కొన్ని చర్యలు అమలులో ఉన్నాయి'' అని ఆయన అన్నారు. ''ఉత్పాదకత విషయానికి వస్తే, సెకండరీ విద్య పూర్తి చేసుకున్నవారి రేటును దృష్టిలో పెట్టుకున్నప్పుడు, భారత్‌కు అపారమైన వృద్ధి సామర్థ్యం ఉంది. మెరుగుపడిన కార్మిక మార్కెట్ సంస్కరణ లు, విద్య, ఆరోగ్య సంస్కరణలు, పెట్టుబడులకు ఉన్న ప్రతిబంధకాలను సడలింపజేయడం వంటివన్నీ కలిసి భారత్ అవకాశాలు మెరుగుపరచడం లో సహాయ కానీ, పడతాయి'' అని కోస్ ''మొత్తంమీద అన్నారు. చూసినప్పుడు'' భారతీయ ఆర్థిక వ్యవస్థ చక్కని పనితీరునే కనబరచిందని ఆయన చెప్పారు. ''భారతీయ ఆర్థిక వ్యవస్థకు చాలా ఆరోగ్యకరమైన స్థాయిలో 7 శాతం వృద్ధి రేటు కనబరచగల సామర్థ్యం ఉంది. రానున్న రోజుల్లో అది ఇంకా హెచ్చు రేటు సాధించగలదని భావిస్తున్నాను'' అని ఆ ప్రపంచ బ్యాంక్ అదికారి చెప్పారు. అవసరమైన సంస్కరణలు చేపడుతూనే, భారత్ వృద్ధి సామర్థ్యాన్ని కార్యరూపంలోకి తెచ్చుకోగలదా అన్నదే పెద్ద ప్రశ్న. ''ఇంతవరకు మనం ఆశావహమైన విధానపరమైన చర్యలు, జి.ఎస్.టి. వంటివాటి అమలును చూశాం. వ్యాపార సంస్థలకు స్నేహపూర్వక వాతావరణాన్ని సృష్టించే ఆర్థిక విధానాలను కొనసాగిస్తూనే, ఈ ప్రభుత్వం వృద్ధి సామర్థ్యాన్ని పెంపొందించ మనకు సరైన కారణాలే కనిపిస్తున్నాయి'' అని కోస్ అన్నారు.

అపార సామర్థ్యం

''వాస్తవానికి, భారత్ 2018లో తన సామర్థ్యంకన్నా మెరుగ్గా పనిచేసి, ముందుకు సాగగలదని మేం భావిస్తున్నాం'' అని ఆయన అన్నారు. ''వచ్చే 10 ఏళ్ళలో భారతదేశ వృద్ధి సామర్థ్యం దాదాపు 7 శాతం మేరకు ఉండవచ్చు'' అని ఆయన చెప్పారు. జి.ఎస్.టి. ప్రధానమైన మైలురాయి అయినందువల్ల, ఆ విషయంలో భారత ప్రభుత్వం ''చాలా తీవ్రంగా'' ఉంది. బ్యాంకింగ్ రీక్యాపిటలైజేషన్ కార్యక్రమం కూడా నిజంగా ముఖ్యమైనదని కోస్ చెప్పారు. ''ఈ సమస్యలలో కొన్నింటిని భారత ప్రభుత్వం ఇప్పటికే గుర్తించింది. పరిష్కార చర్యలు చేపడుతోంది. ఈ చర్యలిచ్చే ఫలితాలు చూసేందుకు కూడా అది సుముఖంగా ఉంది'' అని ఆయన అన్నారు. ''భారత్ చాలా పెద్ద ఆర్థిక వ్యవస్థ. దానికి అపారమైన సామర్థ్యం ఉంది. అదే సమయంలో, దానికుండే సమస్యలు దానికున్నాయి. ఈ ప్రభుత్వానికి ఈ సవాళ్ళ గురించి కూడా బాగా తెలుసు. వాటిని పరిష్కరించడంలో దాని వంతు కృషిని అది చేస్తోంది'' అని ప్రపంచ బ్యాంక్ అధికారి అన్నారు. భారత్‌పై 2017 సంవత్సరానికి సంబంధించి ప్రపంచ బ్యాంక్ తాజా వృద్ధి అంచనా, అంతకుముందు వేసిన అంచనా కన్నా 0.5 శాతం తక్కువగా ఉంది. వచ్చే రెండేళ్ళలో కూడా అది 0.2 శాతం తక్కువగా ఉంది. ''ఇంతకుముందు అంచనాకన్నా ఇది కొద్దిగా తక్కువ. భారత్ ప్రధాన సంస్కరణలు చేపడుతూండడమే దానికి ప్రాథమిక కారణం'' అని కోస్ అన్నారు. ఈ సంస్కరణలు విధానపరమైన అస్థిరతను కొంత తెచ్చే మాట నిజమేనని ఆయన అన్నారు. ''కానీ, భారత్‌కు సంబంధించి పెద్ద అంశం ఒకటుంది. భారతదేశ వృద్ధి సామర్థ్యాన్ని, 2019 సంవత్సరం, 2020కి సంబంధించి మేం వెల్లడించిన సంఖ్యలను పరిశీలిస్తే, అది వేగంగా వృద్ధి చెందే పెద్ద ప్రవర్ధమాన మార్కెట్ అని తెలుస్తుంది'' అని ఆయన అన్నారు.


గత ఆర్థిక సంవత్సరంనాటి 7.1 శాతంకన్నా కొద్ది తక్కువగా 2017-18లో భారత్ వృద్ధి రేటు 6.7 శాతంగా ఉండగలదని దక్షిణాసియా ప్రాంతీయ పత్రికా ప్రకటనలో ప్రపంచ బ్యాంకు పేర్కొంది. దీనికి జి.ఎస్.టి. ప్రభావాలు కొంత కారణమని, అలాగే, కంపెనీల లాభ నష్టాల పత్రాల్లో దీర్ఘకాలంగా ఉన్న బలహీనతలు, కార్పొరేట్ రుణ భారాలు, బ్యాంకింగ్ రంగంలోని నిరర్థక రుణాలు కారణమని, ఇవి ప్రైవేటు పెట్టుబడులను వెనక్కి లాగుతున్నాయని ఆ ప్రకటన తెలిపింది.

యూనివర్సిటీ ఏర్పాటులో సోనమ్ వాంగ్ చుక్

'3 ఇడియట్స్' చిత్రంలో ఫన్‌సుఖ్ పాత్రకు ప్రేరణ ఆయనే

న్యూఢిల్లీ: జమ్ము కశ్మీర్‌లోని లడఖ్ ప్రాంతంలో రూ. 800 కోట్లతో నైపుణి ఆధారిత విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పాలని నవ పరివర్తనశీలి, విద్యావేత్త సోనమ్ వాంగ్‌చుక్ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆమిర్ ఖాన్ నటించిన '3 ఇడియట్స్' చిత్రంలో ఫన్‌సుఖ్ వాంగ్‌డు పాత్రకు ప్రేరణ సోనమ్ వాంగ్‌చుక్కే. ఆయన 'సెక్‌మోల్' పేరుతో ఒక సంప్రదాయేతర పాఠశాలను నెలకొల్పారు. అది ఆ ప్రాంతంలో విద్యారంగ సంస్కరణ తెచ్చింది. దాంతో, ఇంటర్మీడియట్ స్థాయి వరకు పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యే విద్యార్థుల సంఖ్య మెరుగుపడింది. ఈసారి వాంగ్‌చుక్ మరింత పెద్దదానికి ప్రణాళికా రచన చేస్తున్నారు. ఇది విద్యార్థులు ఐదు వేళ్ళూ లోపలికి పోయేంత ఆదాయం గడించడానికి సహాయపడుతుందని ఆయన భావిస్తున్నారు. లడఖ్‌లో హిమాలయన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్‌నేటివ్స్ పేరుతో ఒక యూనివర్సిటీ నెలకొల్పే ఆలోచనలో ఉన్నట్లు ఇంజనీర్ నుంచి విద్యావేత్తగా మారిన వాంగ్‌చుక్ చెప్పారు. ఫయాంగ్ లోయలో 200 ఎకరాలకు పైగా వైశాల్యంలో ఇది అవతరించనుంది. లడఖ్ హిల్ కౌన్సిల్ భూమిని కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఆయనకు ఈ ఆలోచన ఒక ఏడాది కాలంగా ఉంది. ప్రారంభ నిధులు సమీకరించుకునేందుకు ఆయన క్రౌడ్‌ఫండింగ్ ప్లాట్‌ఫాం మిలాప్‌తో చేతులు కలిపారు. ''మొదటి దశలో 2018 మార్చి-ఏప్రిల్ నుంచి మేం మా మొదటి సమీకృత పర్వత ప్రాంత అభివృద్ధి కోర్సును ప్రారంభించాలని కోరుకుంటున్నాం. దానికి మాకు రూ. 14 కోట్లు కావాలి. మిలాప్‌లో క్రౌడ్ ఫండింగ్ ద్వారా 2018 జనవరి 26కల్లా రూ. 7 కోట్లు సమీకరిస్తాం. ఈ పథకాన్ని ముందుకు తీసుకెళ్ళేందుకు కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమం కింద కంపెనీల నుంచి మరో రూ. 7 కోట్లు సేకరిస్తాం'' అని ఆయన చెప్పారు.

క్రౌడ్ ఫండింగ్ కాంపైన్‌లో కూడా కొందరు ఊహకందని వాలంటీర్లు పాలుపంచుకోబోతున్నారు. గుర్గాంవ్‌లోని రిడ్జ్ వ్యాలీ స్కూలుకు చెందిన 8వ తరగతి విద్యార్థి అర్జున్ రాజావత్ తన స్కూలు స్నేహితులు, బంధువులలో ప్రచారం చేసి లక్ష రూపాయల వరకు సేకరించారు. అదే విధంగా, ముంబయిలోని సింగపూర్ ఇంటర్నేషనల్ స్కూలు విద్యార్థులు వివిధ కార్యకలాపాల ద్వారా రూ. 2 లక్షలు సేకరించారు. ''మారుమూల విసిరేసినట్లుగా ఉన్న ఈ ప్రాంత ప్రజల కోసం నేను అన్నింటినీ వదులుకున్నాను. నేను స్వయంగా రూ. 2 కోట్లు సమకూర్చాను. లడఖ్ వచ్చి విద్యా రంగం నుంచి ప్రాథమిక జీవనశైలి వరకు ఏయే సమస్యలున్నాయో చూడవలసిందిగా, ఈ కలను సాకారం చేయడంలో నాకు సహాయపడవలసిందిగా ఇన్వెస్టర్లను ఆహ్వానించాను'' అని వాంగ్‌చుక్ చెప్పారు. విద్యార్థులకు ఏ విధమైన డిగ్రీలు ఆఫరు చేస్తారని అడిగినప్పుడు, విద్య రెండు పద్ధతుల్లో ఉంటుందని ఆయన జవాబిచ్చారు. ఒకటి గుర్తింపు పొందిన కోర్సు. రెండోది ''నైపుణ్య ఆధారిత డిగ్రీయేతర'' కార్యక్రమం.




సర్టిఫైడ్ కోర్సుకు ఫీజులు చెల్లించాలి. నైపుణ్య ఆధారిత కోర్సులు నేర్చుకునే విద్యార్థులకు యూనివర్సిటీయే పారితోషికం చెల్లిస్తుంది. టీచర్లు వ్యవసాయం, వ్యాపారం, టూరిజం ఏ రంగానికి చెందినవారైనా కావచ్చు. ఎక్కువ మార్కులు గడించిన డిగ్రీకన్నా వారికి ఆచరణాత్మక పరిజ్ఞానం ఎక్కువగా ఉండాలి. సర్టిఫికేషన్ కోసం జమ్ము కశ్మీర్ ప్రభుత్వంతో చర్చలు సాగుతున్నాయని ఆయన తెలిపారు.

పెద్ద బ్యాంకులే ప్రధాన లబ్ధిదారులు

Fitch Ratings

న్యూఢి ల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకులకు తిరిగి మూలధనాన్ని సమకూర్చే ప్రభుత్వ ప్రణాళిక రుణాల వృద్ధికి ఆలంబనగా నిలవడంపై దృష్టిపెట్టే అవకాశం ఉన్నందువల్ల, పెద్ద బ్యాంకులే ప్రధాన లబ్ధిదారులవుతాయని క్రెడిట్ రేటింగ్ సంస్థ 'ఫిచ్' పేర్కొంది. ప్రభుత్వ రంగ బ్యాంకుల పటిష్టతకు రూ. 80,000 కోట్ల రీక్యాపిటలేజేషన్ బాండ్లకు లోక్‌సభ గతవారం ఆమోదం తెలిపింది. ప్రభుత్వం రెండేళ్ళ కాలంలో జారీ చేయాలనుకుంటున్న రూ. 1.35 లక్షల కోట్ల రీక్యాప్ బాండ్లలో ఇది మొదటి భాగం అవుతుంది. ''రుణాల వృద్ధి లక్ష్యంగానే మూలధనాన్ని సమకూర్చడం ఉంటుందని ప్రభుత్వ అధికారులు సూచిస్తున్నారు. అంటే ఆరోగ్యకరమైన స్థితిలో ఉన్న పెద్ద బ్యాంకులే ప్రధాన మూలధన గ్రహీతలవుతాయి'' అని 'ఫిచ్' ఒక ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వ రంగ బ్యాంకులకు రూ. 2.11 లక్షల కోట్ల మేరకు మూలధనం సమకూర్చనున్నట్లు ప్రభుత్వం గత ఏడాది అక్టోబరులో ప్రకటించింది.

మథుర రిఫైనరీ యూనిట్ల పునర్నిర్మాణం



మథుర: నవకల్పనలకు వెళ్ళడంతోపాటు, రెండు యూనిట్లను పునర్ వ్యవస్థీకరించుకోవాలని మథుర చమురు శుద్ధి కర్మాగారం నిర్ణయించుకుంది. మథుర రిఫైనరీ 2020 నాటికి 100 శాతం బి.ఎస్.సిక్స్ గ్రేడ్ ఇంధనాన్ని ఉత్పత్తి చేయాలన్న లక్ష్యాన్ని నెరవేర్చేందుకు ఆ నిర్ణయం తీసుకుంది. ''ఇప్పుడున్న రెండు రియాక్టర్లు, కొలిమికి మూడవ రియాక్టరు తోడవడంతో, మథుర రిఫైనరీకి చెందిన ప్రైమ్ జి (గాసోలిన్ డి-సల్ఫరైజేషన్) యూనిట్‌ను పునర్నిర్మిస్తున్నాం. సల్ఫర్ కంటెంట్ 8పిపిఎం (డబ్ల్యు.టి) మాత్రమే ఉండేట్లు బి.ఎస్. సిక్స్ పెట్రోలు ఉత్పత్తి చేసేందుకు ఆ పని చేస్తున్నాం'' అని మథుర రిఫైనరీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ల్యారీ రైట్ ఖాంగ్‌విర్ మంగళవారంనాడు మీడియా ప్రతినిధులకు చెప్పారు. పునర్నిర్మిస్తున్న యూనిట్లు రెండూ 2019 సెప్టెంబరు నుంచి పనిచేయడం ప్రారంభిస్తాయని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. భారత్ ప్రస్తుతం బి.ఎస్. ఫోర్త్ నిబంధనలు పాటిస్తోంది. దీని నుంచి బి.ఎస్. సిక్స్ నిబంధనలకు గెంతాలని భారత్ భావిస్తోంది. అవి యూరో-సిక్స్ నిబంధనలతో సమానం. అయితే, ఉద్గారాలను అరికట్టేందుకు జాతీయ రాజధాని ప్రాంతంలో బి.ఎస్.సిక్స్ ఇంధనాలను 2018 నుంచే అమలులోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఢిల్లీ జాతీయ రాజధాని ప్రాంతానికి బి.ఎస్.-సిక్స్ హైస్పీడు డీజిలు (హెచ్.ఎస్.డి) సరఫరా చేయడమే రిఫైనరీకి ఈ ఏడాది పెద్ద లక్ష్యమని ఖాంగ్‌విర్ చెప్పారు. ఢిల్లీ ఎన్.సి.ఆర్.కి బి.ఎస్.-సిక్స్ ఇంధనాల లక్ష్యాలను సవరించినందువల్ల, కొన్ని నవకల్పనలకు కూడా వెళ్ళాలని కంపెనీ నిర్ణయించుకుంది. ఇంతవరకు బి.ఎస్.-సిక్స్ నిబంధనలు పాటిస్తున్న హెచ్.ఎస్.డి.ని మహీంద్రా అండ్ మహీంద్రా, జె.సి.బి. ఇండియా లిమిటెడ్, బోష్ లిమిటెడ్, హోండా మోటార్స్, డైమ్లర్ ఇండియా కమర్షియల్ అండ్ అట్లాస్ కాప్కో వంటి ప్రధాన ఆటోమొబైల్ దిగ్గజాలకు సరఫరా చేస్తున్నట్లు ఆయన చెప్పారు. మథుర రిఫైనరీ బి.ఎస్.-సిక్స్ ఎం.ఎస్. పెట్రోలు నెలకు 50 వేల మెట్రిక్ టన్నులు, బి.ఎస్.-సిక్స్ హెచ్.ఎస్.డి నెలకు 140 వేల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి చేయగలదు. జాతీయ రాజధాని ప్రాంత అవసరాలు తీర్చడానికి అది 20 వేల మెట్రిక్ టన్నుల పెట్రోలు, 50 వేల మెట్రిక్ టన్నుల డీజిలు సరఫరా చేయవలసి ఉంది.


సూచీలలో స్వల్ప క్షీణత

ముంబయి: ఈ వారంలో వెలువడనున్న కంపెనీల త్రైమాసిక ఫలితాలు, వచ్చే నెల కేంద్ర బడ్జెట్‌ను దృష్టిలో ఉంచుకొని మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించడంతో సెన్సెక్స్, నిఫ్టీలు బుధవారం స్వల్పంగా క్షీణించాయి. ఆసియాలో ఇతర స్టాక్ మార్కెట్లు 2007 తర్వాత తిరిగి చేరిన గరిష్ఠ స్థాయిల నుంచి వెనక్కి తగ్గడంతో కూడా దేశీయ సెంటిమెంట్ దెబ్బతింది. జపాన్ బయట ఆసియా-పసిఫిక్ ప్రాంత స్టాక్ మార్కెట్ల స్థితిగతులను సూచించే విస్తృతమైన మోర్గాన్ స్టాన్లీ క్యాపిటల్ ఇండెక్స్ 0.47 శాతం క్షీణించింది. బి.ఎస్.ఇ. సెన్సెక్స్ బుధవారం 10.12 పాయింట్లు క్షీణించి 34,433.07 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్.ఎస్.ఇ. నిఫ్టీ 4.8 పాయింట్లు క్షీణించి 10,632.20 పాయింట్ల వద్ద ముగిసింది. హెచ్.డి.ఎఫ్.సి. లిమిటెడ్ వంటి ఫైనాన్షియల్ సంస్థల షేర్ల ధరలు క్షీణించగా, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ వంటి ఐ.టి. కంపెనీల షేర్ల ధరలు పెరిగి సూచీలు మరింత నష్టపోకుండా అడ్డుకట్ట వేశాయి. 'ట్రాయ్' సిఫార్సులను అనుసరించి టెలికాం ఆపరేటర్ల స్పెక్ట్రమ్ హోల్డింగులపై పరిమితిని టెలికాం కమిషన్ సడలించిందనే వార్తలతో టెలికాం కంపెనీల షేర్ల ధరలు పెరిగాయి. రానున్న కేంద్ర బడ్జెట్‌లో కొన్ని ప్రజాకర్షక చర్యలు ఉండవచ్చని, ఈ ఏడాదికన్నా ప్రభుత్వం ఎక్కువ వ్యయానికి దిగవచ్చని మదపరులు భావిస్తున్నారు.

పంటల బీమాకు అధిక కేటాయింపు




న్యూఢిల్లీ: ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజన (పి.ఎం.ఎఫ్.బి.వై)కు 2018-19 బడ్జెట్‌లో ప్రభుత్వం రూ. 13,000 కోట్లు కేటాయించవచ్చు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దానికి రూ. 10,701 కోట్లు మాత్రమే కేటాయించారు. కేంద్రం 2018-19 సంవత్సరపు బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న సమర్పించనుంది. 2016 మొదట్లో ప్రారంభించిన ఉన్నతపరచిన పంటల బీమా పథకం పి.ఎం.ఎఫ్.బి.వై. కింద, రైతులు నామమాత్రపు ప్రీమియం చెల్లించి, పంట నష్టానికి పూర్తి క్లైమ్ పొందగలుగుతున్నారు. బీమా చేస్తున్న మొత్తంలో సుమారు 10 శాతం పెరుగుదల ఉండవచ్చనే అంచనాతో వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను పి.ఎం.ఎఫ్.బి.వై.కి బడ్జెట్ కేటాయింపు రూ. 13,000 కోట్ల వరకు పెరగవచ్చని విశ్వసనీయ వర్గాలవారు తెలిపారు. ఈ అగ్రగామి పథకానికి వచ్చే ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో రూ. 11,000 కోట్లు కేటాయించవలసిందని వ్యవసాయ మంత్రిత్వ శాఖ డిమాండ్ చేసింది. కానీ, ఈ పథకం ప్రాధాన్యం దృష్ట్యా ఆర్థిక మంత్రిత్వ శాఖ నుంచి అంతకన్నా ఎక్కువ నిధులే లభించగలవని వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆశాభావంతో ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా, పి.ఎం.ఎఫ్.బి.వై.కి మొదట్లో ప్రభుత్వం రూ. 9000.75 కోట్లను మాత్రమే కేటాయించింది. అయితే, అదనంగా అవసరమైన రూ. 1701 కోట్లను అనుబంధ డిమాండ్ల ద్వారా పొందారు. దీంతో పంటల బీమా పథకానికి కేటాయించిన మొత్తం రూ. 10,701 కోట్లకు పెరిగింది. 2016-17 సంవత్సరానికి (జూలై-జూన్) మొత్తం పంటల బీమా క్లైమ్ రూ. 15,500 కోట్ల మేర ఉండవచ్చని అంచనా. ఇప్పటికే రూ. 13,661 కోట్ల మేరకు క్లైమ్‌లు వచ్చాయి. దానిలో రూ. 12,313 కోట్లు సెటిల్ చేశారని అధికారిక డాటా వెల్లడించింది. దాదాపు 5.70 తోసమంది రైతులు 2016-17లో పంటల బీమా పాలసీ పి.ఎం.ఎఫ్.బి.వై. కొనుగోలు చేశారు. పి.ఎం.ఎఫ్.బి.వై. కింద రైతుల ప్రీమియంను ఆహారధాన్యాలకు, నూనె గింజల పంటలకు 1.5-2 శాతంగా, తోటలు, పత్తి పంటలకు 5 శాతం వరకు నిర్ణయించారు. ప్రీమియంపై పరిమితి ఏమీ లేదు. క్లైమ్ మొత్తంలో 25 శాతం మొత్తాన్ని నేరుగా రైతుల ఖాతాలలో జమ చేస్తారు.



ప్రపంచంలో ఎత్తయిన (8వేల మీటర్లు దాటిన) పది పర్వత శిఖరాల్లో ఎనిమిది నేపాల్ భూభాగంలోనే ఉన్నాయి. దీంతో పర్వతారోహకులకు ప్రియమైన దేశంగా నేపాల్ మారిపోయింది. యావత్ దేశం పర్వత ప్రాంతం కావడంతో పర్యాటకులు భారీగానే నేపాల్ సందర్శనకు వెళుతుంటారు. పర్యాటకుల ద్వారా వచ్చే ఆదాయమే ఈ దేశానికి కీలకం. హిందూ, బౌద్ధ వారసత్వ విశేషాలతో భారత్, చైనా మధ్యలో ఉన్న ఈ చిన్ని దేశాన్ని సందర్శించాలంటే ఇవి తెలుసుకోండి...

నేపాల్ చూసొద్దాం

భారతీయులు నేపాల్ వెళ్లాలంటే వీసా అక్కర్లేదు. కేవలం పాస్ పోర్టు ఉంటే చాలు. హైదరాబాద్ నుంచి నేపాల్ రాజధాని కాట్మండుకు విమానంలో వెళ్లాలంటే టికెట్ ధరలు రూ.10,000 నుంచి ఉన్నాయి. మూడు నెలల ముందు అయితే రూ.6,000 లభించే అవకాశం ఉంటుంది. బెంగళూరు, చెన్నై నగరాల నుంచి కూడా ఇంచుమించు ఇవే ధరలు ఉన్నాయి. నేపాల్ పొరుగునే ఉన్న దేశం కనుక రోడ్డు, రైలు మార్గం ద్వారానూ నేపాల్ సరిహద్దుకు చేరుకుని పర్యటన ప్రారంభించవచ్చు. ఢిల్లీ నుంచి ఉత్తరప్రదేశ్ లోని గోరఖ్ పూర్ వరకు రైళ్లు అందుబాటులో ఉన్నాయి. రైలు చార్జీ స్లీపర్ లో వెళ్లేందుకు సుమారు 500 రూపాయలుగా ఉంది. (ఈ ధరలు ఎప్పటికప్పుడు మారుతుంటాయని గమనించగలరు.) గోరఖ్ పూర్‌లో దిగి కారు లేదా జీప్ లేదా బస్సులో నేపాల్ సరిహద్దు ప్రాంతమైన సునౌలి వరకు వెళ్లాలి. ఇందుకు సుమారు 3 గంటల సమయం పడుతుంది.



సరిహద్దు దాటిన తర్వాత!

సరిహద్దు దాటి నేపాల్‌లోకి ప్రవేశించిన తర్వాత తిరిగి జీపు మాట్లాడుకుని కాట్మండు చేరుకోవచ్చు. బస్సులు కూడా అందుబాటులో ఉంటాయి. బస్సులో ప్రయాణానికి 9 నుంచి 12 గంటల సమయం పడుతుంది. చార్జీ 150 రూపాయల నుంచి 250 రూపాయల వరకు ఉంటుంది. వారణాసి నుంచి కూడా వెళ్లవచ్చు. రైల్లో వారణాసి చేరుకుంటే... అక్కడి నుంచి తిరిగి సునౌలికి చేరుకోవాలి. అక్కడి నుంచి నేపాల్ లోకి ప్రవేశించి కాట్మండుకు వెళ్లవచ్చు.

ధరలు తక్కువే

నేపాలీ రూపీ విలువ భారతీయ కరెన్సీతో పోలిస్తే 62 పైసలతో సమానం. ఒక రోజు విడిదికి 400 రూపాయల స్థాయి నుంచి హోటల్స్ ఉన్నాయి. మంచి హెల్లో బస చేయాలంటే 800 రూపాయల వ్యయం చేయాల్సి ఉంటుంది. నేపాల్లో ఖాట్మండు మినహా మిగిలిన ప్రాంతాల్లో 500 రూపాయల నోట్లు మార్పిడి చాలా కష్టం. పర్యటనకు ఖర్చయ్యే మొత్తాన్ని నేపాలీ రూపాయల్లోకి మార్చుకోవాలి. అందులోనూ 10, 20, 50 రూపాయల నోట్ల రూపంలోనే దగ్గర ఉంచుకోవడం నయం. బస్సుల్లో నిలబడేందుకు కూడా చోటు ఉండదు కనుక ట్యాక్సీలను మాట్లాడుకోక తప్పదు. ట్యాక్సీల్లో ప్రారంభ చార్జీ 200 నేపాలీ రూపాయలు ఉంటుంది. ఆ తర్వాత ప్రతి కిలోమీటర్ కు 45 రూపాయలు వసూలు చేస్తారు. ఒక రోజు పర్యటనకు గాను సుమారు 2 వేల నుంచి రెండున్నర వేల రూపాయల ఖర్చు అవుతుందని ఒక అంచనా. భోజనం ధర సుమారు 150 రూపాయలు. వాటర్ బాటిల్ 30 రూపాయలు.

టూర్ ప్యాకేజీలు

థామస్ కుక్ నాలుగు రోజుల కాట్మండు పర్యటన ప్యాకేజీని 15 వేల రూపాయలకు అందిస్తోంది. రానుపోను, విమానయానం, అల్పాహారం, హోటల్లో బస, సైట్ సీయింగ్ సదుపాయాలు కల్పిస్తారు. యాత్రా సంస్థ డాజ్లింగ్ నేపాల్ పేరుతో ఏడు రోజుల టూర్ ప్యాక్‌ను 37 వేల రూపాయలకు అందిస్తోంది. రానుపోను విమానం లేదా రైలు ప్రయాణ చార్జీలను పర్యాటకులు స్వయంగా భరించాల్సి ఉంటుంది. విమానాశ్రయం నుంచి తీసుకెళ్లి హోటల్లో బస, సందర్శక క్షేత్రాలను చూపించడం, బ్రేక్ ఫాస్ట్, డిన్నర్ వసతులకే ప్యాకేజీ పరిమితం. కాట్మండులో మూడు రాత్రులు, ఫొఖారాలో రెండు, చిత్వాన్ లో ఒక రాత్రి విడిది ఉంటుంది.

నేపాల్లో చూడాల్సినవి!

పరమశివుడు స్వయంభువుగా కొలువైన ఉన్నదే పశుపతినాథ్ దేవాలయం. కాట్మాండులో బాగ్మతీ నదీ తీరంలో ఉన్న ఈ ఆలయంలోకి హిందువులకు మాత్రమే ప్రవేశం. సీతాదేవి జన్మస్థానంగా చెప్పబడే జానక్ పూర్ సందర్శన కూడా పర్యటనలో భాగం చేసుకోవాలి. దీనికి మిథిలానగరమనే పేరు కూడా ఉంది. జనకమహారాజుకు సీతాదేవి భూమిలో ఓ పెట్టెలో లభించినది ఇక్కడేనన్నది ఓ నమ్మకం. గౌతమ బుద్ధుడు, వర్ధమాన మహావీరుడు (జైన మతస్థుల చివరి తీర్థంకరుడు), కూడా జానక్ పూర్‌లో నివసించినట్టు చరిత్ర. ఇక్కడి రాజప్రాసాదంలో జానకీదేవి మందిరాన్ని కూడా చూడవచ్చు.

ఫొఖారా పట్టణం

ఫెవా తాల్ సరస్సు పక్కనే ఉన్న ఫొఖారా పట్టణం ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ఒకటి. నాటు పడవలో విహరిస్తూ అన్నపూర్ణ పర్వత శిఖరాల అందాలను చూడడం వాహ్వా అనిపిస్తుంది. కాట్మాండ్‌కు సమీపంలోని నాగర్ కోట్ కూడా ప్రముఖ పర్యాటక ప్రాంతం. వేడిగా, తియ్యగా, మసాలాతో కూడిన చియా పానీయాన్ని ఒక్కసారైనా రుచిచూడాల్సిందే. ఇది నేపాల్ జాతీయ పానీయం. ఎవరెస్ట్ (8,848 మీటర్లు), కాంచన్ జంగ (8,586 మీటర్లు), లోట్సే (8,516 మీటర్లు), మకాలు (8,485 మీటర్లు), చోఓయు(8,201 మీటర్లు), దౌలగిరి (8,167 మీటర్లు), మనస్లు (8,163), అన్నపూర్ణ (8,109 మీటర్లు) వంటి అత్యంత ఎత్తయిన పర్వత శిఖరాలు ఇక్కడ ఉన్నాయి. వీటిని చూసి వచ్చేందుకు అనువుగా రవాణా వసతులు కూడా ఉన్నాయి. 10 రోజుల అన్నపూర్ణ శాంక్చురీ ట్రెక్ ఇక్కడ పాప్యులర్. సెప్టెంబర్, నవంబర్ మాసాల్లో, మార్చి, ఏప్రిల్ మాసాల్లో ఇక్కడ ట్రెకింగ్‌కు అనుకూలం. ట్రెక్కింగ్ అంటే దూరంగా జరిగే వారు కూడా ఒకసారి నాగర్ కోట్ ను సందర్శిస్తే పర్వతారోహణ చేయాలని ఉబలాటపడతారు. అలాగే, నేపాలీ రాజ కుటుంబం లోగడ నివసించిన దర్బార్ స్క్వేర్ ప్రస్తుతం సందర్శకులకు అందుబాటులో ఉంది. 2008 వరకు నేపాల్ రాచరిక పాలనలో ఉంది. నారాయణ్ హితి ప్యాలస్ దీనికి కేంద్రంగా ఉండేది. ప్రస్తుతం ఇది మ్యూజియంగా సందర్శకులకు కనువిందు చేస్తోంది.











బౌద్ధనాథ్ స్థూపం

తెల్లటి వర్ణంలో ఉండే బౌద్ధనాథ్ స్థూపం యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడాల జాబితాకెక్కింది. దీనితోపాటు స్వయంభునాథ్ స్తూపం బౌద్ధులకు సంబంధించి ప్రముఖ ప్రదేశంగా ఉంది. స్వయంబునాథ్ స్థూపాన్ని 20 కిలోల బంగారం తొడుగుతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. కాట్మండుకు పది కిలోమీటర్ల దూరంలో భక్తపూర్ ఉంది. 1702 కాలం నాటి పొడవైన న్యాటపోల ఆలయాన్ని ఇక్కడ చూడవచ్చు. దర్బార్ స్క్వేర్, రాయల్ ప్యాలస్, ఆర్ట్ గ్యాలరీ తదితర విశేషాలు కూడా ఉన్నాయి. ఇక అధిక సంఖ్యలో ఆలయాలతో కూడిన పఠాన్ ప్రాంతం కూడా సందర్శనీయ స్థలాల్లో ఒకటి. 1,700 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉన్న లాంగ్ టాంగ్ నేషనల్ పార్క్ పర్యాటకులు చూడతగినది. ఎత్తయిన పర్వత ప్రాంతంలో మంచు, జలపాతాలు, వృక్షాలతో చూడచక్కగా ఉంటుంది. మొత్తానికి నేపాల్ సందర్శన ఓ అందమైన అనుభూతిగా మిగులుతుంది.

విలాసవంతమైన హోటల్




అత్యంత ఖరీదైన, అందమైన ప్రాంతాలు ప్రపంచంలో చాలానే ఉన్నాయి. మనం ఇప్పుడు అలాంటి ఓ హోటల్ గురించే మాట్లాడు కుంటున్నాం. ఆ హోటల్ చాలా అందంగా ఉంటుంది. అందులో విడిది చేసేందుకు దేశవిదేశాల నుంచి సెలబ్రిటీలు పోటీపడుతుంటారు. ఇటలీ మిలన్‌లోని ఎక్సలేషియార్ గలియా అనే ఈ హోటల్ ప్రత్యేకమైంది. ఈ హోటల్ మొత్తం బుల్లెట్ ప్రూఫ్‌తో, కట్టుదిట్టమైన భద్రతావలయంలో ఉంటుంది. అదే దీని ప్రత్యేకత. ఇక్కడ ఉండే అద్దాలన్నీ బుల్లెట్ ప్రూఫ్‌లే. చెక్‌ఇన్ నుంచి చెక్‌అవుట్ వరకు ప్రత్యేకమైన నిర్మాణశైలి కనిపిస్తుంది. హోటల్‌లోని ప్రతి గదికీ ఓ ప్రత్యేకమైన లిఫ్ట్, కాంప్రెస్ హాల్, కింగ్‌సైజ్ బెడ్‌రూమ్, స్విమ్మింగ్‌పూల్ ఉంటుంది. ఇక్కడికి పెద్ద పెద్ద రాజకీయనేతలు, ధనికులు వస్తుంటారు. అందుకే ఇది ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన హోటల్‌గా పేరుగాంచింది. ఏంటి? అంత ఖరీదా అను కుంటున్నారా?! అవు నండీ.. ఈ హోటల్ లోకి వెళ్లాలంటే మీ దగ్గర కనీసం రూ.17 లక్షలు ఉండాలి. అది ఒక రోజు ఉండటానికి మాత్రమే సుమా!

ట్రెక్కింగ్‌కు సిద్ధమయ్యారా?



కొండలను ముద్దాడే మేఘాలు, పొగమంచు కప్పుకున్న పచ్చదనం, నీటి తుంపర్లు.. ఇలా ప్రకృతిని అందాలను తనివితీరా ఆస్వాదించేందుకు చాలామంది పర్యాటకులు ట్రెక్కింగ్‌కి సిద్ధమవు తుంటారు. అలా అడుగులో అడుగువేస్తూ పక్షులను, జంతువు లను పలకరించుకుంటూ ముం దుకు సాగిపోయేందుకు ట్రెక్కింగ్ ఎంతో అనువుగా ఉంటుంది. అయితే, ట్రెక్కింగ్ స్పాట్‌లో ప్రయాణించేటపుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే ట్రెక్కింగ్ చిరస్మర ణీయమైన అనుభవంగా మిగిలిపోతుంది. ట్రెక్కింగ్ చేసేటపుడు కాళ్లకు తేలికపాటి బూట్లు ఎంచుకోవటం మంచిది. కొండల అంచులపై జారిపోకుండా సౌకర్యవంతంగానూ, నాణ్యమైనవిగా ఉండేవి ధరించాలి. ఎందుకంటే, ట్రెక్కింగ్ చేసే సమయంలో కాళ్లు ఉబ్బుతాయి. ఈ సందర్భాలలో అడుగుల ఒత్తిడిని భరించే మన్నికైన బూట్లు కొనుగోలు చేయాలి. దానిద్వారా పాదాలపై పడే ఒత్తిడిని నివారించుకోవచ్చు. చిన్న బెణుకులు సంభవించినా ట్రెక్కింగ్ చేయటం పెద్ద సవాల్‌గా మారుతుంది. అలాంటి సమయాల్లో వీలైనంత వరకూ యాత్రను విరమించుకుంటేనే మంచిది. లైట్‌వెయిట్ ఉన్న వాటర్‌ప్రూఫ్ బ్యాక్‌ప్యాక్ ట్రెక్కింగ్‌కు చక్కగా ఉపకరిస్తుంది. అలాగే తడి, పొడి బట్టలను వేరుచేసుకునేందుకు వీలుగా సంచులు ఏర్పాటు చేసుకోవాలి. సన్‌గ్లాసెస్‌ను వెంట తీసుకువెళ్లడం మంచిది. ఎత్తయిన ప్రదేశాలకు వెళ్లేటప్పుడు సూర్య కాంతి దగ్గరైనట్లుగా కళ్లమీద తీవ్ర ప్రభావం చూపుతుంది. దీంతో తలనొప్పి, ఒణుకు వంటి సమస్యలు వస్తాయి. అవి రాకుండా సన్‌గ్లాసెస్ కాపాడతాయి. బ్యాగ్‌లో జత తేలికపాటి చెప్పులను కూడా వెంట తీసుకువెళ్లాలి. ట్రెక్కింగ్ సమయంలో శిబిరాల్లో ఉండాల్సి వస్తుంది. ఎత్తయిన ప్రదేశాలకు వెళ్లినపుడు పాదాలకు గాలి తగలాలి. అందుకు తేలికపాటి చెప్పులు ధరిస్తే హాయిగా ఉంటుంది. వాటర్‌ప్రూఫ్ చెప్పులను తీసుకువెళితే మంచిది. తడి ప్రదేశాలలో ఫంగస్ విపరీతంగా వ్యాపిస్తుంది. దాంతో తక్కువ సమయంలోనే ఇన్‌ఫెక్షన్ల బారినపడొచ్చు. తేమ వాతావరణం కాబట్టి బాక్టీరియా కూడా త్వరగా విజ ంభిస్తుంది. కాబట్టి ఇన్‌ఫెక్షన్లు సోకకుండా క్రీములు తీసుకువెళితే మంచిది.

సన్‌సెట్ చూశారా?



ఉరుకుల పరుగుల జీవితంలో ప్రశాంతత కావాలని ఎవరు కోరుకోరు చెప్పండి? మనసుకు ప్రశాంతతను చేరువ చేసే ప్రదేశాల కోసం వెళ్లాలనుకునేవాళ్లకు వెంటనే గుర్తుకోచ్చేవి సన్‌సెట్ పాయింట్లు. ఆకాశాన్ని చాలాసార్లు నీలం రంగులోకానీ, ఒక్కోసారి ఎరుపురంగులో ఉండడం మనం చూసి ఉంటాం. మేఘాలయలోని సూర్యుడు కొండలు, సరస్సుల మాటుకు జారుకోవడం భలే విచిత్రంగా అనిపిస్తుంది. నీలం, ఎరుపు రంగులను కలిపి ఒక కొత్త రంగు మనకు కనిపిస్తుంది. భారతదేశంలోని చివరి భాగంగా చెప్పుకునే కన్యాకుమారి ప్రపంచంలోని సన్‌సెట్ ప్రదేశాలలో ది బెస్ట్ అని చెప్పుకోవచ్చు. ఈ ప్రాంతాన్ని పచ్చని పర్యావరణానికి చిరునామాగా కూడా చెబుతారు. సముద్రపు అలలను చించుకుంటూ బయటికి వస్తున్న సూర్యుని చూడ్డానికి ఇక్కడికి అధికసంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. రాజస్థాన్‌లోని మౌంట్ అబు ప్రాంతాన్ని సాయంత్రం వేళ చూడాలి. మనల్ని మనమే మైమరిచిపోయేంతంగా ఉంటుంది ఆ ప్రాంతం. చిన్న చిన్న కొండల మధ్య నుంచి మెల్లగా జారుకుంటున్న ఎర్రని సూర్యుడిని చాలా సేపు అలానే వీక్షించవచ్చు. గుజరాత్ లోని కచ్‌రానా ఆఫ్‌లో సన్‌సెట్ విచిత్రంగా అనిపిస్తుందని చెప్పాలి. దూరాన ఉన్న భూమి అంతా తెలుపురంగులో కనిపిస్తుంది. కానీ సాయంత్రం అవ్వగానే సూర్యుడు కిందకు చేరుకునే సమయం రాగానే అక్కడి భూమంతా బంగారవు వర్ణంలో మెరిసిపోతుంది.

రంగులు పంచే నది

ప్రపంచ వ్యాప్తంగా అందమైన నదులు ఎన్నో ఉన్నాయి. అయితే, మనం ఇప్పుడు మాట్లాడుకునే నది కొంచెం వినూత్నంగా కనిపిస్తుంది. ఈ నది నీళ్లు తెలుపురంగులో కాకుండా చూపరులను ఆకర్షించే రంగులలో కనిపిస్తాయి. అదే ప్రపంచంలోనే అత్యంత అందమైన నదిగా పేరొందిన 'కెనో క్రిస్టల్' నది. ఇది కొలంబియాలో ఉంది. దీన్ని 'రివర్ ఆఫ్ కలర్స్' అని పిలుస్తారు. వేసవికాలం నుంచి వర్షాకాలం వరకూ నిత్యం ఈ నదిలో 'మెక్‌రేనియా' మొక్కలు ఉంటాయి. ఈ కారణంగా నది నీళ్లు రంగు మారుతూ కనిపిస్తాయి. ఈ మొక్కలు సగం నీటిలో, సగం బయట ఉంటాయి. దీని రంగురంగుల పూలు నదితోపాటు చుట్టూ ఉన్న ప్రాంతానికీ అందాన్ని తెచ్చిపెడతాయి. ఈ నదిలో చాలా గుహలు కూడా ఉన్నాయండోరు! అయితే, ఈ నదిని చేరుకోవడం కాస్త కష్టం.



రైల్లో విహారం



అందమైన పర్వతాలు, ప్రకృతి సౌందర్యాలతో హిమాచల్‌ప్రదేశ్ ప్రపంచంలోనే ప్రఖ్యాతిగాంచింది. స్థానికంగా ఉన్న టూర్‌ట్రైన్ సందర్శకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. దీన్ని చూసేందుకు, ఇందులో ప్రయాణించడానికి దేశవిదేశాల నుంచి ఏటా పర్యాటకులు వస్తుంటారు. టూర్‌ట్రైన్ ప్రయాణించే మార్గంలో 102 సొరంగాల మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. 900 పర్వతాలను దాటుకుని వెళ్లాలి. ఈ ట్రైన్‌లో వెళ్లేటప్పుడు కండఘాట్, కనో మధ్యలో సాగే ట్రైన్ ప్రయాణం ఒళ్లు గగుర్పాటుకు గురిచేసేలా ఉంటుంది.

రైల్‌సెక్షన్‌లో 10,33,91 సురంగ్ చాలా పెద్దవి. ట్రైన్ నుంచి బయటికి చూడటమంటే ఓ సాహసమే! అది చాలా భయంకరంగా కనిపిస్తుంటుంది. అయితే, ఈ సొరంగాల్లో ప్రయాణం ప్రకృతి అందాలను చేరువచేసే అనుభూతిని మిగుల్చుతుంది అన్నది పర్యాటకుల మాట! బడోగ్ స్టేషన్ 'సాక్సన్ హార్ట్' అని పిలుస్తారు. ఎందుకంటే, ఇక్కడ ట్రైన్ మూడంతస్తుల వంతెన నుంచి వెళుతుంది. మొత్తం పర్యాటకంలో ఆదృశ్యం తప్పక చూడాల్సిందే.

మనం స్పోర్ట్స్
గురువారం, 11 జనవరి, 2018
www.manamnews.com



ఆంచల్ సంచలనం

అంతర్జాతీయ స్కీయింగ్‌లో భారత్‌కు తొలి పతకం

న్యూఢిల్లీ: హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన 21 ఏళ్ల ఆంచల్ ఠాకూర్ మంగళవారం చరిత్ర సృష్టించింది. టర్కీలో జరుగుతున్న ఆల్పైన్ ఎజ్డర్ 3200 కప్ టోర్నీలో ఆంచల్ కాంస్య పతకం గెలిచి సంచలనం సృష్టించింది. స్కీయింగ్‌లో భారత్‌కు పతకం రావడం ఇదే తొలిసారి. స్కీయింగ్ ఇంటర్నేషనల్ గవర్నింగ్ బాడీ ఇంటర్నేషనల్ స్కీ ఫెడరేషన్ (ఎఫ్ఐఎస్) ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయి. 'నెలల తరబడి శ్రమకు ఫలితం దక్కింది. శుభారంభం చేశాను. మంచి ఆధిక్యాన్ని కొనసాగించాను. చివరికి మూడో స్థానంలో నిలిచాను' అని పోటీల అనంతరం ఆంచల్ చెప్పింది. ఆంచల్ మనాలీలోని బరువా అనే చిన్న గ్రామానికి చెందింది. ఈమె తండ్రి రోషన్ ఠాకూర్ వింటర్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు కార్యదర్శి. తన తండ్రి ద్వారా ఆంచల్ ఈ క్రీడను ఎంచుకుంది. తర్వాత మాజీ ఒలింపియన్ హీరా లాల్ వద్ద శిక్షణ తీసుకుంది. 'ఆంచల్ పతకం సంపాదించడం భారత్‌లో ఈ క్రీడకు గొప్ప పేరు ప్రఖ్యాతులను తెచ్చిపెట్టింది. ఆమె సాధించిన ఘనతకు యావత్ స్కీయింట్ వర్గం గర్విస్తోంది. ఆంచల్ నాకు వాట్సప్ ద్వారా మాట్లాడి పతకాన్ని చూపించింది. పోటీల అనంతరం క్రీడాకారులందరికీ ఏదో జ్ఞాపకార్థ చిహ్నం ఇచ్చారని అనుకున్నాను. కానీ తాను కాంస్యం గెలిచినట్టు ఆమె చెప్పింది' అని ఆంచల్ తండ్రి వివరించారు. ఆంచల్ అంతర్జాతీయ కెరీర్ కోసం ఆమె తండ్రి ఎక్కువగా డబ్బు ఖర్చు చేసేవారు. ఆమె విదేశాలకు వెళ్లేందుకు మాత్రం ఎఫ్ఐఎస్ డబ్బులు ఇచ్చేది. అయితే ఎంతో ఖరీదైన ఈ క్రీడకు గుర్తింపునిచ్చి మద్దతివ్వాలని ఆంచల్ తండ్రి కోరుకుంటున్నారు. ప్రొఫెషనల్ స్కీయర్ ఎక్విప్‌మెంట్ కొనడానికి రూ. 5 నుంచి రూ. 10 లక్షలు ఖర్చవుతుంది. 'ఆంచల్ సాధించిన పతకం మా ఆలోచనలకు సహాయపడుతుందని భావిస్తున్నాను. 2018 వింటర్ ఒలింపిక్స్‌లో నా కుమారుడు, కుమార్తె పాల్గొనాలని ఆశిస్తున్నాను. ఒక ఒలింపిక్స్ నుంచి మరో ఒలింపిక్స్ వరకు కేంద్ర ప్రభుత్వం ప్రయాణ, ఇతర వసతులకు మాత్రమే నిధులు ఇస్తోంది. మిగతా సమయాల్లో సొంత ఖర్చుతో పోటీల్లో పాల్గొనాల్సివస్తోంది' అని ఆంచల్ తండ్రి అన్నారు.

ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం నుంచి మా క్రీడకు ఎటువంటి మద్దతు లేదు. నేను ఒక్కటే చెప్పదలచుకున్నాను. మేము కూడా భారత్ కోసం అనుక్షణం శ్రమిస్తూనే ఉన్నాం' అని ఆంచల్ పేర్కొంది. ఆంచల్ చండీఘర్‌లోని డీఏవీ కాలేజిలో చదువుతోంది.

పాపా కృషి వల్లే నేను ఈ స్థాయికి చేరుకున్నా

ప్రస్తుతం అందరి దృష్టి ఆంచల్‌పై ఉంది. కానీ ఆమె సోదరుడు హిమాన్షు కూడా అల్పైన్ స్కీయర్. ఇతను సోచి వింటర్ ఒలింపిక్స్‌లో ల్యూగర్ శివ కేశవన్‌తో కలిసి పాల్గొన్నాడు. తన తండ్రి కృషి లేకపోతే తాను స్కీయింగ్‌ను ఎంచుకునేదాన్ని కాదు, ఈ స్థాయికి వచ్చేదాన్ని కాదు అని ఆంచల్ చెప్పింది. 'ఏడో తరగతి చదువుతున్నప్పటి నుంచి నేను యూరప్‌లో స్కీయింగ్ చేస్తున్నాను. నేను స్కీని కావాలని పాపా అనునిత్యం కోరుకునే వారు. దీని కోసం తన పరిధి దాటి డబ్బు ఖర్చు చేసేవారు. ఒక్కసారి ఆలోచించండి.. ప్రభుత్వ సాయం లేకుండా ఆయన నా కోసం, నా సోదరుడి కోసం ఎంత డబ్బు వెచ్చించివుంటారు? ఆయన కృషి లేకపోతే నేను ఈ స్థాయికి వచ్చేదాన్ని కాదు. మాకు ఎదురయ్యే గొప్ప సవాల్ ఏంటంటే.. ఏడాదిలో చాలా రోజులు భారత్‌లో మంచు ఉండదు. దీంతో మేము విదేశాలకు వెళ్లి శిక్షణ తీసుకోవాల్సి వస్తోంది' అని ఆంచల్ వివరించింది.

ఆంచల్‌కు ప్రధాని మోడీ అభినందనలు

చరిత్ర సృష్టించిన భారత స్కీయర్ ఆంచల్ ఠాకూర్‌కు ప్రధాని నరేంద్ర మోడీ అభినందనలు తెలిపారు. 'టర్కీలో జరిగిన అంతర్జాతీయ స్కీయింగ్ పోటల్లో నువ్వు సాధించిన చారిత్రాత్మక ఘనతకు యావత్ దేశం మైమరచిపోయింది. భవిష్యత్తులో ఇంకా ఎన్నో పతకాలు సాధించాలని కోరుకుంటున్నా' అని మోడీ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

ప్రభుత్వం ఉదాసీనత వీడాలి: ఆంచల్

అంతర్జాతీయ స్కీయింట్‌లో భారత్‌కు తొలి పతకాన్ని అందించిన ఆంచల్ ఠాకూర్ ఒకే ఒక్క కోరికను కోరింది. వింటర్ స్పోర్ట్స్ పట్ల కేంద్ర ప్రభుత్వం ఉదాసీనత ధోరణి వీడాలని ఆమె కోరుకుంది. పతకం గెలిచి పట్టలేనంత ఆనందంతో ఉన్న ఆమె ప్రధాని మోడీ అభినందనలు తెలిపారంటే నమ్మలేకపోతోంది. 'ప్రధాని నాకు ట్వీట్ చేస్తారని కలలో కూడా ఉహించలేదు. కలలా అనిపిస్తోంది. ఇతర అథ్లెట్ల మాదిరిగానే నన్ను కూడా చూస్తారనుకున్నాను. ఎందుకంటే

వింటర్ స్పోర్ట్స్‌కు ప్రభుత్వ సాయం అవసరం: రోషన్

ఆమె ఓ చిన్న గ్రామానికి చెందింది కావచ్చు.. కానీ మనాలీ సుందరమైన కొండ ప్రాంతం. ఈ ప్రాంతానికి చెందిన ఆంచల్ ఠాకూర్ భారత క్రీడా చరిత్రలో ఎవ్వరూ ఊహించని చరిత్ర సృష్టించింది. అయితే ఆంచల్ సాధించిన ఘనతకు ఆమె తండ్రి రోషన్ లాల్ ఠాకూర్ పట్టరాని ఆనందంతో ఉన్నారు. ప్రతి తల్లిదండ్రులకు ఇలాంటి కోరికే ఉంటుందని.. తన కల నిజమైందని రోషన్ అన్నారు. 'నా ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. చిన్నప్పటి నుంచి అంటే 4 ఏళ్ల వయసు నుంచి ఆమె కఠోర శిక్షణ తీసుకుంటోంది. మాకు వీలైనంత సహాయం చేశాం. కానీ బాధాకరమైన విషయమేంటంటే.. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయమూ అందలేదు. ఈ పతకం ఆమెకు గుర్తింపును తెచ్చింది. ఇప్పుడైనా ఆమెకు సాయం అందుతుందని భావిస్తున్నాను. ప్రధానమంత్రి, క్రీడల మంత్రి ఆంచల్ ప్రతిభను గుర్తించాలి. ఇప్పుడైనా పరిస్థితిలో మార్పు వస్తుందని ఆశిస్తున్నాను' అని ఆంచల్ తండ్రి రోషన్ అన్నారు.




విదేశాల్లో శిక్షణ చాలా ఖరీదైంది

విదేశాల్లో శిక్షణ చాలా ఖరీదైందని ఆంచల్ తండ్రి చెప్పారు. 'యూరప్‌లో 10 నెలలు శిక్షణ ఇస్తారు. కానీ రెండు నెలల కంటే ఎక్కువ రోజులు శిక్షణ తీసుకోలేం. ఎందుకంటే అక్కడ శిక్షణ చాలా ఖరీదైంది' అని ఆంచల్ తండ్రి రోషన్ తెలిపారు. ఇక వచ్చే నెలలో సౌత్ కొరియాలో జరగనున్న వింటర్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడమే తన తదుపరి లక్ష్యమని స్కీయర్‌గా మారిన వృష ప్లేయర్ ఆంచల్ చెప్పింది. 'వింటర్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాలంటే ఐదు రేస్‌లలో 140 కంటే తక్కువ పాయింట్లు స్కోర్ చేయాల్సి ఉంటుంది. నేన ఒక్క రేస్‌లో కూడా సాధించలేకపోయాను. మొన్న స్వర్ణం గెలిచిన రేసర్ కూడా ఒలింపిక్స్‌కు అర్హత సాధించలేకపోయింది. ఎందుకంటే ఆమెకు కూడా 140కిపైగానే పాయింట్లు వచ్చాయి' అని ఆంచల్ తెలిపింది. వింటర్ ఒలింపిక్స్ అర్హతకు ఈ నెల 21 చివరి తేదీ కావడంతో ఆంచల్ కాలానాకి ఎదురీదుతోంది.

ఒలింపిక్స్‌లో టీ20 క్రికెట్‌ను చేర్చాలి

బీసీసీఐ మద్దతు కోరుతున్న ఇంగ్లండ్ మాజీ క్రికెటర్



న్యూఢిల్లీ: కనీసం పదేళ్లకైనా టీ20 క్రికెట్‌ను ఒలింపిక్స్‌లో చేర్చాలని మాజీ క్రికెటర్లు కోరుతున్నారు. ఈ వారంలో సిడ్నీలో జరగనున్న ఎంసీసీ వరల్డ్ క్రికెట్ కమిటీ సమావేశంలో ఒలింపిక్స్‌లో టీ20 క్రికెట్‌ను చేర్చే అంశంపై ప్రధానంగా చర్చ జరగనుంది. ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను చేర్చడంపై ఒత్తిడి తేవాలని మాజీలు కోరుకుంటున్నారు. 2024లో పారిస్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో లేదా 2028లో లాస్ ఏంజెల్స్‌లో జరిగే ఒలింపిక్స్‌లోనైనా ప్రవేశపెడతామన్న ఆశాభావాన్ని అడ్మినిస్ట్రేటర్లు కృలించాలని మాజీలు ఆశిస్తున్నారు. అయితే సొంత ఒలింపిక్ కమిటీతో గొడవ పడుతున్న బీసీసీఐ గురించి తమ కంగారు పడుతున్నామని ఇంగ్లండ్ మాజీ బ్యాట్స్‌మన్ మైక్ గాటింగ్ అన్నారు. 'నన్ను కలవరపెడుతున్న అంశాల్లో ఇదొకటి. ఈ అంశంపై మరోసారి దృష్టి పెట్టాలని బీసీసీఐకి విజ్ఞప్తి చేస్తున్నా. క్రికెట్ బోర్డులు మద్దతిస్తే వీలైనంత త్వరగా సాధ్యమవుతుంది. దీని కోసం అందరూ వెయ్యికళ్లతో ఎదురు చూస్తున్నారు. ఇది క్రికెట్‌కు కూడా మంచి చేస్తుంది' అని గాటింగ్ అన్నారు. మెజారిటీ మెంబర్ నేషన్స్ ఒత్తిడి తెస్తే సాధ్యమవుతుందని గతంలో ఐసీసీ కూడా చెప్పింది.

మా వాళ్లు సత్తా చాటుతారు

ఇండియా అండర్-19 కోచ్ ద్రవిడ్



క్రైస్ట్‌చర్చ్: అండర్-19 వరల్డ్ కప్‌లో పాల్గొనేందుకు ఇండియా అండర్-19 జట్టు ప్రస్తుతం న్యూజిలాండ్‌లో ఉంది. ఈ టోర్నీ ఈ నెల 13న ప్రారంభమవుతుంది. మొన్న జరిగిన ప్రాక్టీస్ మ్యాచ్‌లో సౌతాఫ్రికా జట్టును ఇండియా ఓడించింది. అయితే ఇండియా అండర్-19 జట్టు కోచ్, లెజెండ్ రాహుల్ ద్రవిడ్ భారత అభిమానులకు ట్విట్టర్‌లో వీడియో మెసెజ్ పెట్టారు. తమ కుర్రాళ్లు సత్తా చాటేందుకు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నారని ఆ మెసేజ్‌లో ద్రవిడ్ పేర్కొన్నారు. 'తమ ప్రతిభను, సామర్థ్యాన్ని మీకు చూపేందుకు ఇండియా అండర్-19 జట్టు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తోంది. మీరు మమ్మల్ని గమనిస్తున్నారని.. మా కుర్రాళ్లు మద్దతిస్తున్నారని మాకు తెలుసు. థ్యాంక్యూ వెరీమచ్' అని ఆ వీడియో సందేశంలో ద్రవిడ్ అన్నారు. పృథ్వీ షా నేతృత్వంలోని ఇండియా-19 జట్టు తొలి ప్రాక్టీస్ మ్యాచ్ ఆడింది. ఆ మ్యాచ్‌లో ఇండియా 323 పరుగులు చేయగా.. సౌతాఫ్రికా జట్టు 133 పరుగులకు ఆలౌటైంది. మూడుసార్లు చాంపియన్‌గా నిలిచిన ఇండియా ఈ టోర్నీలో 14వ తేదీ ఆస్ట్రేలియాతో తలపడుతుంది. రెండ్రోజుల తర్వాత పపువా న్యూ జెనీవాతో ఆడుతుంది. ఆ తర్వాత చివరిగా జింబాబ్వేతో ఆడుతుంది. ఇండియ ఆడే మ్యాచ్‌లన్నీ డే/నైట్ మ్యాచ్‌లే.

టీమిండియాకు పాండ్యా గొప్ప సంపద

సౌతాఫ్రికా ఆల్ రౌండర్ లాన్స్ క్లుసెనర్



కేప్‌టౌన్: టీమిండియాకు హార్దిక్ పాండ్యా గొప్ప అల్ రౌండ్ సంపద అని సౌతాఫ్రికా మాజీ ఆల్ రౌండర్ లాన్స్ క్లుసెనర్ కొనియాడారు. సౌతాఫ్రికాతో ఇక్కడ జరిగిన తొలి టెస్టులో పాండ్యా ఒంటి చేత్తో 95 బంతుల్లో 93 పరుగులు చేయడమే కాకుండా రెండు వికెట్లు తీసి టీమిండియాకు గౌరవప్రదమైన స్కోరును అందించాడు. 'టీమిండియా తొలి ఇన్నింగ్స్లో పాండ్యా ఇన్నింగ్స్ అద్భుతం. అసాధారణ బ్యాటింగ్ ప్రతిభను కనబరిచి ఒత్తిడిని ప్రత్యర్థులపై నెట్టాడు. అతను టీమిం డియాకు అద్భుతమైన ప్లేయర్ కానున్నాడు. అతను ఇప్పుడిప్పుడే ఎదుగుతున్నాడు.

తన బౌలింగ్‌కు మరింత వేగాన్ని జోడించుకు ంటే నిజాంగా పాండ్యా టీమిండియా అ ద్భుతమైన ఆల్ రౌండర్ కాగలడు' అని క్లుసెనర్ అన్నారు. అతి తక్కువ అంత ర్జాతీయ క్రికెట్ కెరీర్‌లో పాండ్యా టీమిం డియాలో రెగ్యులర్ బౌలర్ అయ్యాడు. నిర్ణీతయ ఓవర్ల క్రికెట్‌లో అతను బ్యాట్‌తో, బంతితో చక్కని ప్రతిభ కనబరిచాడు. టెస్టుల్లో ఒక సెంచరీ, రెండు అర్ధ సెంచరీలు చేశాడు.

సెమీస్‌లో ఢిల్లీ డాషర్స్

నార్త్ ఈస్ట్రన్‌పై అనూహ్య విజయం

ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్

హైదరాబాద్: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లో ఢిల్లీ డాషర్స్ జట్టు అనూహ్యంగా సెమీఫైనల్‌కు చేరింది. నార్త్ ఈస్ట్రన్ వారియర్స్‌తో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో ఢిల్లీ డాషర్స్ 4-1తో గెలిచింది. ఆరంభంలో వెనకబడినప్పటికీ ట్రంప్ మ్యాచ్‌లో గెలవ డంతో ఢిల్లీ డాషర్స్ అనూహ్యంగా పుంజుకుని 15 పాయింట్లతో పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో నిలిచింది. తొలుత జరిగిన మిక్సడ్ డబుల్స్‌లో ఢిల్లీ డాషర్స్‌కు చెందిన వి. ఇవనోవ్, అశ్వినీ పొన్నప్ప జోడీ 0-2 (13-15, 11-15)తో నార్త్ ఈస్ట్రన్ వారియర్స్‌కు చెందిన ఎం. లీ, ఎస్‌బీ చెయోల్ జంట చేతిలో ఓడిపోయింది. దీంతో నార్త్ ఈస్ట్రన్ వారియర్స్‌కు 1-0తో తొలి ఆధిక్యం లభించింది. తర్వాత జరిగిన పురుషుల సింగిల్స్‌లో ఢిల్లీ డాషర్స్‌కు చెందిన వాంగ్ కి విన్సెంట్ 2-1 (15-13, 10-15, 15-12)తో నార్త్ ఈస్ట్రన్ వారియర్స్‌కు చెందిన అజయ్ జయరామ్‌పై గెలిచాడు. దీంతో ఢిల్లీ డాషర్స్ జట్టు స్కోరును 1-1తో సమం చేసింది. తర్వాత జరిగిన మరో పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో ఢిల్లీ డాషర్స్‌కు చెందిన టి. హౌవీ (15-10, 8-15, 15-11)తో నార్త్ ఈస్ట్రన్ వారి యర్స్ కు చెందిన డబ్ల్యూటీ వీపై నెగ్గాడు. మూడో గేమ్‌లో 2-8తో వెనక బడిన హౌవీ తర్వాత అద్భుతంగా పుంజుకుని గేమ్‌ను, మ్యాచ్‌ను సొంతం చేసుకు న్నాడు. ట్రంప్ మ్యాచ్‌లో గెలవడంతో ఢిల్లీ డాషర్స్ జట్టు 2-0 ఆధిక్యంతో నిలిచింది. నార్త్ ఈస్ట్రన్ జట్టు 1 పాయింట్ కోల్పోయింది. తర్వాత జరిగిన మరో పురుషుల సింగిల్స్‌లో ఢిల్లీ డాషర్స్‌కు చెందిన ఎస్.జె. హ్యాన్ 2-1 (13-15, 15-11, 15-13)తో నార్త్ ఈస్ట్రన్ వారియర్స్‌కు చెందిన ఎం. లీని చిత్తు చేశాడు. ఈ ట్రంప్ మ్యాచ్‌లోనూ గెలిచినందుకు ఢిల్లీ డాషర్స్ 4-0తో తిరుగులేని ఆధిక్యం సంపాదించింది. చివరిగా జరిగిన మిక్సడ్ డబుల్స్‌లో ఢిల్లీ డాషర్స్‌కు చెందిన వి. ఇవనోవ్, ఐ. సొజొనోవ్ జంటపై 1-2 (15-9, 10-15, 9-15)తో నార్త్ ఈస్ట్రన్ వారయిర్స్‌కు చెందిన ఎస్‌బి చెయోల్, కేజీ జంగ్ ద్వయం నెగ్గింది.

పరిశీలనలో ధావన్-విజయ్ ఓపెనింగ్



సెంచూరియన్: తొలి టెస్టు నాలుగో రోజు ఆటలో టీమిండియా 10 వికెట్లు కోల్పోయింది. వెర్నాన్ ఫిలాండర్ తన స్వింగ్ ప్రతిభను కనబరిచాడు. ఆరు వికెట్లు తీశాడు. అందులో ఇద్దరు టెయిలెండర్లు, ఒక బౌలింగ్ ఆల్ రౌండర్ (అశ్విన్), ఒక ఓపెనర్ (మురళీ విజయ్), ఇద్దరు మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్ (కోహ్లీ, రోహిత్ శర్మ) ఉన్నారు. ఆ మ్యాచ్‌లో ఫిలాండర్ బౌలర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. కెరీర్ అత్యుత్తమ బౌలింగ్ ఫిగర్స్ సాధించాడు. ఇక సెంచూరియన్‌లో జరగనున్న రెండో టెస్టు దిశగా ఇరు జట్లూ కొనసాగుతున్న సందర్భంలో ఫిలాండర్ గురించి ఆలోచిస్తే.. అతను సౌతాఫ్రికా బౌలర్లందరిలోకి చాలా స్లో బౌలర్. తనకు అనుకూలించే వాతావరణంలోనూ పెద్దగా ప్రమాదకరమైన బౌలరేం కాదు. సెంచూరియన్ పిచ్ పేస్ బౌలర్లకు సహకరిస్తుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. అయితే తొలి టెస్టులో కోహ్లీ సేన ఘోర పరాభవం చవిచూడడంతో రెండో టెస్టుకు ఓపెనర్ల పరిశీలన మొదలైంది. ఎవరిని తీసుకుంటే పరువు నిలబడుతుందని టీమిండియా మేనేజ్‌మెంట్ ఆలోచిస్తోంది. నిజానికి కేఎల్ రాహుల్ స్థానంలో శిఖర్ ధావన్ తుది జట్టులోకి వచ్చాడు. 2013లో సౌతాఫ్రికా పర్యటనకు వచ్చిన టీమిండియా రెండు టెస్టులు ఆడింది. వాండరర్స్ మ్యాచ్ డ్రాకాగా.. కింగ్స్‌మీడ్ (డర్బన్) మ్యాచ్‌లో 10 వికెట్లతో టీమిండియా ఓటమిపాలైంది. ఆ రెండు మ్యాచ్‌ల్లోనూ ధావన్, విజయ్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించారు. డర్బన్‌లో విజయ్ 97 పరుగులు చేయగా.. ధావన్ ఇబ్బంది పడ్డాడు. నిజానికి 2010-11లోనూ విజయ్ సౌతాఫ్రికా పర్యటనకు వెళ్లాడు. కానీ మూడు టెస్టు మ్యాచ్‌లకు గాను డర్బన్‌లో జరిగిన మ్యాచ్‌లోనే ఆడాడు. విజయ్‌కి 54 టెస్టులు, టెస్టుల్లో 10 ఏళ్ల అనుభవం, రెండుసార్లు సౌతాఫ్రికా పర్యటనకు వెళ్లడం లాంటివి తన ఖాతాలో ఉన్నప్పటికీ అతను అవుట్ సైడ్ ది లైన్ బాల్‌కు తికమకపడడం, పేలవమైన షాట్ల ఎంపిక, రాంగ్ ఫుటెడ్ స్ట్రోక్స్, డీఆర్ఎస్‌కు దారితీసే ఇద్దరు ఫీల్డ్ అంపైర్ల నిర్ణయంతో అవుట్ కావడం వంటివి విజయ్ ఆట తీరుపై స్ఫూర్తిని ఇవ్వలేకపోతున్నాయి. మరోవైపు ధావన్. సౌతాఫ్రికా పేస్ బౌలింగ్ ముందు ఏమాత్రం నిలవలేకపోతున్నాడు. తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో డేల్ స్టెయిన్ చేతిలో అవుటయ్యాడు. అవుటైనందుకు బాధ లేదు కానీ అవుటైన విధాన మాత్రం చాలా మందిని బాధపెట్టింది. ఈ నేపథ్యంలో కర్ణాటక ఓపెనర్ కేఎల్ రాహుల్‌ను రెండో టెస్టులో ఆడిస్తే మంచిదనే భావన కలుగుతోంది. అన్ని ఫార్మాట్లలో అతను తనేంటో నిరూపించాడు.

జూన్‌లో ఐర్లాండ్ పర్యటనకు టీమిండియా

రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్



న్యూఢిల్లీ: రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం జూన్‌లో టీమిండియా ఐర్లాండ్ పర్యటనకు వెళుతుందని బుధవారం బీసీసీఐ ప్రకటించింది. జూన్ 27న తొలి మ్యాచ్, 29న రెండో మ్యాచ్ జరగనున్నాయి. జూలైలో ఇంగ్లండ్ పర్యటన ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ సమయంలో భారత క్రికెటర్లు ఖాళీగా ఉండడమెందుకని ఈ స్వల్ప సిరీస్‌ను బీసీసీఐ ఖాయం చేసింది. ప్రస్తుతం సౌతాఫ్రికా పర్యటనలో ఉన్న టీమిండియా మూడు టెస్టులతో పాటు ఆరు వన్డేలు, మూడు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. 'జూలైలో ఇంగ్లండ్ పర్యటనకు ముందు టీమిండియా ఐర్లాండ్‌కు వెళ్లి రెండు మ్యాచ్ టీ20 సిరీస్‌లో పాల్గొంటుంది. ఈ రెండు టీ20 మ్యాచ్‌లు డబ్లిన్‌లో జరుగుతాయి' అని బీసీసీఐ పేర్కొంది. చివరిసారిగా టీమిండియా 2007లో ఐర్లాండ్ పర్యటనకు వెళ్లి ఏకైక వన్డే మ్యాచ్ ఆడింది. రాహుల్ ద్రవిడ్ నేతృత్వంలోని టీమిండియా ఆ మ్యాచ్‌లో 9 వికెట్లతో గెలిచింది. పియూష్ చావ్లా, ఎస్. శ్రీశాంత్ మూడేసి వికెట్లు తీసుకోగా.. గౌతమ్ గంభీర్, సౌరవ్ గంగూలీ లక్ష్యాన్ని ఛేదించారు. కానీ తొలిసారి ఐర్లాండ్‌తో టీమిండియా ద్వైపాక్షిక టీ20 సిరీస్ ఆడబోతోంది. 2009 ఐసీసీ టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా ఇంగ్లండ్‌లోని నాట్టింగ్‌హామ్‌లో ఇంతకుముందు ఇండియా, ఐర్లాండ్ జట్లు ఆడాయి. ఆ తర్వాత ఐర్లాండ్ ఐసీసీలో ఫుల్ మెంబర్ దేశంగా నిలిచింది. ఇప్పుడు టెస్టు క్రికెట్‌కు కూడా అర్హత సాధించింది. తొలి టెస్టు మ్యాచ్‌లో ఈ ఏడాది మేలో డబ్లిన్‌లో పాకిస్థాన్‌తో ఆడనుంది. ఐసీసీలో ఫుల్ మెంబర్ సభ్యత్వం పొందిన ఆఫ్ఘనిస్థాన్ టీమిండియాతో తొలి టెస్టు మ్యాచ్ ఆడేందుకు అంగీకరించినట్టు తెలుస్తోంది.

ద్రవిడ్, జోషీ పుత్రుల సెంచరీలు

స్కూలు స్థాయి అండర్-14 క్రికెట్


ద్రవిడ్ కుమారుడు సమిట్

బెంగళూరు: టీమిండియా మాజీ కెప్టెన్, లెజెండ్ రాహుల్ ద్రవిడ్ కుమారుడు సమిట్ తన తండ్రి అడుగు జాడల్లో నడుస్తున్నాడు. కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ) ఆధ్వర్యంలో జరుగుతున్న బీటీఆర్ కప్ అండర్-14 టోర్నీలో సమిట్ మ్యాచ్ విన్నింగ్ సెంచరీ చేశాడు. దీంతో మాల్యా ఆదితి ఇంటర్నేషనల్ 412 పరుగుల భారీ తేడాతో వివేకానంద స్కూల్‌ను ఓడించింది. సమిట్ 150 పరుగులు చేశాడు. అయితే జట్టు స్కోరులో ఇదే అత్యధికం కాదు. ఎందుకంటే మరో మాజీ క్రికెటర్ ఆర్యన్ జోషీ కుమారుడు 154 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మొత్తం మీద మాల్యా ఆదితి జట్టు 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 500 పరుగులు చేసింది. తర్వాత వివేకానంద స్కూల్ జట్టు 88 పరుగులకు కుప్పకూలింది. సమిట్ వార్తల్లో నిలవడం ఇది తొలిసారేమీ కాదు. అండర్-14 కేటగిరిలో సమిట్ స్థిరంగా రాణిస్తున్నాడు. రెండేళ్ల క్రితం టైగర్ కప్ క్రికెట్ టోర్నీలో బెంగళూరు యునైటెడ్ క్రికెట్ క్లబ్‌కు (బీయూసీసీ) ఆడిన ద్రవిడ్ జూనియర్ 125 పరుగులు చేశాడు. ఈ క్లబ్‌కు రాహుల్ ద్రవిడ్ అధ్యక్షుడిగా వ్యవహరించారు. 2015 సెప్టెంబర్‌లో అండర్-12 గోపాలన్ క్రికెట్ చాలెంజ్ టోర్నీలో సమిట్ బెస్ట్ బ్యాట్స్‌మన్ అవార్డు అందుకున్నాడు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id. manamtelugudaily1@gmail.com.